గ్రంథాలయములకు గ్రంథకర్తలకు

# ఇక శ్రమ లేదు.

# ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్.

వార్షికవృత్తాంతములు || లెటరు పేపర్లు
ప్రకటనపత్రికలు || శుభలేఖలు
గ్రంథములు || పోస్టర్లు

మొదలగు అన్నివిధములయిన అచ్చుపనులను బైండింగుపనులను ఎంగ్రేవింగుపనులను
తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతము, హిందీ, అరవము మొదలైన భాషలలో

సరసమగు ధరలకు అందముగా సకాలమునకు

తయారు చేసియిచ్చును.

వలయువారిట్లు వ్రాయవలయును:—

మేనేజరు, ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.

# ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్,

# బెజవాడ.

(౧౯౧౩ సం. ఇండియన్ కంపెనీల ఆక్టు క్రింద రిజష్టరు చేయఁబడినది.)

భాగము ౧కి రు ౨౫ లు చొప్పున ౧౨,౦౦౦ భాగములుగ విభజింప బడినది.

భాగముల సొమ్మును దరఖాస్తుతో రు ౫ లు; అలాటుమెంటు అయినప్పుడు రు ౫ లు; మిగిలినసొమ్ము ఒక్కొక్క మాసమునకు తక్కువకాని వ్యవధిగల ౬ వాయిదాలలో ఇయ్యవలెను!

## డైరెక్టర్లు

౧ శ్రీ హైదా చినరామకృష్ణయ్యగారు, జమీందారు, బ్యాంకరు, కా

౨ కాశినాధుని నాగేశ్వరరావు పంతులుగారు, ఆంధ్రపత్రికాధిపతి; డైరెక్టరు, స్వరాజ్య ప్రింటింగు అండు పబ్లిషింగుకంపెనీ; డైరెక్టరు, హిందుస్పిన్నింగు అండు వీవింగుకంపెనీ, మద్రాసు.

౩ సూరి వేంకట నరసింహశాస్త్రిగారు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ కార్యనిర్వాహకసభకు అధ్యక్షులు; రామమోహన కేంద్ర గ్రంథాలయమునకు అధ్యక్షులు; బెజవాడ.

౪ నడింపల్లి వేంకటలక్ష్మీనరసింహారావుపంతులుగారు, బార్-ఎట్-లా, మేనేజింగు డైరెక్టరు, ఆంధ్ర కర్మాగారము; రాయకూటక్ ఇండస్ట్రియల్ బ్యాంకి కలకత్తా, యొక్క గుంటూరు ఆఫీసు మానేజరు; ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెసు సంఘమునకు కార్యదర్శి, గుంటూరు.

౫ వావిళ్ల వెంకటేశ్వర శాస్త్రులుగారు, ప్రొప్రయిటరు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ సన్సు; డైరెక్టరు, ఇండియన్ పబ్లిషింగుహౌసు; శ్రోత్రియందారు, మద్రాసు.

౬. కావ్యనిధి, చెలికాని లచ్చారావుగారు, సంపాదకులు; శ్రీరామవిలాస గ్రంథమాల, అముద్రితాంధ్రగ్రంథసర్వస్వము; పత్రికాధిపతి, ఆంధ్రభాషావిలాసిని, స్థాపకులు, ఆంధ్రపరిశోధకమహామండలి; జమీందారు, చిత్రాడ, (గోదావరి).

౭ బిక్కని వేంకటరత్నంగారు, కార్యదర్శి, శ్రీబాలసరస్వతీ గ్రంథాలయము, భూస్వాములు, చోడవరము, రామచంద్రపురం తాలూకా, గోదావరిజిల్లా.

౮ బచ్చు నాగభూషణరావుగారు, కార్యదర్శి, జ్ఞానదాయినీ గ్రంథాలయము; భూస్వాములు; బ్యాంకిరు; పేరుకలపూడి, గుంటూరుజిల్లా.

౯ పుతుంబాక నరసయ్యగారు, కార్యదర్శి, శ్రీ వేంకటాద్రినాయని జాతీయపాఠశాల; భూస్వాములు; పెదపాలెం, గుంటూరుజిల్లా.

౧౦ పురాణం సూరిశాస్త్రిగారు, బి. ఏ, భూస్వాములు; ప్రొప్రైటరు, మచిలీపట్నం

౧౧ బొడ్డపాటి హనుమంతరావుగారు, కార్యదర్శి, శ్రీసత్యనారాయణ వరప్రసాద గ్రంథాలయము; భూస్వాములు; బొడ్డపాడు, కృష్ణాజిల్లా.

౧౨ పుచ్చా శ్రీరామశర్మగారు, కార్యదర్శి, ఆర్యబాలసమాజము; భూస్వాములు; పెదపాలెం; గుంటూరుజిల్లా.

౧౩ అయ్యంకి వేంకట రమణయ్యగారు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ గౌరవ కార్యదర్శి, రామమోహన కేంద్రగ్రంథాలయగౌరవకార్యదర్శి, బెజవాడ.

## బ్యాంకర్లు

తాతా ఇండస్ట్రియల్ బ్యాంకి, మద్రాసు, హైదరాబాదు (డక్కన్)
కలకత్తా రాయకూట్ ఇండస్ట్రియల్ బ్యాంకియొక్క గుంటూరు బ్రాంచి.

## ఆడిటరు

జి. నరసింహంగారు, యస్.ఏ.ఏ, ఎఫ్. ఆర్.యస్.ఏ, 307 లింగిశెట్టివీధి, మద్రాసు.

## లీగల్ అడ్వయిజరు

తుర్లపాటి వేంకటేశ్వరరావుగారు, బార్-ఎట్-లా.

## మేనేజింగు డైరెక్టరు

అయ్యంకి వేంకటరమణయ్యగారు.

## రిజిష్టర్డు ఆఫీసు—బెజవాడ

వివరములకై మేనేజింగు డైరెక్టరుగారికి వ్రాయుడు.

ఆంధ్రదేశాభ్యుదయమునకు అత్యంతావశ్యకములగు అమూల్యగ్రంథప్రకటనమునకు కొద్దిరోజులలోనే పూనుకొనును,

ఇదివరకే పనిని ప్రారంభించి యుండుటచేత, మొదటిసంవత్సరమునుండియు లాభము పంచిపెట్టబడును. మొదటిసంవత్సరము నుండియు లాభము పంచిపెట్టు కంపెనీ ఇదియొక్కటేను.

వివరములకు వలయువార్లు వ్రాయవలెను:—

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.

# బాలగంగాధర తిలక్ మహారాజు
## యొక్క సంపూర్ణ ఉపన్యాసములు - జీవితచరిత్ర.

భారతవర్షముయొక్క రాజకీయ చరిత్రను మీరు చదువదలంచినారా?

భారతవర్షముయొక్క స్వాతంత్ర్య పోరాటమును మీరు గుర్తెరుంగ దలచినారా?

## అట్లయిన

బాలగంగాధర తిలక్ మహారాజుయొక్క సంపూర్ణ జీవితచరిత్రమును, సంపూర్ణ ఉపన్యాసములను తప్పక చదువుడు. ఈగ్రంథమును చదువని భారతీయుడు—దేశమననేమో, దానికై పాటుబడుటఎట్లో, ఎప్పటికిని తెలిసికొన జాలడని నిశ్చయముగా జెప్పగలము.

సుప్రసిద్ధాంధ్రదేశభక్తులును, పశ్చిమకృష్ణామండల కాంగ్రెసు సంఘమునకు కార్యదర్శియును, శ్రీకృష్ణజన్మస్థానవాసముచే పవిత్రులును అగు శ్రీ మానికొండ సత్యనారాయణశాస్త్రి. బి. ఏ. గారిచే వ్రాయబడినది. ఇట్టిమహాగ్రంథముయొక్క వెల రు 2 లు మాత్రమే.

వలయువారిట్లు వ్రాయవలెను:—ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

---

# ఆంధ్రభాషాపోషకులకు విజ్ఞప్తి.

రాజమహేంద్రవరమునగల గవర్నమెంటు కళాశాలలో సంస్కృతోపాధ్యాయులుగ పనిచేసి అయిదువత్సరములక్రింద కీర్తిశేషులైన మాతండ్రిగారగు అకుండి వ్యాసమూర్తిశాస్త్రులుగారు వారి జీవితాంత్యవత్సరములలో, యాధ్యాత్మికానందము ననుభవింపఁ గాంక్షించి, సంస్కృతిభారతమును నిర్వచనముగ నాంధ్రీకరింప మొదలిడిరి. ఆదిపర్వాది మొదటి నాలుగైదుపర్వములు, యుద్ధపంచకము, స్వర్గారోహణాపర్వములను మొత్తముమీద సుమారు 12 పర్వములను పూర్తిచేసిరి. ఈయాంధ్రీకరణకాలమందే కవిత్రయమువారి యాంధ్రీకరణములోని స్వల్పపులోపములను మాత్రముగ చూపుచు "భారత ఫక్కి" అను పేరుగల గ్రంథమునువ్రాసి, పిఠాపురమున కొంతకాలముక్రిందట ప్రకటింపఁబడుచుండెడి "కవిత" యను మాసపత్రికలో ప్రకటించిరి. వీరు తమ భారతమునకు "ఆంధ్ర వ్యాస భారత నవనీతము" అనియు, అందలి పర్వభాగములకు "ధార" లనియు బేరిడిరి. కవిత్రయమువారిచే యాంధ్రీకరింపఁబడక విడువఁబడిన సంస్కృతములోని కథాఘట్టములను వీరు విపులముగ నాంధ్రీకరించిరి. కవిత్రయమువారాంధ్రీకరించిన భాగములలో విపులముగ నున్నవానిని వీరు సంగ్రహముగనే వ్రాసిరి. కవిత్రయమువారిచే యాంధ్రీకరింపఁబడిన భాగములను వీరిచే విపులముగ నాంధ్రీకరింపఁబడినట్టి వానిలో కొన్ని భాగములు:—

1. కణికుని రాజనీతి. 2. సనత్సుజాతీయము. 3. భగవద్గీత. 4. విష్ణుసహస్రనామములు మొదలైనవి,

వీరు వెనుకరచించిన గ్రంథములకంటె నీభారతము చాలసులభశైలిలో వ్రాయబడినట్లు పలువురభిప్రాయపడ్డారు. వీరిభారతములో నేభాగములనైనగాని లేక అంతయు ప్రత్యేకముగ గాని, ముద్రింపించి ప్రకటింపఁబూనుటకు శ్రీమత్పుత్రులను, భాషాభిమానులను ప్రార్థించుచున్నాము. ఈగ్రంథమును అచ్చువేయింపఁదలచు యౌదార్యహృదయ మహాశయులు, వితరణశీలురు, యీగ్రంథమునుగూర్చి యీక్రింది ఎడ్రెసుగలవారికి వ్రాసి అన్నిసంగతులు తెలిసికొనగోరుచున్నాము.

చిరునామా:—

అకుండి వ్యాసేశ్వరుడు
"శ్రీశాంతివ్యాసనికేతనము"
ఆరాంపురం. రాజమండ్రి.

ఇట్లు
విన్నవించు విధేయులు,
అకుండి వ్యాసేశ్వరుడు.
అ. వేంకటశాస్త్రి.

# దేశాభిమానులకు విన్నపము

అనేకమంది గాంధిమహాత్ముని భూషించుచున్నారు. కొద్దిమంది వారికి వ్యతిరేకులై యున్నారు. వారిని భూషించువారును, వ్యతిరేకులును—వారినిబట్టి వీరును, వీరినిబట్టి వారును పోవుచున్నారేగాని, నిజముగా గాంధిగారి తత్వమును అర్థము జేసికొని, ఆచరించువారు బహుకొద్దిమంది. గాంధిమహాత్ముని తత్వమునుగూర్చి అస్తిగతము చేసికొననిది దేశమునకు మోక్షములేదు కాబట్టి

## గాంధిమహాత్మునిచే రచింపబడిన

# గాంధి తత్వోపదేశము

అను గ్రంథమును వెంటనే జదువుడు. అనేకమంది దేశనాయకులుగూడ ఈగ్రంథమును ఇంతవరకు జదువకుండుట విచారకరము. అసలు చదివియుండకుండుటకంటె, ఇప్పుడైన వెంటనే చదువుట మంచిదిగాదా? వెల రు 1-0-0 మాత్రమే.

వెంటనే వ్రాయుడు:—ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

---

# డాక్టరు చివుకుల శ్రీరాములుగారి

# ఔషధములు

## ౧ శతభస్మరసాయనము.

శరీరము త్రివిధ శగవల్ల (పసుపు, తెలుపు, యెఱుపు;) అనేక జాడ్యములలోనికిదించి శరీరము గుల్లబారిరో నానావిధమైన సవామేహబాధయున్నను, పాండువ, కుష్టు, మొదలైన వ్యాధులున్నను, శరీరమంతయు పడిగలు పడి కాళ్లుచేతులు మంటలుగాని, పట్టుపట్టియున్నను బలహీనముగాయున్నను, నరముల పటుత్వముతప్పినను తీట మొదలగు వ్యాధులచే బాధపడుచున్నను 21 విధసవామేహములకున్న అమోఘముగా పనిచేయును, యిచ్చా సేరు౧ కి రు 8—0—0లు పోస్టుఖర్చులు ప్రత్యేకము.

## ౨ వీర్యసంజీవి.

రక్తముక్షీణించి నరముల పటుత్వము తప్పి సంభోగేచ్ఛలేక బలహీనముగా నుండు వారలు యీఔషధమును సేవించిన వీర్యవృద్ధి రక్తవృద్ధికలిగి దేహము పుష్టీకరించి మంచికాంతికలుగును. వీర్యస్తంభన కలుగును.

శుక్లనష్టము హరించును, యిందురస విషగంధ కాదులున్నట్లు రుజువు చేయువారికి రు116—0—0నూటపదార్లివ్వబడును.

సేరు రు ౧౦—౦—౦పదిరూపాయలు పోస్టుఖర్చు ప్రత్యేకము

3 అజీర్ణవటి:— పసిబిడ్డలకు దివ్యౌషధము. అజీర్ణము జలుబు దగ్గు పడిశము జ్వరము శైత్యము మొదలగువాటికి బాగుగా పనిచేయును. ౧౦౦మాత్రలు రు ౦—౧౨—౦లు.

౪. కస్తూరిపటి. ౧౦౦మాత్రలు రు ౧—౦—౦

రాజవైద్య చివుకుల శ్రీరాములు,
ఆయుర్వేదవైద్య నిలయం, కొత్తపేట, తెనా

# డక్కన్ మిల్ స్టోర్సు కంపెనీ, లిమిటెడ్,
# బెజవాడ.

---

(1913 సం॥ ఇండియన్ కంపెనీల ఆక్టుక్రింద రిజష్టరు చేయబడినది)

## మూలధనము రు ౩,౦౦,౦౦౦.

భాగము ౧కి రు 100 లు భాగముల సొమ్మును ధరఖాస్తుతో రు 20 లును, అలాటుమెంటు అయినప్పుడు రు 20 లును, మిగిలినసొమ్ము ఒక్కొక్క మాసమునకు తక్కువకాని వ్యవధిగల 3 వాయిదాలలో ఇవ్వవలెను.

## డైరెక్టర్లు:

1 మోతే నారాయణరావుగారు, జమీందారు, విస్సన్నపేట గుండేపల్లి ఎస్టేట్సు; డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు; ఏలూరు.

2 మోతే నరసింహారావుగారు, జమీందారు, విస్సన్నపేట గుండేపల్లి ఎస్టేట్సు; డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు; ఏలూరు.

నంబూరి వేణుగోపాలరావుగారు, ప్రెసిడెంటు, శ్రీకృష్ణాజూట్ అండు కాటన్ మిల్సు, ఏలూరు; వైస్ ప్రెసిడెంటు, యస్. కె. పి. వి. వి. హెచ్. హెచ్. స్కూలు, బెజవాడ; ఆనరరీ బెంచిమేజస్ట్రేటు; డైరెక్టరు, విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకింగు యూనియన్, బెజవాడ; డైరక్టరు, ఏషియాటిక్ కమ్మర్షియల్ అస్యూరెన్సు కంపెనీ బొంబాయియొక్క మద్రాసుబోర్డు; ప్రొప్రైటరు, శ్రీబాలకృష్ణారైస్‌మిల్లు; అండు కంట్రాక్టరు, కనకదుర్గా రయిసుమిల్లు, బెజవాడ.

4 ఉప్పలపాటి బ్రహ్మయ్యగారు, ల్యాండు లార్డు అండు ప్రొప్రైటరు, శ్రీరామలింగేశ్వర రైసుమిల్లు, గుడివాడ.

5 పిన్నమాచనేని రంగయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు శ్రీ వేంకటేశ్వర రైసు మిల్లు, గుడివాడ.

6 కాసూరి వెంకటాచలపతయ్యగారు, ల్యాండులార్డ్సు అండ్ ప్రొప్రైటరు, శ్రీవెంకటకనకదుర్గ మైనింగుకంపెనీ, (నెల్లూరు;) కవుతవరం, కృష్ణాజిల్లా.

7 అడపా రంగయ్యగారు, ల్యాండులార్డ్సు అండ్ ప్రొప్రైటరు, శ్రీశివశంకరరైసుమిల్లు, నరసన్నపాలెం, వీరవల్లిపోస్టు, పార్టనరు ఆఫ్ శ్రీరామలింగేశ్వర రయిసుమిల్లు, గుడివాడ.

8 కలిదిండి గంగరాజుగారు, ల్యాండులార్డ్సు అండ్ ప్రొప్రైటరు, శ్రీరామవరప్రసాద రైసు మిల్లు, తాడేపల్లిగూడెం.

9 కన్నెగంటి వెంకయ్యగారు, ల్యాండులార్డ్సు అండ్ ప్రొప్రైటరు, శ్రీ రామలింగేశ్వర రైసుమిల్లు, దుగ్గిరాల.

10 గుడ్లవల్లేటి గోపాలరావుగారు, పార్టనరు ఆఫ్ బాబు ఏ. వి. రాయి అండు కో. అండు ల్యాండు హోల్డరు, బెజవాడ, (ఎక్సుఅఫిషియో.)

## అక్కవుంట్సు విత్

ది ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెజవాడ.

ది రాయకట్ ఇండస్ట్రియల్ బ్యాంక్, లిమిటెడ్, గుంటూరు.

ది తాతా ఇండస్ట్రియల్ బ్యాంక్ లిమిటెడ్, మద్రాసు.

## ఆడిటర్

జి. నరసింహంగారు, యఫ్. ఏ. ఏ. యఫ్. ఆర్. యస్. ఏ., 307, లింగిశెట్టివీధి, మద్రాసు.

## లీగల్ అడ్వయిజరు

కందుకూరి వటుకభైరవమూర్తి పంతులుగారు, జిల్లాకోర్టు వకీలు, బెజవాడ.

## మేనేజింగు ఏజంటు

గుడ్లవల్లేటి గోపాలరావుగారు.

## రిజష్టర్డు ఆఫీసు—బెజవాడ.

# మాలపల్లి
## లేక
# సంగవిజయం

మొదటి రెండుసంపుటములు తయారైనవి.

సంపుటం ఒకటింటికి వెల ౦-౧౨-౦

## ఆంధ్రభాషయం దింతవరకు ఇట్టి మహాగ్రంథం వెలువడలేదు

దేశభక్తాగ్రేసరులగు ఉన్నవ లక్ష్మీనారాయణగారిచే వాడుకభాషయందు ముద్దులొలుకునటుల వ్రాయబడినది.

ఈగ్రంథము ఆంధ్రవాఙ్మయమునందు

**గొప్ప విప్లవమును** కలుగజేయుననుట కెంతమాత్రము సందేహములేదు.

ఆంధ్రవాఙ్మయమందు "కన్యాశుల్క" మను గ్రంథమొక్కటే ప్రతిభగాంచియున్నది. నేడు ఈగ్రంథము దానిని మరపించి భాషకు నూతనోజ్జీవమును కలుగజేయును. వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు, ఆంధ్రపరిషత్తు, బెజవాడ.



# "విద్యార్థి"

బెజవాడనుండి ప్రకటింపబడుచుండును.


## జాతీయ విద్యావాఙ్మయవిషయిక పక్షపత్రిక

సంపాదకుడు : కురుగంటి సీతారామయ్య, ఎం. ఏ.

ఇందు విద్యాధికుల వ్యాసములు ప్రకటింపబడుచు జాతీయవిద్యాస్వరూపనిరూపణ ప్రయత్నములు సలుపబడును.

చందా సం॥కు ౨-౦-౦.

విద్యాభిమానులందరును చందాదారులు కాప్రార్థితులు.



భక్తాగ్రేసరులు.

11 RSVM01A121

పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆఱవ సంపుటము.

# గ్రంథాలయసర్వస్వము.

ఒకటవ భాగము.

## తిలకము

౧

కలిమికన్నియ కలికినుదుటను
కళలుచిమ్మే కనకతిలకము!
వలపుకృష్ణుని వయసు తేనెకు
పాత్రమయ్యే తిలకమా!

౨

పార్వతీసతి ఫాలతలమున
గర్వరాగముఁ గ్రక్కు తిలకము!
ధూర్వహుండగు ధూర్జటికి ధృతి
దూలఁద్రోసిన తిలకమా!

౩

పలుకుపడతుక పసుపునొసటను
మొలకజీవము లొలుకు తిలకము!
కలసి బ్రహ్మను కంఠమెత్తగ
కౌగిలించిన తిలకమా!

౪

రచ్చకీడిచి రమణి ద్రౌపది
కుచ్చెలలుకొని కోకలూడ్చిన
చిచ్చువలె నా చెలువమొగమున
విచ్చిమండిన తిలకమా!

౫

నరకుపైఁబడి కలహకోలల
సరకు సేయక సాహసముతో
నఱకసాగిన నాఁటిసత్యా
ననమునంటిన తిలకమా!

౬

వెదనకత్తులం వేటలాడే
కడిదిఘోరపు కదనసీమల
తడిసివీరుల పడుచు నెత్తుట
సస్యమయ్యే తిలకమా!

౭

పరిమళమ్ములం పంతమాడగ
పరువపుంజిగి పైకిపొంగే
సరసకాముక శయనగృహముల
చక్కబెట్టే తిలకమా!

౮

సిగ్గువలదని చెంపవేయగ
భగ్గుభగ్గను పచ్చివలపును
బిగ్గనిలిపే పెండ్లికూతురు
నిగ్గులేతే తిలకమా!

౯

ఇనుపసంకెల లేసి త్రోసిన
వనజముఖి దేవకి లలాటము
నెనసి కంసుని హృదయఫలకము
మొనపగిల్చిన తిలకమా!

—రాయప్రోలు సుబ్బారావు.

# భక్తాగ్రేసరులు.

ఈసంచికయందు వేరొకచోట ప్రకటించిన చిత్రపటమున ఆంధ్రదేశమందలి సుప్రసిద్ధ భక్తాగ్రేసరులు నల్వురు కనుపరచబడిరి. వారలనుగూర్చి సంగ్రహముగ నిట వ్రాయుదుము. వీరు వెలనాటిశాఖీయులైన వైదిక బ్రాహ్మణులు. హరితసగోత్రికులు.

## ౧

మొదటివారు బ్రహ్మశ్రీ బలజపల్లి రామమూర్తిశాస్త్రిగారు. వీరిపూర్వికులు కృష్ణాతీరవాసులు. అయినను వీరుమాత్రము గంజాంమండలమందలి శ్రీకాకుళమునందును, ఇపుడు గోదావరిమండలమున కాకినాడయందును తరచుగనుందురు. బాల్యమునందు కొలదిగ నింగ్లీషువిద్య నభ్యసించి యటుపిమ్మట కాశీనగరమునకుబోయి సంస్కృతమున గొంతపాండిత్యమును సంపాదించి, ప్రస్థానత్రయపఠనమును జేసి, వేదాంతశాస్త్రమున అనేకరహస్యములను దెలిసికొనిరి. వీరికి శ్రీభాగవత రామాయణాది గ్రంథములయందు విశేషాభిమానము గలదు. బహ్వార్ద్రహృదయులు. భగవన్నామోచ్చారణమాత్రముననే నరులు కలియుగమున తరింతురను నమ్మకముగలవారు. ఎచటికిబోయినను బహుజనుల నాకర్షించి, వారికి భగవన్నామోచ్చారణమాహాత్మ్యమును బోధించి వారిచే హరిభజనమును జేయింతురు. “గోవింద రాంరాం గోపాల హరిహరి” యనుటయందు వీరికెక్కుడు ప్రీతి. అందుచే వీరు “గోవింద రాంరాం గారు” అనునామమున జనులకు దెలియబడుచు కాకినాడప్రాంతములయం దున్నారు. వీరి దర్శనమే భక్తినిగలుగజేయునని వేరుగ జెప్పనక్కరలేదు.

## ౨

రెండవవారు బ్రహ్మశ్రీ నుప్పి సూర్యనారాయణశాస్త్రిగారు. వీరు వెలనాటిశాఖీయులగు వైదికబ్రాహ్మణులు. హరితసగోత్రికులు. పూర్వపు గోదావరీమండలమున గోస్తనీతీరమున “ఉండి” గ్రామసమీపవాస్తవ్యులు. వీరు గొప్పఉపాసకులు. చిన్నతనముననే కాశికిబోయి గంగాతీరమున తపస్సుజేసి, కొంతకాలమునకు నీదేశమునకు మరలివచ్చిరి. వీరు సర్వదా భగవంతుని దీనబంధువని యారాధించెదరు. “దీనబంధూ!” అని దేవుని బిలుచుచుందురు. వీరితండ్రిగారు గాయత్రీమంత్రానుష్ఠానమును విశేషించి చేసినవారు. కాన వారిని “గాయత్రీమాత” గారని జనులు పిలుతురు. వీరును “దీనబంధు” వను ప్రసిద్ధనామమున దెలియబడుచు గోదావరీమండలమున నున్నవారు.

## 3

మూడవవారు కృష్ణా గోదావరీ మండలములయందు సుప్రసిద్ధులగు బ్రహ్మశ్రీ మల్లాది వెంకటసుబ్బారాయశాస్త్రిగారు. వెలనాటిశాఖీయులగు వైదికబ్రాహ్మణులు, హరితసగోత్రికులు. వీరితండ్రిగారు గుంటూరునందు చాలకాలము నివసించియుండిరి. తండ్రిగారు ఆంధ్రగీర్వాణములయందు పురాణములను జెప్పుచు శ్రోతలచే బహుగౌరవమున బోషింపబడుచుండెడివారు. వీరాంధ్రమున ననేకగ్రంథములజదివి, పెద్దలవలన ననేక రహస్యార్థములనుగ్రహించినవారు. భక్తివీరికి చిన్నతనమునుండియు నున్న సహజతత్త్వము. వీరి పినతండ్రిగారివలన కొన్ని యోగరహస్యములను గ్రహించినవారు. కొలదికాలముమాత్రము రిజస్ట్రీషను డిపార్టుమెంటునం దుద్యోగమున నుండిరి. అనంతరము తమకాలము నంతటిని హరిసేవయందే వినియోగించుచు సంతతభగవన్నామసంకీర్తనము గావించుచు స్వార్జితపితురార్జిత ద్రవ్యము నంతటిని శ్రీమంగళగిరి లక్ష్మీనృసింహస్వామి వారి కర్పించిరి. అందుచే వీరికి “శ్రీహరిదాసు” అనునామము వాడుకలోనికివచ్చెను. వీరియాజమాన్యమున రమారమి నూటయెనిమిది హరిభజన సప్తాహములయిన నైయుండవచ్చును. వీరిగురువులు భద్రాచలసమీపమున నరణ్యమధ్యమం దొకగుహయం దుందురని పెద్దలవలన దెలిసికొని వారిని దర్శించి వారివలన నుపదేశమునొంది కృతార్థులు కాదలచి యాయరణ్యమునకు పోయిరి. అట కొన్నిదినములు దిరుగ, ఒకనాటి మధ్యాహ్నమున నొకగొల్లవాడొకదుత్తపెరుగును, యింకొకదుత్త పాలును దీసికొని యొకగుహద్వారమునకున్న నొకవృక్షమునకుగట్టి వెడలుచుండెను. ఇవి యెవరికొరకిచట గట్టితివనియడుగ నాగొల్లడివి “ఆత్మారామసదాశివ సద్గురువు” లకొరకనియె. వీరే తనగురువులని తెలిసికొని శ్రీహరిదాసుగా రచటవేచియుండిరి. మధ్యాహ్నసమయమున నావృక్షసమీపమునకు వచ్చినమహాపురుషుని సమీపించి వారిపాదకమలములకు వందనములర్పించి తనను శిష్యునిగ పరిగ్ర

హించి కటాక్షించవలయునని ప్రార్థించెను. అంత నా యోగిపుంగవుడు మరల నొకసంవత్సరమాగి రమ్మనిరి. అటులనే శ్రీహరిదాసుగారు మరుసటివర్షమున నాగురువరుల దర్శించి యుపదేశమునందుకొని తదాది వారియుపదేశానుసరణమున సంతతము స్వయముగ భగవన్నామ సంకీర్తనమును జేయుచు నితరులచే జేయించుచు, నామ మాహాత్మ్యమును ప్రకటింపుచు చరించుచుండిరి. భగవన్నామమునుచే గొన్నిమహిమములం గలుగునని వీరిజీవితమున కొన్నినిదర్శనముల జూపించిరి. ఒకచోట వర్షము గురిపించిరి. ఒకచోట యాత్రికులకందరకు నాకసమున దివ్యతేజోవిరాజమానమూర్తులగు శ్రీ సీతారామచంద్రుల జూపించిరి. వీరి కన్నదానమును జేసి, భూతతృప్తి జేయుటయం దతిప్రీతి. అందుచే వీరు గృహస్థాశ్రమమున కాకినాడయం దున్నప్పుడనేకసమారాధనముల జేయుచుండెడివారు. అనంతరమందు భార్యావియోగమయినతరువాత బెజవాడ నింద్రకీలాద్రిపైనున్న శ్రీకనకదుర్గాంబాదేవి సన్నిధిని తపమాచరించి శ్రీదేవి యనుగ్రహదత్తకాషాయవస్త్రధారులై తనువును, ధనమును, మనమును శ్రీహరి కర్పణము జేసిరి. ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గాలయ సమీపమున నున్న కోనేటి సోపానాదులు, శ్రీమంగళగిరి లక్ష్మీనృసింహస్వామి వారియాలయ విమానములగు బంగారుశిఖరములు, శ్రీ స్వామివారి గోపురవిమానములగు సుమారు ముప్పదివేల రూప్యముల విలువగల పదునొకండు బంగారుశిఖరములు శ్రీభద్రాద్రికిబోవుమార్గమున ములకలపల్లియను గ్రామమున చైత్రమాస శుక్లపక్షమందలి యన్నసత్రము, వల్లభాపురమునగల శ్రీరామనామధర్మసత్రము మొదలగునవి శ్రీహరిదాసుగారి కైంకర్యములలో గొన్నియని చెప్పవచ్చును. ఇప్పుడు మిగులవైభవమున, శ్రీసూరి మార్కండేయశాస్త్రి గారిచే నడుపబడుచున్న శ్రీఆగిరిపల్లి వేదశాస్త్రపాఠశాలకు శ్రీహరిదాసుగారు ప్రారంభమున చేయూత నిచ్చినవారు. అనంతరమున వీరు తురీయాశ్రమమును స్వీకరించి కొలదికాలము శ్రీభూమానంద తీర్థులనునామమున యద్వైతబ్రహ్మానందము ననుభవించి రెండువత్సరములక్రిందట శ్రీమంగళగిరియందే సిద్ధినొందిరి. వీరిజీవిత మాదర్శప్రాయము. ఇందు బ్రహ్మచర్య మవిప్లుతనిష్ఠాయుతము. గార్హస్థ్య మనవరతాన్నదానయుతము. వానప్రస్థ మపూర్వ హరికైంకర్యోపేతము. తురీయాశ్రమ మంతరనుభవిత బ్రహ్మానందరసయుక్తము.

౪

నాలవవారు గంగాభగీరథీసమానురాలైన శ్రీకైవారం బాలాంబగారు. ఈమె తెలగాణ్యశాఖీయులగు వైదిక బ్రాహ్మణి. ఈమె భర్తగారు మంగళగిరియం దుండువారు. ఆయన మరణించినతరువాత నీమె శ్రీ మంగళాద్రిపై కొంతకాలము తపమాచరించి, శ్రీహరి యనుగ్రహమును వడసి, శ్రీహరిసేవయే తనకు కర్తవ్యమని నిశ్చయించి శ్రీహరిప్రీతికై మంగళగిరిక్షేత్రమున ననవరతము నన్నదానమును జేయుచుండును. కులమును గోత్రము నడుగక; అన్నార్తులందరును దానార్హులనియే యెంచి తృప్తిగనిడుచు వారువీరనక యన్నిజాతులజనులకు నీమెయే మంగళగిరిక్షేత్రమం దాదరించి యన్నము బెట్టు తల్లియని చెప్పవచ్చును. ప్రతి ముక్కోటియేకాదశికి వీరియింట అధమమొక యయిదువేలమందియైన భుజింతురు. ప్రతి ఫాల్గుణ శు॥ పూర్ణిమకు శ్రీలక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవములు జరుగుసమయమున, వీరియిల్లే పెద్దయిల్లు. పదిరోజులు ప్రతి పగలు రాత్రియు కొన్నివేలమంది యిట భుజింతురు. వీరు జేయుయాదరమునకు మేరలేదు. గోదావరీమండలమున గన్నవరమున నన్నదానమునకు ప్రసిద్ధులగు శ్రీమతి డొక్కా సీతమ్మగారనువారొకరుండెడివారు. వారికీర్తి దిగంతవిశ్రాంతము. వారితరువాత నన్నదానమునకు పేరుజెప్పవలసినవారు శ్రీ బాలాంబగారినియే చెప్పవలయును. శ్రీహరియే శరణ్యుడని నమ్మి యాతడే సర్వమయుడని నిశ్చయించి, భూతతృప్తి జేయుటయే శ్రీహరిసేవయని ప్రవర్తించువారల జీవితమెట్లుండునో మంగళగిరి శ్రీబాలాంబగారి యింటికిపోయి ఫాల్గుణ శుద్ధపంచమి మొదలు పూర్ణిమవరకు నటనుండిన చక్కగ బోధపడగలదు. ఓంతత్సత్.

—చెరుకుపల్లి బుచ్చిరామయ్య.

# విప్రయోగి

(షెల్లీపద్యముల కనువాదము)

కొప్పర్తి నారాయణ, బి. ఎ., ఎల్. టి.

ఊటలన్నియు బ్రవహించు నేటఁ గలియు
సాగరముఁ జేరఁ దుముకు నిర్ఝరచయంబు
గగనవాయువు లొండొంటిఁ గౌఁగిలించు
హర్ష సంభ్రమోత్కృష్ట సంఘర్ష మనగ
తనకుఁ దానై బ్రదుక నిలఁ దగముగాదు!
దైవమర్మ ప్రపాలన ధర్మమునను.
ఒకటి యొకదానితో నైక్య మొందగాను
ఊర్జితముగ నింగలయ కే నుండ నేల?
భూధరాగ్రముల్ దివినిక్కి ముద్దుగొనును
పొరలు తరగములొండొంటిఁ బొందుగాంచు
తోడిసుమముల నిరసించు దుడుకుతనము
కట్టిదుడుపడె పూవులఁ గఠినమౌని.
చంద్రికలు ప్రాలి ముద్దిడ సంద్ర మొగయు
కువలయేశుని కరములఁ గుంకరేఁయు
దినకరాశ్లేషమున భువి తేజరిల్లు
ఇట్టి చుంబనాశ్లేషము లేమి లెక్క
నీవు నను గౌఁగిలించి ముద్దిడకున్న!

---

# నవీనాంధ్రకవులు

వాల్మీకిమహాకవి కరుణాంతరంగుడు. వేలగూలిన పిట్టకై వగచి మొదటిపద్యము నుచ్చరించెను. రామగుణానురక్తుడై యుప్పొంగి రామకథామృత ముత్పత్తిజేసెను. "శ్లోకత్వమాపద్యతయస్య శోకః." నానాదేశముల ఆదికవులు ప్రకృతిసౌందర్య మవలోకించియు, మహాపురుషుల వీరోదారగుణగౌరవంబును మెచ్చియు, అందున జనించు రసభావ నిరంకుశావేశమును పట్టజాలక, వాగ్రూపమున వెల్లడింప దొల్లిటి పద్దెపొత్తము లేర్పడినవి. వీరు చూచినవియు, అనుభవించినవియు వీరి సంభావనాపరిభావమున వన్నెచిన్నెలు దాల్చి, వీరి వినిర్మలాంతఃకరుణారంగంబున జగద్విస్తీర్ణసత్వమును జెంది యాదికావ్యము లన శోభిల్లుచున్నవి. రసావేశచోదితంబులుగాన వీరికృతులు సామాన్యముగ గేయమాధుర్యమొప్పారు లలితపదపుంజములతో గూర్పబడినవి. వీరికల్పనాసంచారములు కావ్యలక్షణములై తరువాతికవుల బాగోగులకు హేతువులై పరిణమించెను.

కవులావల, రాజానుగ్రహము వడసి, ధనికులగొలిచి, వందిజనంబులై యేలికల వేడుకకొరకును, మెప్పుకొరకును, లక్షణబద్ధమైన ప్రబంధముల నేర్పరచసాగిరి. కొందరచ్చటచ్చట బరమేశ్వరుని లీలావసస్వరూపముల నభినందించుచు, భవబంధవిమోచన మరయుచుండిరి. ఏడనో ఒకడు రసభావోద్వేగమున నాత్మసంతృప్తికై పద్యము లల్లుచుండెను. దేవభారతి యీగతిలో నస్తమించెను. యూరపుఖండమున నిట్టివాఙ్మయవ్యవస్థ 1770 వరకుండెనని చెప్పవచ్చును.

తరిమిలాన యూరపులో స్వభావకవిత్వ మనదగునది (Nature Poetry) యుదయించి, సర్వవిషయముల గుణరూపభేదముల పాటింపక, కావ్యోచితేతివృత్తముగ నంగీకరింపుచు ప్రకృతియందును, మానవజంతుస్వభావములందును గోచరించు పరతత్త్వ మూహింపుచుండెను. కావ్యము, నిబద్ధమర్యాదులైన ప్రభువులకుగాని, యపారగుణాలంకృతుడైన పరమేశ్వరునకుగాని, సంబోధింపు తెరవులదప్పి జనసామాన్యమును జూచుచుండెను. ఇందుచే కవులిష్టముచొప్పున స్వతంత్రసంచారశీలురై కావ్యముల గాథారూపముల బహురీతుల విస్తరించిరి. స్వభావవర్ణనము వెల్లగ దివ్యజ్ఞానసూచికమై "సర్వము నతని దివ్యకళామయమంచు" నూహింపసాగెను. అనిర్వాచ్యనిర్మలానందసంశోభితంబగు (Mystic Poetry) కావ్యప్రయత్నములు పాశ్చాత్యమతసాంఘిక సాంప్రదాయములలో వికసింప నవకాశముగాక, యూరపు భూభాగవాసులందరీనాడు హైందవకవితామృతబిందువుల రుచిగొని యానందించుచున్నారు. రవీంద్రు

డీపాశ్చాత్యభావదాహము నపనయించి విశ్వవిఖ్యాతుడై యున్నాడు.

పౌరాణికులనదగు మొదటికవులు ప్రకృతియందున, మానవనైజమందునగల గొప్పవిశేషముల పాటింపుచుండిరి. ప్రబంధరచకులగు మధ్యకాలపు కైతగాండ్రు ఏదో ఒకఐశ్వర్యవిభూతినొప్పు గాథను చిత్రింపుచుండిరి. వీరు వాఙ్మయచిత్రకారులు. ఆధునికులగు స్వభావనిరూపకులు అన్నివిషయముల కావ్యోచితకల్పనాగ్రాహ్యములుగ నంగీకరింపుచున్నారు. నానాదేశముల పద్యవాఙ్మయచరిత్ర మీవిధి వికాసమొందియున్నది. మహావీరుడు, సామ్రాట్, పిల్లజమీందారుడు, వర్తకుడు సామాన్యమానవుడు కాలక్రమమున మానవసంఘమునెల్లెడ వ్యక్తిప్రభావమంతరించి, సంఘప్రభావ మున్నతిగాంచుచుండ నాయాకాలధర్మముల ననుసరించి కవితారీతులు వేర్వేరుదారుల ననుసరించినవి. ఏకాలమున నేరీతికావ్యము లేర్పడినను, మానవులకవి రెండువిధముల నుపకరించుచున్నవి. నీతివర్తనమువలని లాభముల దెలుపుచు, నవి నీతినాశనకారణమని యెఱుంగజేయుచు, నున్నతమైన, సుందరమైన, పవిత్రమైన జీవనాదర్శలక్ష్యముల నిర్ణయించుచు సుఖానుభవమును పరహితవ్రతమును నెల్లకావ్యములు నెలకొల్పుచుండును. తరువాత—విశ్వరాజ్యము జగన్మయమనియు, వాని లీలాసంకల్పఫలములై నానావిధములగు పెద్దచిన్నలు, సుగుణదుర్గుణములు, గలుగుననియు నిదర్శించి, సర్వభూతములయం దనుకంప ముదయింపజేసి, మానవనైజమును స్వార్థసంపాదనాద్యభిచారదోషముల నుండి మఱలించి పరమేశ్వరుని యనూనవైభవప్రభావముల కచ్చెరువడజేసి భక్తివిశ్వాసభరితులుగ నొనర్చు సామర్థ్య మెల్లకావ్యములకుండును.

కాలక్రమమున కవులు, పౌరాణికులు, ప్రాబంధికులు, స్వాభావికులు, దివ్యజ్ఞానసూచకులు అని చెప్పుచున్నాము. నిజముగా నిది ఆయాకాలముల సామాన్యకావ్యలక్షణమును సూచించునేగాని, యెల్లకాలములలో నన్నివిధములగుకవు లుండి, తమతమ ఇంద్రియవికాసమును, మేధాసంపత్తిని, ఆత్మసంస్కారమును ననుసరించి, రసభావసంస్ఫురణముల నందుచుందురు. కవులలో గొందఱు ద్రష్టలై, కొందఱు జ్ఞానులై ధర్మనిర్దేశములజేయ నోపియున్నారు. కొందరు యోగులై ప్రకృతివిలాసప్రచారములం దొకమహాద్భుత శిల్పనైపుణ్యమును, ధర్మసామ్యమును, దివ్యసంకల్పమును జూచుచుందురు. వీరు స్వభావమును వేర్పఱచి వర్ణించియు గుణరూపాతీతమైన తత్త్వము నుద్బోధింపుచుందురు. స్వభావకవులు ప్రత్యక్షము నభినందించుచు తాము చూచిన, అనుభవించిన, విషయముల యథార్థముగ జిత్రించుచున్నారు. అలంకారయుతమైన ప్రబంధకవులు తమ ప్రత్యక్షరసభావానుభవములను, విశ్వాసలోకనములను మేధాశక్తుల విస్తరించి, వన్నెచిన్నెల నొనగూర్చి, స్వభావసందర్భముల కొకభావవైచిత్ర్యము గల్పించి, పౌరాణికప్రతిభ లేకున్నను, సామాన్యతత్త్వమైనదానిగ జేసి, పదవృత్తిసౌష్ఠవంబుల జిలిపఱచి యందమగు, లలితరసోద్దీపకంబగు, కావ్యము నమర్చుచున్నారు. ఇక భావకవులనువారు (Lyrical Poets) స్వభావావలోకనప్రేరితమైన సూక్ష్మాంశముల దటపోయుచు రససృష్టి గావించుచుందురు. పౌరాణిక ప్రాబంధిక స్వాభావికకవులు మువ్వురియందు పైజెప్పిన గుణవిశేషములు వేర్వేరుప్రభావములతో నెక్కువతక్కువగ జేరి పురికొల్పుచుండును. అందరు గుణరూపధర్మపరిమితిగల ప్రపంచమును జ్ఞానేంద్రియమనోబుద్ధ్యహంకారపరిమితమైన తమ మేధస్సులతో నవలోకింపుచుందురు. అందరు ప్రకృతియందలి రూపమును భావమును రసమును జూచుచుందురుగాని వీరిలో నొక్కొక్కటి యొక్కొక్కజాతికవి కెక్కువ యానందము నుదయింపజేసి దాని కెక్కువ ప్రాముఖ్యత నొసంగ నుత్సాహపఱచును. నిజముగా కావ్యవాఙ్మయపు ప్రధానతత్త్వములో ప్రాచీనము మధ్యము నాధునికము అనుభేదములు లేనేలేవు. కాలవ్యవస్థయే కాదు; దేశవ్యవస్థయు కావ్యమునకులేదు. కావ్యములందు గోచరించు భేదములన్నియు కావ్యప్రయోగమునకుగాని కావ్యకారణమునకుగాని చెందినవి కావు. ఇవి వృత్తము దేశకాలముల ననుసరించి మారుచుండుటను కవులమనీష వివిధముగ నుండుటను కావ్యభేదము లమరుచున్నవి.

ఆంధ్రవాఙ్మయమున నిలిచియున్న మొదటిమహాకావ్యసంకల్పము భారతాంధ్రీకరణము. "అస్మదీయవంశమునం బ్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవోత్తములచరిత్ర నాపు సతతంబు వినంగ నభీష్టమెంతయు" అని రాజనరేంద్రుడు దానతీయ తదాస్థాన విద్వత్కవీంద్రు డాపని జేపట్టి తనపోషకున కంకితముగా గొంతవరకు నిర్వహించెను. తిక్కన ఇష్టదేవతార్పితముగ దైవసంకల్పప్రేరితుడై యాకార్యమును గడతేర్చి కైవల్యమొందెను. వీరుభయుల సాంప్రదాయములే ఇను

పదియవశతాబ్దమువరకు ఆంధ్రకవుల సంకల్పకారణములై యున్నవి. తెలుగుకావ్యములు రాజమహేంద్ర సామ్రాజ్యవైభవంబున మొలకెత్తి, రెడ్లపెంపున బల్లవించి, ధనికులప్రాపకములో విస్తరించి, విద్యానగర భూపవాదరణ బుష్పించి, సరసామోదశోభితములై చిత్రకాంతుల నెన్నొంది, కావేరీసలిలశీతలానిలంబున ఫలించి, పిల్లదొరల యల్పోపహారమున బ్రాణధారణ మొనర్చి, యల్లనల్లన నాంగ్లనాగరకశోభావిరాజితంబులగు రాజమహేంద్ర చెన్నపట్టణముల నాశ్రయించి, నూతనవసంతవిలాససంపదల నొప్పి, ప్రజాసామ్రాజ్యపోషితమై పలు తెరంగుల జేరొందియున్నది. నన్నయ మొదలు తిరుపతి వేంకటేశ్వరులవరకు ఆంధ్రవాఙ్మయతరంగిణి రాచపట్టుల జుట్టి తిరుగుచుండెను. ఒక చిన్నపాయ పోతనాదులు నివసించు దివ్యగ్రామములప్రాంత బారుచు, శతకకవుల యఘ్యోదకంబుల పదునుగలిగి తడియారక పల్లెటిసీమలగు ప్రభాగవతుల నిర్మలాంతఃకరణంబుల దడుపుచునెందు, వరద లెరుంగని ప్రచ్ఛన్నసంచార మొనర్చుచున్నది. రాజకవిగాని, భాగవతకావ్యకర్తగాని, లౌకిక పరిజ్ఞానము లేనిదే, భావోద్రేకమొందనిదే, రసానుభవము జెందనిదే, ప్రకృతివైచిత్ర్యముల జూచి సంతసింపనిదే, సకలజనామోదకంబగు కావ్యకల్పనలు చేయజాలరు. కాని "కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే" అనునట్లు ఆంధ్రకావ్యారంభముననుండి 1908 వరకు ఆంధ్రకవులు ధర్మనిర్దేశమో, ప్రభుసంతోషణమో, ధనాసక్తియో, మోక్షకామమో వేరువాసియో ప్రేరేపింప లోకోత్తరకావ్యయత్నముల గొనసాగించిరి కాని, ఇందున నొక్కడేని యు జగద్వ్యాప్తమగు భూతదయతో మానవసంఘమును ప్రేమించుచు ప్రకృతి సాహచర్యమున రసభావపరవశులై కావ్యముల నచ్చరించినవా రగుపడుట యరుదు.

పోతన, తిక్కన, సూరన మున్నగుకొందరి కల్పనలు చూచినచో, సంస్కృతకావ్యముల వర్ణనాపథనమే కాక అత్యధికమైన లౌకికజ్ఞానము, మానసప్రచారసాంప్రదాయాభిజ్ఞత, రసౌచిత్యము, స్వభావాభివర్ణనము గోచరించును. వీరు నిజముగా కొంతచూచియు, అనుభవించియు, మిక్కిలిసంభావించియు, ప్రకృతిస్వభావముల రుచికరముగ నభివర్ణించియున్నారుగాని. దానినెల్ల కావ్యోద్దేశ్యమునకు లోబరచి యందలి సూక్ష్మాంశముగ రచించియున్నారు. మరియు నీశ్వరాంశము జగద్వ్యాప్తముగ నంగీకరించియు, [illegible]లపు సామాన్యరసవ్యవస్థ నెరింగియు, మానవునే ప్రధానాంగముగ సంగ్రహించి కావ్యగాథల గల్పించియున్నారుగాని, మానవేతరమగు భూతజాలమున కెట్టిభావవ్యక్తినిగాని రసానుభవశక్తినిగాని యాపాదించియుండలేదు. ప్రకృతి మానవమానసంబున రసోద్దీపన మొనర్చునదిగ నంగీకరింపబడినది. అందుకే ఋతువర్ణనాదులు "విరహాదలచాటున లేడు గదమ్మ చెప్పరే!" యని సంబోధించుటకూడ కాననగు. కాని ప్రకృతివలన జవాబేమియు రాదు. ప్రకృతితో సంభాషించుచు, దానిభావవ్యక్తి నభివర్ణించు పోకడలు 1907 వత్సర ప్రభృతి తెలుగుసాహిత్యమున బొడకట్టినవి. ఈవ్యాసమాలికలో ప్రధానాంశముగ నీ స్వభావకావ్యవైచిత్ర్యమే విమర్శింపబడును.

తొల్లిటి యాంధ్రకవులు పౌరాణికులు. వీరు గీర్వాణసాహిత్యపారంగతులు శ్రుతి స్మృతి పురాణేతిహాస ప్రపంచసంచారకులు; రాజ్యకార్యధురంధరులు; పరమలౌకికులు. నన్నయ్య మొదలు విద్యానగర కవితావిర్భావ మహాన్నత్యము వఱకునుగల తెలుగుకవులు సంస్కృతపాండితీధురీణులైన లౌకికులు. తిక్కన, కవిసార్వభౌముడు, ప్రబంధపరమేశ్వరుడు, పోతనామాత్యుడు పాండిత్యమునకు లౌకికపరిజ్ఞాన మెక్కుడుగ జతపఱచి, కల్పనాచమత్కృతి వలన, ప్రబంధములయొక్కయు, ఆధునిక నాటకములయొక్కయు, బీజాంకురముల నేర్పఱచియుండిరి. విద్యానగర కవితావిర్భావసందర్భమున 16వ శతాబ్దమున వన్నెకెక్కిన పెద్దన, తిమ్మన, రామకృష్ణులు పాండిత్యసంపదలకన్న రసానుభవ మెక్కువగ గలిగియుండిరి. ఆకాలముననే బ్రాహ్మణేతరుడు కవితాశక్తి ప్రకటింప మొదలిడెను. పింగళిసూరన (17వ శతాబ్దము) కర్ణాటసామ్రాజ్యవినాశానంతరము రసవత్ప్రబంధనాటకముల నల్లుతరి, లౌకికానుభవము, భావసౌష్ఠవము, కథౌచిత్యము ఎక్కువగ పరిగణింపబడుచు, తెలుగుప్రబంధములు స్వాతంత్ర్యవికాసవంతములై, సంస్కృతాలంకారలక్షణములకు దూరమై సహజాంధ్రప్రతిభావిరాజితములై యుండెను. ఇప్పటివఱకును ఆంధ్రకవిశేఖరులందరు లౌకికబ్రాహ్మణులే. తంజావురి యాంధ్రకవితాలవాలమైనప్పటినుండ, (18వ శతాబ్దము) పింగళిసూరనార్యుని వెనుకను, తెలుగుకవులు తెలుగుప్రబంధములను తెలుగులక్షణగ్రంథములను అవలోకించి ముఖ్యముగా భట్టుమూర్తి కవితారీతులననుకరించి కావ్యముల గూర్చుచుండిరి. ఈకాలములో చాతుర్వర్ణ్యము లెక్కుడుగ కవితారంగమున వాసికెక్కి[illegible]. [illegible] నాంధ్ర

భారతి నిద్రావిశ్రాంతినొందుచున్నను, పల్లెటూళ్ళ, పేరెన్నికగన్న నియోగులు శతకకల్పనలను కొన్ని సందర్భములలో రసవంతమైన కావ్యములను జేయుచు గుప్తయశోనిధులై మరుగుపడియుండిరి. భట్రాజులు శ్రీపదంబుల నాశ్రయించుచు, తెలుగుప్రబంధముల రసవద్భావగాంభీర్యమును వెల్లడింపక, శ్లేషాదిబంధకవితా తెరంగుల నలుదెశల ప్రయోగించుచు, భాస్కరదానశీలమును గీర్తించుచు తలమార్చినపద్యములతో మెప్పించి మెప్పులబడయుచుండిరి, ఈగతి నాంధ్రభారతి 1840 సంవత్సరము వఱకు నధోగతిజెందియుండెను.

ఇంతలో 19వ శతాబ్దారంభమువరకు గోలకొండ నెల్లూరు ఆర్కాటు నవాబుల యాధీనమునయున్న యావదాంధ్రదేశము విచ్ఛిన్నమాయెను. బేరారు మధ్యపరగణాల యాంధ్రులు మహారాష్ట్రపరిపాలనమున జేరిరి. గుంతకల్ — బెంగుళూరు రైలునకు పడమటనున్న తెలుగుసీమలు హైదరల్లీకిలోబడి క్రమముగ మహీసురరాజ్యభాగమున జేరెను. చెన్నపురి - బెంగుళూరు రైలునకు దక్షిణమునున్న యాంధ్రభూములు, మతసాంప్రదాయములచేతను వైష్ణవప్రపత్తిచేతను తమిళనాగరిక ప్రభావాక్రాంతములై తెలుగుతనముల వీడెను. దత్తమండలములు సైనికసంరక్షణమునకొరకు ఆంగ్లేయులకీయబడెను. (1805) ఈప్రాంతములలో మొగలాయిపక్షమున, ఆనెగొంది, గద్వాల, వనపర్తి సంస్థానములు నిలిచియుండెను. దత్తమండలములు స్వభావమున పండువిగానను, చాలభాగ మరణ్యములతో నిండి సేవ్యానర్హముగనుండుగావునను, ఘనకంటకము లచ్చట దఱచు తలజూపుటను, పండితపోషకులగు సంస్థానములు లేకుండుటను, దత్తమండలము లాకప్పు డాంధ్రవిద్యానటీనృత్తరంగస్థలంబులై చెన్నొందియుండియు, క్రమముగ బ్రాహ్మణప్రతిభాదరిద్రమునకు పాలైనవి. పోషకులులేరు. క్షేత్రారామములకు వలయు నీటివసతులు లేవు— బ్రాహ్మణాగ్రహారములు లేవు— పండితులు లేరు. దత్తమండలముల దౌర్భాగ్యమాంగ్లేయ విద్యాప్రతిష్ఠాపకులగాని, ప్రభువులగాని యాకర్షింపకుండెను. ఇంతలో తంజాపురినుండి చెన్నపురికిని, చెన్నపురినుండి ముంబాయికిని రైలుమార్గము లేర్పడెను. తంజాపురీప్రాంతమునగల హైందవసాంప్రదాయ దుర్గమదుర్గంబుల భేదించుకొరకు, క్రైస్తవమిషనరీ లచ్చట 19వ శతాబ్దారంభమున నాంగ్లవిద్యాలయముల నేర్పరచిరి. ఉద్యోగవశమున దాక్షిణాత్యులు చెన్నపురనగరములన్నియు నాక్రమించి వాని నాంధ్రేతరములొనర్చిరి. వీర లాకారణముననే అయోమార్గావకాశమున దత్తమండలముల కేగబ్రాకి కడప, బళ్ళారి, కర్నూలుప్రాంతముల తమనాగరికసత్త్వముల వెదజల్లి యచ్చట స్థిరవాసులైరి. మఱియు నాప్రాంతములు తొలుతనుండి మహారాష్ట్ర పారసీకప్రవాసుల యావాసములాయెను. ఆంధ్రవిద్యాపీఠములు లేవు. ఆంగ్లవిద్యావ్యాపనము తక్కువ. అరవపారసీక నాగరికతా విజృంభణ మెక్కువ. బ్రాహ్మణప్రపత్తి కొదువ. ఇందుచే నాయెడ నాంధ్రజాతీయ సహజకావ్యోదయము లేకుండెను. ఇటీవలమాత్రము అరవ, కర్ణాట, పారసీక, మరాటీ సాంప్రదాయానుసారముగ నాటకములల్లు ధర్మవరం కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుగారు అచ్చోట జనియించిరి. దత్తమండలములలో జాతిసాంకర్య మెక్కువగనుంటచే, థియాసఫీ కునికిపట్టయి, మిగిలిన భారతభావవిన్యసనసంగోద్వేగమును జెందక, భక్తితో శృంగారములతో గూడిన పురాణగ్రంథరచనారంగమై యున్నది.

నెల్లూరు చిత్తూరు ప్రాంతములు వైష్ణవసాంప్రదాయమునను, రయిళ్ళ యంటుబాటునను, చెన్నపురియె వల విలాసభూములై యాంధ్రత్వమును గోలుపోయెను.

19వ శతాబ్దారంభమున నాంగ్లేయు లుత్తరసర్కారులను నిజాంవలన కవులుగొనిరి. ఆగౌతమీతటవ్యాప్తమయిన కళింగరాజ్యవిభూతిని బద్మనాభరణకూటంబున పసజెరచి, యాభాగమంతయు స్వవశము జేసికొనిరి. సువర్ణముఖీ మొదలు నాగావళివరకు ఆంగ్లేయప్రభుత్వ మేర్పడెను. కాళహస్తి, వెంకటగిరి, నూజవీడు, పీఠాపురం పెద్దాపురం, బొబ్బిలి సంస్థానములలో వెలమదొరలును, విజయనగరములో పూసపాటిక్షత్రియులును సామాన్య వైభవోపేతులై స్వాతంత్ర్యరహితులయిన భూస్వాములయిరి. తెల్లదొరలు బలిగ్రహణసౌకర్యమున కనేక చిల్లరజమీందారుల నుత్పత్తిజేసిరి. పినాకినీ గౌతమీ కృష్ణవేణీ మహావాహినులే గాక, తూర్పుకొండల సెలయేళ్ళ సంఖ్యాకములు సాగరాభిముఖులై పారుకతన, ప్రాగాంధ్రభూభాగము ఫలసస్యశోభావిభాసితమై బ్రాహ్మణావాసములతో నిండియుండెను. ఈప్రాంతముల వైదికులలో సంస్కృత పాండితీప్రాచుర్య మధికముగనుండెను. పల్లెటికరణాలకుటుంబములలో నూతనకావ్యోత్పత్తి వాసిగ లేకున్నను, తిక్కన పోతనాదుల కవిశైలమరియుండెను. 1840 దరిమిలాన ఆంగ్లశిల్పకులు

గౌతమీ, కృష్ణవేణీ పినాకినుల కానకట్టలేర్పరచి, దేశమును క్షామరహితముగ నొనర్చిరి. దక్షిణాదిన 19వ శతాబ్దారంభమున నేర్పడిన యాంగ్లవిద్యాసకాశము ప్రాగాంధ్రభూభాగమున 1850 వరకును ఏర్పడలేదు. ఇందుకు తోడు చెన్నపురి-కలకత్తాలనుండి ఆకాలమున నేయుండినయెడల తయారైనతమిళులు మనదేశము తమను నాక్రమించి, తెలుగుతెలివిని దుమ్ము మాడియుందురు. ఆంధ్రమాతృకడుపుచలువచే నీబండి 1900 వరకు నేర్పడలేదు. ఇతలో 1850 లో నేర్పడిన ప్రవేశపాఠశాలలలో రాజమహేంద్రవరము, విజయనగరం, బందరులోనివి సుమారు 1875 కు కళాశాలలాయెను. కలకత్తానుండి వాల్తేరునకు, అప్పటినుండి రాజమహేంద్రవరమునకు బండి ముందుగాపడెను. మరియు స్టీమర్లపై బందరు, కాకినాడ, విశాఖపట్టణములనుండి కలకత్తాకు రాకపోకలుండెను. పార్శ్వగాంధర్వభాగ మదివరకే మహమ్మదీయ, కళింగ, మరాటీ, పరా, సాంగ్లేయసైన్యములదాడులకాటపట్టయి, వివిధమతప్రచారముల, కాలవాలమయి, మహాసామ్రాజ్యములుగాని, మతికూటములుగాని లేక, పిల్లరాజులతో, చిల్లరదేవుళ్లతోగూడి పరాధికారదర్జన్యములకు లోనైయున్నందున, నీప్రాంతములలో మత, భావ, సాంఘిక, రాజకీయవిషయములలో స్వాతంత్ర్యము, అధికారతిరస్కరణము సంపూర్ణముగ నలవడియుండెను. ఇంతియగాక, నల్పవ్యక్తు లనేకు లేకముఖమున బనిసేయుచు మహాకార్యముల నిర్వహించు ధైర్యస్థైర్యములు, ప్రతినిష్ఠ యిచ్చట నేర్పడినవి. తొల్లి ద్రవిడ, కర్ణాట మరాట, మహమ్మదీయ, కళింగ నాగరికతాంశముల కాటపట్టయిన ప్రాగాంధ్రభూభాగము, నైళ్ళకూడలిచే 19వ శతాబ్దానంతరమును, 20వ దానియారంభమునను, వంగ, మరాటీ, భావవాహినీసంపోషితం బాయెను. బ్రహ్మసమాజము, సంఘసంస్కరణము స్వదేశోద్యమము స్వరాజ్యాభిలాష, జాతీయవిద్య, యహింసావ్రతము మున్నగు నవీనభావతరంగములు ఫలవంతమయిన, సంపద్విశాలమయిన, బ్రాహ్మణతపస్సంపన్నమయిన, బల, ధీసమన్వితమయిన యీప్రాగాంధ్రభాగమున జెలరేగినవి. చెన్నపురి రైలు 1900 వరకు రాకుండుటచే నాంధ్రసత్త్వము తమిళతంత్రములనుండి కాపాడబడుటయేగాక ఆంధ్రవ్యక్తు లిచ్చట స్వతంత్రభావప్రకాశ మొంది చెన్నపురి నావహించు శిక్షాబలోద్వేగముల నేర్పరచినది.

తంజాపురిసంస్థానప్రభావాస్తమయము మొదలు 1840 వరకు తెలుగుకవిత్వము పండితేతరులయిన వారియాధీనమున నుండెనని చెప్పియున్నాను. ఆసమయమున ఈనాంకిమీద నుత్తరసర్కారుల బరిశీలించి. యచ్చట సంస్కృతసాంప్రదాయానుగతమగు విద్యాప్రచారావకాశముల జాలవరకు నేలగిలిపెను. స్వతంత్రజీవులైన పండితకవులు బహు లనేకములు జీవనోపాధికై, ప్రభువులనో, ఆంగ్లపాఠశాలలనో ఆశ్రయింపవలసివచ్చెను. ఇంతలో కాళహస్తినుండి బొబ్బిలివరకు వ్యాపించిన సంస్థానమాలిక నూతనప్రభుత్వాధికారులతో కుదిరి, స్వస్థులై, విభవోపేతులై పండితసత్కారము జేయనోపియుండెను. అచ్చటచ్చట తెల్లదొరలచే స్థాపింపబడిన పాఠశాలలకు పండితు లవసరమాయిరి. ఇట్లు ప్రభుసేవలోను, పాఠశాలలలోను జేరినపండితులలో ననేకులు వైదికులు వైష్ణవులుండిరి. వీరందరు గీర్వాణసాహితీసాంప్రదాయాభిజ్ఞులు. ఆదివరకు వైదికులు, వైష్ణవులు వేదశాస్త్రముల నభ్యసింపుచు, తెలుగుకవిత్వమును నిరసించుచుండిరి. లౌకికులయిన నియోగులు, వందిజీవులైన భట్రాజులు దీని మన్నింపుచుండిరి. ప్రభుసేవాసందర్భమున శుభాదికార్యములలో బండితులు ప్రభువుల కర్గముగు తెలుగున కవిత్వవైఖరుల బ్రకటింపవలసెను. పాఠశాలలలోని పండితులు తెలుగు కావ్యముల బోధింపుచు, నాంధ్రకవితాధునీ, మధురాలాపములమోహమున కావ్యకర్తలాయిరి. ఇట్టి పండితకవులప్రచార మాంధ్రదేశములో 1840 మొదలు 1895 వరకును జరిగిన శతాబ్దార్ధమున నుండెనని చెప్పవచ్చును. గోపీనాథం, వెంకటకవి, శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి, మండపాకపార్వతీశ్వరకవి, కోరాడ రామచంద్రశాస్త్రి, మాడభూషి వేంకటాచార్య, వేరి కాశీనాథశాస్త్రి మున్నగు పెద్దలీవర్గమున జేరినవారే. వీరు సంస్కృతసాహిత్యసాంప్రదాయముల జక్కగ గుర్తించి, సూరనార్యుని యనంతరము తెలుగుకవిత్వమున కేర్పడిన పాండితీదారిద్ర్యమును దీర్చిరిగాని, వీరి కవితాప్రయత్నములు లౌకికజ్ఞానరహితములై, పాండితీప్రాగల్భ్యదూషితములై, నలన్ర మాగత నైపుణ్యములేమిచే నిరుపదప్పియున్నవి. ఆంధ్రకవిత్వమునకు విశుద్ధతను, వ్యాకరణాలంకారసౌష్ఠవమును జేకూర్చి, దేవభారతీప్రతిభను మరల నీపండితకవులు కూర్చియిచ్చిరి. ఈసాంప్రదాయములతో సంస్కృతాంధ్రపాండితీగరిమ సంపాదించి, శుద్ధవైదికులయ్యును సరసకవితాసామ్రాజ్యసింహాసనారూఢులయిన విద్వాంసు లనేకు లిప్పటికిని జీవించియున్నారు. ఆనంద గజపతీంద్రుని యాస్థానకవు లిట్టివారలే.

పండితకవులకాల (1845-1895) మెట్లెట్టులలో చెల్లుచుండ, నప్పటికే కృష్ణా గోదావరీ విశాఖపట్టణమండలములలో వ్యాపించుచున్న యాంగ్లవిద్యాలయములలో కొంచెమింగ్లీషు నభ్యసించి, కొంత తెలుగు, కొంత సంస్కృతము చక్కగ నేర్చి, ఆంగ్ల, నాగరక సాంప్రదాయములను, ఆంధ్రగీర్వాణవిజ్ఞానమును జతపఱచి, యాంగ్లవిద్యాలయములలో పండితులై, నవీనభారత భావోన్మేష మెఱిఁగిన తెలుఁగుకవులు, వైదికినియోగు లిరుతెగలవారు (1885 మొదలు 1905) వరకును, ఆంధ్రసారస్వతవివర్ధకులై యశముగాంచిరి. వీరేశలింగము, వసురాయఁడు, వేంకటరత్నము, వేంకటరాయశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు, కృష్ణమూర్తిశాస్త్రి మున్నగువారొక చెంప సంస్కృతనాటకాదుల దెనిఁగించియు నొకచెంప నాంగ్లనాటక కావ్యఘణతుల ననుకరించియు, కొన్నియెడల నాంధ్రకవిసింహముల పోకడల నాశ్రయించియు, తెలుఁగుకవిత్వమునకు విపులసంచార మేర్పరచిరి. ఇట్టివిద్యాసాంప్రదాయములేకల, కవులనేకతావుల నాంగ్లసంస్కృతరీతుల నాటకములను, గద్యప్రబంధములను, విమర్శనలను, భాషాంతరీకరణములను జేయుచు వచ్చిరి. 1885-1905 తెలుఁగు సారస్వతమున, ననుకారకయుగము. అందలిప్రముఖులు భాషాంతరీకరణమందును, అనుకరణమందును బ్రజ్ఞావంతులై, తెలుఁగుబాసకెట్టులైన నుపకరించు వేడుకతో బాటుపడిరి. భాషాసేవయే ఈకవుల కావ్యప్రయత్నముల కారణమును ఫలమును, వీరు భావోన్మాదులై, జగద్దీప్తులై, రసానుభవప్రభావమున కవిత లేర్పరుపలేదు. పాండిత్యమున, వీరు జతలో పండితకవుల కోడిపోవుదురు. భావసౌష్ఠవమున కవితోద్దేశ్యనిర్వహణమున, తరువాతి జాతీయకవుల పోకడలు వీరి కేర్పడలేదు.

పండితకవులును, అనుకరణకవులును, వారిసంస్కార సంబంధమున, ఆంధ్రకవిత్వపు చతురంగమునకు జెందిన టులు నన్నయ—యఱ్ఱాప్రగడవరకు మొదటిసీను—పెద్దనవరకు రెండవది— సూరనవరకుమూడవది— తిరుపతివెంకటేశ్వరులవరకు నాల్గవది. ఆవల నవీనాంధ్ర కవితావిర్భావ మహోత్సవరంగమునకు తిరుపతి వెంకటేశ్వరులు సూత్రధారులైయున్నారు.

1905—1922 వరకున్న కవితాపటవాహకులు చాలవరకు, ఆంగ్లవిద్యాసంపూర్ణులే. వీరు ఆంధ్రగీర్వాణముల నల్పముగ నభ్యసించి, వెంకటిరంగాభినేతల సహాయసంపదలవడసి, ముద్రణాయంత్ర సాహాయ్యమున సులభమైన నానాకాలముల ఆంధ్రసారస్వత మనుభవించి, జాతీయభావోద్వేగ పారవశ్యమునను, ప్రజాపోషణలో నానాదెసల విస్తరిల్లు వాఙ్మయవివర్గమోపాయ ప్రోత్సాహమునను, విదేశసారస్వతాభిజ్ఞతను, వంగభావోత్సాహ సంపర్కమునను, ఆంధ్రోద్యమోజ్జ్వలిత మాతృసేవాపరత్వమునను, గ్రాన్యకళాలలిత సాహిత్యాభిమానమునను, పాశ్చాత్యవిమర్శనాపఠన సంజాత నూతనాభిప్రాయప్రాబల్యమునను దేశములో తామరతంపరలై వొడను సాంఘిక రాజకీయవిప్లవముల వేడిమి చేతను, ప్రకృతి నవలోకించి, భూతజాలముతో నిష్ఠాగోష్ఠులనెరపి, యానందించు కుతూహలమునను బలుతెరంగుల, రసభావ పుష్పాలంకృతములైన పద్దెముల వ్రాయుచున్నారు. వీరితో నాంధ్రవాఙ్మయమున, స్వభావకవిత్వము ఆరంభమైనది. వీరిలో భానుమూర్తిగారు, మంగిపూడి వేంకటశర్మ, రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరావు, సెట్టి లక్ష్మీనరసింహము మున్నగువారనేకులుగలరు. వీరు పూర్వులవలె పెద్దకావ్యముల దలపెట్టక, తమ రసావేశమును, అనుభూతవిషయములను, భావోన్మాదమును చిన్నపద్యావళులలో వెల్లడింతురు. ఇట్టి ప్రయత్నముల విమర్శించుచు, వీరికవితారీతులకును, నానాకాలముల ఆంధ్రసారస్వతమునకునుగల సామ్యభేదముల నరయుచు, నధునాతన భాషాప్రపంచసంచలనమున వీరి నియతస్థానమును జూపుచు, నాంధ్రకవితాప్రయత్నముల కవశ్యమార్గము సూచించుటయే "ఆ నవీనాంధ్ర కవు" లను ఈవ్యాసమాలిక యుద్దేశ్యము.

నవీనాంధ్రకవులలో పైజెప్పినవారుకాక, శుద్ధాంధ్రసంస్కృత పాండిత్యముగలిగియు, 1885–1922 వరకును దేశములో వ్యాపించుచున్న భావప్రవాహమును గుర్తెరిగి దేశకాలోచితరీతుల సరసకవితామాధుర్యసౌందర్యము బ్బారు, కవిశేఖరు లనేకులు గలరు. వీరికి నవీనభావములు కర్ణాకర్ణి కలుగుటచే వానిస్వయంవ్యక్తియంతగ దోపక, నవీనభావబానిసత్వము నంగీకరింపక, లౌకికపరిజ్ఞానమును, నవీనభావసూచనలను, తమ పాండితీయంత్రమున శిక్షించి, అనుభవసారమును సంగ్రహించి, నిర్దుష్టభాషామర్యాదలతో సరసముగ జెప్ప నేర్చిరి. వారిలో తిరుపతివెంకటేశ్వరు లగ్రగణ్యులు. వీరివెనుక, కాశీకృష్ణాచార్య, పురాణం సూర్యనారాయణ తీర్థులు, మున్నగువారనేకులు సరసకవితాసామ్రాజ్యసంపన్నులీకాల

మున గలరు. వీరినికూడ నవీనాంధ్రకవులలో జేర్చి ప్రత్యేకముగ నొక్కొక్కరియొక్కగాని, ఒకవిధమగు కవుల గుంపునుగాని యొక్కొకవ్యాసములో జేర్చొని విమర్శించెదను.

1905–22 వరకుజరిగిన భాషోద్ధారకావహములో సుమారు 200 కవులు సందర్భపద్యావళుల బ్రకటించియున్నారు. వీరిలో ప్రధానముగ దారిత్రొక్కిన కవితామార్గదర్శుల నెనిమిది ప్రత్యేకవ్యాసములలో విమర్శించి, చిల్లరకవుల కొకవ్యాసమొసంగి, భావికవిత్వమున కొకటియు, నవీనకవితాప్రయత్నసమన్వయమునకు రెండును సమర్పింపదలచినాను. ఈవ్యాసములు ముగియులోపలనే నవీనాంధ్రకవిత్వసారమును, పుస్తకముగాముద్రించెదము.

ఈవ్యాసమాలికకు పంద్రెండుసంచికలలో వర్షవ్యాప్తప్రోత్సాహ మొసగినందులకు గ్రంథాలయసర్వస్వపత్రికాధిపతుల కెంతయు కృతజ్ఞుడను. ఆంధ్రసోదరులకు నావిధివిహితోపకారముగావించి యుత్తమగతుల నరయు నాపాలిటికిపత్రికాప్రోత్సాహమే పదివేలు విలువ.

—పురాణం సూరిశాస్త్రి.

# రాధ పిలుపు.

మూడునాళ్లాయెరా మువ్వగోపాల
నినుజూడకేనింక నిలువజాలనుర
వనులలో మెదిలేవు కనకగోపాల
నీచక్కదనమెందు దాచుకోగలవు
చాటుగా నిలుచుండి పాటబాడేవు
మరుగున తలవంచి మాటలాడేవు
మునుగులో నేమిటో ముచ్చటాడేవు
తెరలోనరాగాలు తీసేవుకృష్ణ
మురళివాయించరా వరహాలకృష్ణ
నీజాడలను బట్టుకోజాలదేను
గజ్జెలందెలుమ్రోయ కదపరా కాలు
నీగుట్టునుట్టిలనే నెఱుంగుదును
నెమిలికుచ్చుతురాయి నిగనిగలాడి
నిను బట్టియిచ్చునంచును తీసినానె
నీచుట్టుపచ్చగా పూచేనటంచు
బంగారుకాలువా పాటేసినానె;
ఎంతసేపాయరా యావనాంతమున
నీకోసమొంటిగా పొంకులాడితిని
ఎందెందు వెదకినా బృందయందు

నీవన్నతే కానరావేల కృష్ణ!
పొదలలోపూవు వైపోయినావేమొ
ఆలలోదూడవై యరిగినావేమొ
తమ్ములతీయగా ద్రవియించితేమొ
కలికివేణువుకోడ కరిగినావేమొ
నిన్నెందుజూతురా చిన్నారికృష్ణ
ఏమూలవెదకేదిరా మోహనాంగ
వెన్నదొంగిలి కానిపింపకున్నావొ
చీరలెత్తుకపోయి దూరమైనావో
తగాణులేనినుదాచి తప్పించినారో
మధురలో పౌరులే మరపించినారో
ఏమిసేయుదునురా నాముద్దుకృష్ణ!
నినుజూడకేనింక నిలువజాలనుర
రాధను వేధింప రాదురా కృష్ణ
రాధపైకోపింప రాదురా కృష్ణ!
పిలిచిముద్దియరా ప్రేమాలపించెద
కలిసిక్రీడింపరా కళ్యాణకేళి!

—రాయప్రోలు సుబ్బారావు.

# భారతీయులనాటకలక్షణము

కొంతకాలమునుండి భారతీయనాటకములను గూర్చిన విమర్శనములు స్వదేశ, విదేశభాషలయందెల్ల వెలసినవి. సంస్కృతనాటకాదర్శమును పరిశీలించి, విషాదనాటకములు లేకపోవుటనుగూర్చి చర్చించి, ఉన్న విషాద, మంగళ, మిశ్రనాటకములను నిరసించినవ్యాసములు మన ఆంధ్రమునగూడ కలవు. అప్రతిమానముగ జిత్రింపబడిన రసవంతములగు కాళిదాస, భాసనాటకములను మెచ్చుకొనుచు పాశ్చాత్యవిద్వాంసులు, కాళిదాసుడీ విషయమున షేక్స్పియరును మించినాడని వ్రాసినారు. విషాదనాటకములు లేకపోవుట కొఱతయేకాని మనకున్న మిశ్రనాటకములను విషాదములుగ చేయలేదని కవిని నిందించుట పొరపాటు. అదియొక ఆదర్శము. ఇది యొక ఆదర్శము. అది పాశ్చాత్యులది. ఇది మన భారతీయులది. మన భారతీయనాటకాదర్శములనుగూర్చియు, నాటకవాఙ్మయపరిణామమునుగూర్చియు పండిత టి. ఎల్. వాస్వానీగారు బాగుగ చర్చించియున్నారు. మన విమర్శకులకొఱకు ఆయనవ్యాసము అనువదించెదను.

ప్రాగ్దేశములెల్ల నున్నతినొందినకాలమున, భరతఖండమున పండితసభలు జరుగుచుండెను. వీనికి భూపతులు, రాజులు, భాషాభిమానులు సధ్యక్షులుగ నుండిరి. ఈసభలయందు గొప్పగొప్ప కవులకృతులు పరీక్షింపబడి, చర్చింపబడి, గౌరవింపబడుచుండెడివి. ఈసభలును నితరవిశేషములును పెద్దలతోగలిసిపోయినవి. హిందూదేశపు అభివృద్ధి, నాగరికము క్షీణించినవిధ మొకదీన చారిత్రము. భారతీయప్రపంచము గ్రహణమునందువలె నీడలోకప్పబడి, తీరనిరాత్రియందు మునిగిపోయిన చారిత్రము దుఃఖకరము. ఆనడికిరేయినుండి భారతీయులు మెల్లమెల్లన మేల్కొనుచున్నారు. ఈక్షణమున దేశములో నలుదిక్కులను శ్రుతిస్మృతులలోని సదాచారమున నెలకొనినసత్యమును వెల్లడించుసత్కార్యమునకు విద్వాంసులును, పండితులును గడంగినారు. భారతీయాశయములు పాశ్చాత్యదేశములలో గౌరవింపబడుచున్నవి. ప్రాగ్దేశపు వేదాంతము కేవలము కల్పనాచాతుర్యముగ నెంచబడుటలేదు. మధ్యధరాసముద్రతీరముననె నాగరికతరంగము లంతరించినవను హెగెల్ సిద్ధాంత మివ్వడు గౌరవింపబడుటలేదు. డాక్టరు పి. సి. రాయిగారు చేసిన పరిశ్రమకలన ఐరోపాదేశమున తరువాత కనిపెట్టబడిన ప్రకృతిశాస్త్రవిషయములు కొన్ని, చాలకాలముక్రిందటనె భారతీయు లెఱింగియుండిరని తెలియుచున్నది. "హిందూదేశపుప్రకృతిశాస్త్ర" మని డాక్టరు బి. ఎస్. సీలుగారు వ్రాసినగ్రంథము నూతనపరిశ్రమలను ప్రోత్సహించుచున్నది. ఐరోపాఖండపుగ్రంథకర్త యొకడు న్యాయశాస్త్రవిషయమునుగూర్చి వ్రాయుచు, రోమదేశపుధర్మశాస్త్రములోని వ్యక్తిసిద్ధాంతమును విమర్శించి నెగ్గినసమితిసిద్ధాంతమె సరియగునదనియు, సమితికొకఆత్మకలదని భారతీయులు నిరూపించియుండిరనియు వ్రాసియున్నాడు.

కాలము కడచినకొలదియు, అవ్యక్తముగ మూసికొనియున్న భారతీయులజ్ఞానము, జీవము వ్యక్తమగుచున్నది. జీవనవేదమునకు, జ్ఞానజ్యోతికి పురాతనార్యులె మనకన్న దగ్గరగనుండిరి. వారు మనకన్న పవిత్రులు, నిష్కపటులు. శిశువువలె నిర్మలులు. అందువలననె వారు సత్యతత్త్వము నెఱుంగగలిగిరి. కళాతత్త్వములను బాగుగ తెలిసికొనిరి. నాటకమునందు జాలనిపుణులైరి. ఇచ్చట భారతీయనాటకాశయమును, నాటకవాఙ్మయముయొక్క విలువయు, దానిప్రాశస్త్యమును, యథాశక్తిని దెలుపబడును. భారతీయనాటకము హైందవ బౌద్ధనాటకము. మహమ్మదీయులు హిందూదేశమునకు చేసినయుపకృతి చాలకలదు. వారిచిత్రకళలు, శిల్పము, భావగీతములు—హఫీజుకవనము, మానసాలీ చిత్రకళిత—వారియుత్సాహశక్తి, వారియేకేశ్వరారాధనము భారతీయభావమున ప్రతిఫలించెను. భారతీయజీవనమును కొంతమార్పు చెందించినవి. కాని మహమ్మదీయులు నాటకకళను తీసికొనిరాలేదు. పారసీకులకు, అరబ్బులకు, మొగలులకు జాతీయనాటక రంగస్థలములు లేవు.

కొంతకాలముక్రిందట భరతఖండము గ్రీసుదేశమునుండి నాటకమును గ్రహించెనని యూహింపబడెను. సంస్కృతమున దొరకు "యవనిక" అనిపేరుండుట నాటకములకు మూలస్థానము యవనభూమి—గ్రీసని తలంచిరి. ఈమాటకు యవనులచే చేయబడిన గుడ్డయని అర్థము చేయవచ్చుననుమాటను మనవారు మఱచిరి. హిందూ

దేశాధీశ్వరులకొలువున సేవకురాండ్రు యవనయువతులుండిరని పుస్తకములందుండుటయు నొక కారణముగ చూపబడెను. అయిన నిది ఆకాలమున నీరెండుదేశములకును రాకపోకలు కలవనిమాత్రమె తెలుపును. ఈసంగతి బౌద్ధసిద్ధాంతములవలన పైతాగరసుసిద్ధాంతము లుద్భవించెనని నిర్ణయించిన జర్మను పండితుల కుపయోగకారి. భరతఖండమునకును, యవనదేశమునకును సంబంధముండుట నిజమె కాని యివి యొండొరుల ననుకరించెననుట తప్పు. బుద్ధికుశలత యనుకరింపదు; అనుకర్షించును. షేక్స్పియరు వెనీసువర్తకుడను నాటక మిటలీనాటకపు టనుకరణము కాదు. గతే (Goethe) ఇఫిజినియా, యురిపిడీసు ననుకరింపలేదు. భరతఖండము గ్రీసు ననుకరింపలేదు. గ్రీసు భరతఖండము ననుకరింపలేదు. తమ యోగ్యత ననుసరించియే, ఇందొక్కొక్కటియు నొక్కొకవిధమగు వాఙ్మయమును కల్పించుకొనినవి. బాగుగ గమనించిన కొలదిని గ్రీకులవిన్యస్తనాటకములకును, భారతీయుల చిత్రనాటకములకును భేదములు కాన్పించును. హిందువుల నాటకము గ్రీకులఐక్యతల (Unities) శుద్ధవిధానమును గమనింపలేదు. వీరియాధునికకల్పనాదక్షత పూర్తిగ కనబడినది. ఈతరుణమున భారతీయనాటకముల ప్రతిఫలనముల నుగూర్చి కొంతచెప్పవలెను. రోము. ఎలిజబెత్తు కాలము నాటి నాటకములయందలి తెలివిహీనుడును, హాస్యగాడునగు పాత్రమునకు మాతృక మన విదూషకుడు. బొమ్మలాటలజన్మస్థానమునగూర్చి వ్రాసిన పిష్షెలు ఐరోపాదేశములో మధ్యకాలమున గనబడు హాస్యగానిమాతృక విదూషకుడె యని పలికినాడు. మన మిప్పుడు సింధూదేశమని వాడుచున్న దేశముకన్న నెక్కుడుప్రదేశముననె మననాటకముల ప్రాశస్త్యము విజృంభించెను. మధ్యఆసియాఖండమున దొరకిన తాళపత్రగ్రంథములు, ఆదేశమున మనచక్రవర్తులగు కుషానులు స్థాపించినసామ్రాజ్యమునాటికే మనభారతీయ నాటకశిల్పము వృద్ధిజెందెనని తెలుపుచున్నవి. భారతీయులు, ఆరవశతాబ్దమునాటికే, జావాకు వలస కేగిరి. అచటి ఛాయారూపకపరిదర్శనము లీభారతీయనాటకకళాప్రతిబింబములె. బర్మాలో, సయాములో, కాంభోజములో రంగస్థలముల జూపబడిననాటకములు, రాముని, బౌద్ధునిగూర్చినవె! రామనాటకములు మలయద్వీపకల్పములోను, చైనాలోనుకూడ ప్రదర్శింపబడెడివి.

భారతీయుల నాటకాదర్శము దాని ప్రాశస్త్యమునకు గారణము. గ్రీసుదేశరోమాదేశమున మరియు నకును, రంగస్థలములకును పరస్పరవిరోధము కలిగెను. క్రిసోస్టోము "నాటకకళలెల్ల దయ్యమునుండి వచ్చినవి. హాసమును, ఉల్లాసమును భగవంతునుండి రావు. దయ్యములనుండియె కలుగును." అనినాడు. రోములో నటకుల నసహ్యించుకొనుచుండిరి. చైనాలో నటకులైదు తరములవరకును గౌరవపరీక్షలకు బోగూడదని శాసింపబడెను. భారతీయులన్ననో, నాట్యకళ నొకవేదముగ పరిగణించిరి. దేవతలసూత్రధారుడగు భరతఋషికి సృష్టిలో ఆనందముకొరకు తపస్సుచేసి యోగమున నృత్యశాస్త్రమును బడసిన బ్రహ్మయె బోధించెనని తలంచిరి.

కాళిదాసాది భారతీయకవులనాటకములు స్వతస్సిద్ధములుగ లేవని కొందరనిరి. ఈవిమర్శనము భవభూతి పలికినమాటలను జ్ఞప్తికిదెచ్చుచున్నవి. "మమ్ములను విమర్శించువారేమెఱుగుదురు? కాలమనంతము. లోకము విశాలము. నారుచులె యిష్టముకలవా రుండవచ్చును కదా," ఈపలుకులకు తరువాత ననేకశతాబ్దములు గడచినపిదప జర్మనీలో సుప్రసిద్ధుడగు గతేకవి జనించి కాళిదాసును శ్లాఘించినాడు. "మీకు సంవత్సరపుమొగ్గవికాసము, తుదిఫలములు, ఆత్మకత్యంతోత్సాహకమును, ఆనందమును, విందును, పండుగయు కావలెనన్నచో, భూలోకమును, స్వర్గలోకము నొక్కమాటలో కావలెనన్నచో నేను 'శకుంతల' యని పేర్కొనెదను," అని పలికినాడు.

కాలస్థానముల యైక్యతలను భారతీయనాటకము గమనింపలేదు కాని దీనివలన నది యస్వాభావికమైనదన దగదు. గ్రీసు, ఫ్రాన్సులవు లీరెంటిని గమనించిరి కాని, ఎలిజబెత్తుకాలపుకవులు గమనింపలేదు. జర్మనీదేశపు శిల్పవిమర్శకుడగు 'లెస్సింగు' ఈయైక్యతాశృంఖలములనుండి వదలించుకొనుట లెస్సయనినాడు. షేక్స్పియరు తన నాటకములందు వీనిని గమనింపలేదు. స్థానకాలయైక్యతలు గ్రీసువారిసృష్టియగుట, భారతీయనాటకము గమనింపకపోవుటె మంచిదయ్యె. ప్రదర్శనాభావయైక్యతలమాత్రము భారతీయనాటకములు బాగుగ గమనించినవి. నాటకకృతికర్త యొక్క కర్మసిద్ధాంతము నాటకములోని విషయములకెల్ల కారణకార్యములుగల యొక యైక్యతగ గమనించెను. ప్రతినాటకమందు నొకయంతరంగ ముండును. పరిదర్శనపరిమాణము సంపూర్ణముగ నుండును.

సాధారణముగ నాటకములు సంతోషాంతములు, కష్టాంతములని చేయువిభజనము సంస్కృతమున గా

23



రాదు. నాటకము శృంగారరసప్రధానమగు సంతోష నాటకము కావచ్చును. లేక శృంగార శోకరసమిళిత మగు మిశ్రనాటకము కావచ్చును. ఇది యెన్నడును కేవలము శోకరసప్రధానమగు విషాదనాటకముగ నుండదు. భయానకప్రదర్శనము బీభత్సవిషయములును రంగస్థలముల ప్రదర్శింపఁబడకూడదు. ఏలన వానివలన హృదయమును, మనసును నిర్మలములై శాంతినిపొందక యుద్రేకమునుపొంది సంక్షుభితము లగును. అయినను దుఃఖమును, తక్కుంగల రసములును పూర్తిగ విడువఁబడలేదు. దుఃఖములను ఓర్పుతో సహించవలెనను ధర్మము బోధింపఁబడెను. ఏలన లోకమొక్కటి ధర్మమువలన వ్యవహరింపఁబడుచున్నది. అది శుభప్రదమగు "ధర్మమేవ జయతి" గ్రీకులు విధినిగూర్చి పలుకుదురు. మనవారును విధి చెయిదమునుగూర్చి చెప్పుచుందురు. నీవు సృష్టించిన ద విధియిచ్చును. నీస్వభావమునే విధి ప్రేరేపించును. పరమేశ్వరుని— దేవతల—ప్రభుత్వమును నీకర్మము ప్రేరేపణ చేయును. నీవు దుఃఖము లనుభవించినచో నదియు నీ మేలునకే యగును. ఏలన సృష్టి మాయచిక్కుల కొలుకాదు. శాంతికొలువు. అందువలననె భారతీయ నాటకములు పవిత్రమతవిషయికములైనవి. స్పెయిను, గ్రీసు, ఇంగ్లాండు, హిందూదేశములు నాల్గును నాటకములు పుట్టిన స్థానములుగనున్నవి. స్పెయిను, యింగ్లాండులలో నాటకములు మతములకును, లోకమునకునుగల కలహములలో కలిగెను. గ్రీసుదేశములో నాటకము డయొనీసియస్ఆరాధనమున కలిగెను. ఈఆరాధన మొకప్పుడు క్రైస్తవమతమును పారద్రోలునంత తీవ్రముగ నుండెను. భారతీయనాటకము గ్రీసునాటకమువలెనె మతవిషయిక మయ్యెను. జనులను పవిత్రులనుజేసి వారికి జ్ఞానమును కలిగించుట దాని ముఖ్యోద్దేశము. అందువలననే, భారతీయనాటకములు శుభప్రదములగు నాందితో మొదలుపెట్టి శ్రేయోదాయకమగు భరతవాక్యముతో ముగియును. ఇందలికథాంశములు మతగ్రంథములనుండి తీసికొనబడును. అమానుషపాత్రములు విచ్చలవిడిగనున్నవి. ఇది యసహజమును, లోకవిరుద్ధము నగునా? షేక్స్పియరే యమానుషపాత్రములను తననాటకములం దుపయోగింపలేదా? హేమ్లెట్టులోని దయ్యము నాటకమునం దీవింతతలంపును కలిగించుచున్నదా? మానవజీవితమున నమానుషవిషయములు లేవా! హిందువుమాత్రము మన కంటికి గోచరము కానిలోకమును, మనలోకమును ఒక్కటె సృష్టిలోనివని—మానవుడు దైవములయాజ్ఞానువర్తి యని—నమ్మటలో తప్పేమి?

భారతీయనాటకములనుగూర్చిన యింకొకవిషయము ప్రకృతివర్ణనము. గ్రీసునాటకకవులును, గతే, షిల్లరు, హాప్ట్మను మున్నగు గొప్పజర్మనుకవులును, షేక్స్పియరును పాత్రపోషణమున జాతిచమత్కృతిని చూపినారు. వారు తమదృష్టిని మానవునందె బాగుగ నిలిపిరి. భారతీయనాటకకవి, ప్రకృతి జీవప్రదర్శనమునందె తన శిల్పనాచాతురిని చూపుచున్నాడు. ప్రకృతి యొక గురువుగ—ఉద్బోధనాచార్యుఁడుగ నతనికి తోచును. అందువలననె నాటకములును ప్రకృతిసౌందర్య పునరుద్భవకాలమున— ప్రకృతిపండుగలలో— వసంతోత్సవసమయమున—ప్రదర్శింపఁబడుచున్నవి. హిందువుల ప్రణయదైవము మన్మథుడు. పుష్పపత్రములుగల బాల విలుకాడుగ—పంచశరుడుగ—వర్ణింపఁబడినాడు, కాళిదాసుని మహానాటకములలో ప్రకృతి ప్రణయసౌందర్య వర్ణనములుగల భాగములెన్నో కలవు. విక్రమోర్వశీయముయొక్క మొదటియంకము హిమాలయమున ప్రకృతి సౌందర్యవర్ణనముతో మొదలుపెట్టును. ఉత్తరరామ చారిత్రము వనమందె జరిగెను. మేఘసందేశమున యక్షుఁడు రత్నగిరిపై విరహ మనుభవించుచు తనసందేశమును మేఘదూతతో పలుకుచున్నాడు. రాముడు తనరాజ్యమును బాసి సుందరమగు చిత్రకూటమునకు పోయినాడు. శ్రీరామునితో—యక్షునితో—నాసౌందర్యము నానందము ననుభవించుభాగ్యము మనకెట్లు కలుగును? వారు కాదు. అరణ్యప్రదేశముల వేగినది—ప్రకృతిసౌందర్య మెఱుఁగక, జనాకీర్ణములగు నగరకూపములఁబడి, త్రిప్పించు మనమె యరణ్యముల బడియున్నాము.

మనభారతఖండపు ప్రథమచక్రవర్తి శకుంతలానందనుఁడగు భరతుఁడు. పవిత్రవనములో ఋష్యాశ్రమమున పెరిగెను. మహాకవి కాళిదాసుడే తనయవసానకాలమున సముద్రపుహోరు వినవచ్చు నేకాంతనగముపైన సింహళమున శయనించియుండెనని ప్రతీతి. శాకుంతలమున ప్రకృతి సౌందర్యమయము. శకుంతల కాపేరెట్లు కలిగెను? విశ్వామిత్రుఁడు జితేంద్రియుఁడై ఘోరతపస్సు చేయుచు తనదీక్షను మేనకకొఱకు విడనాడగ నీముద్దులతనయ కలిగెను. దీనికిఁ బాల్యముచ్చిత్తముగ తీవ్రముగు తపస్సుచేయుటకొరకు ఘోరారణ్యములోనికిఁ బోవుచు నాశిశువును ప్రకృతికి విడచెను. అంత నీసౌందర్యరాశిని సుందరములగు శకుంతములు రక్షించినవి. తరువాత నీమెను కణ్వమహాముని తనయాశ్రమమున పెంచెను. ఆమె చెట్లను నీరుపోయుచు, పెంపుడునెమిళ్ళ వాడి

యగు కల్లు మొనలు గుచ్చుకొని బాధనొంద, వానికి సంరక్షణము చేసి వానితో నాడుకొనుచుండెను. ఈమె పతి పజ్జకుఁ బోవునప్పుడు చిన్ననాటనుండియు సఖులగు మునికన్నియలనుండిమాత్రమె గాక, యచ్చటివృక్షముల నుండి, లతలనుండి, పొదలనుండియు, పశుపక్ష్యాదులనుండియు ననుజ్ఞ గైకొనెను. కన్నుల నశ్రువులు గారుచుండ వీడ్కొనెను. ఆమె పోవుచుండగ పెంపుడులేళ్ళు, నెమిళ్లును—ఆమెను వదలలేక చెంగటి, దీనముగ చూచుచు తమదుఃఖమును తెలియజేసెను.

భారతీయమహానాటకములెల్ల ప్రకృతిసౌందర్యసమ్మోహనమునను వ్రాయఁబడినవి. అందువలననె యవి మనసును త్తేజితముగ పవిత్రముగ చేయుచున్నవి. ఆయినను ఆత్మత్యాగములేక ఆత్మశుద్ధియు, దుఃఖోపశమనమును గలుగ నేరవు. ఇది లోకధర్మముగ మనకవులు గ్రహించిరి. అందువలన తమ నాటకములలోని పాత్రములయందిది బాగుగ ప్రదర్శించిరి. జీవితసమస్య లాలోచనలతోగాక త్యాగమువలనను నిష్కామకర్మవలనె పరిష్కరింపఁబడునని మనవారి నిశ్చయము. బ్రహ్మచర్యాశ్రమము స్వీకరింపఁదలంచిన ప్రతివిద్యార్థియు కొంత నిగ్రహమును పాటింపవలసియుండెను. ఇదియె తరువాత నాతడు వానప్రస్థాశ్రమమున జేరునప్పటికి ఆత్మత్యాగముగ పరిణమించును. ఇందు ఘనులైన ఋషిపుంగవులు వనములనుండి భూమండలవిజయమును చేసిన అలెగ్జాండరునకుగూడ లోఁబడక అతని కాశ్చర్యము కలిగించిరి. వారు ప్రేమమయులు. వారికి విజయభేరులతోడి పనియేమి? వీరిజూచి రాజాధిరాజు లాశ్చర్యపడి, మెచ్చి, తాము రాజఋషులై యీజీవతత్త్వమున లీనమగుటలో నాశ్చర్యమేమి?

జర్మనీకవి గతే చిత్రించిన స్త్రీపాత్రము లద్భుతముగ నున్నవి. కాని మగ్నభావమును ప్రదర్శించుపట్ల—గుణములలో మన శకుంతల కెన వత్తురాయని సందియము కలుగుచున్నది. ఆస్ట్రియా దేశపు కవియొకడు హీరోయను నాటకమును వ్రాసినాడు. నాయిక యొక యోగిని. బ్రహ్మచర్యాశ్రమదీక్ష వహించెనుగాని ఆదీక్షను చాలలేక పోయెను. ప్రణయమహిమకు లోబడిపోయెను. ప్రేమ యనగా జీవితమున సుఖమనుభవించుటగాక కష్టమున నింద్రియనిగ్రహము నాత్మవికాశమున నిగ్రహించిన మన శకుంతల యీమెకన్న నెంతధన్యురాలు! ఇట్లే యూర్వశియు దుఃఖమనుభవించి పవిత్రురాలయ్యెను. పురూరవుఁడు నట్లె కష్టము లనుభవించి పవిత్రుడు కావలసి వచ్చినది. ఆమెకొఱకు వెదకి వెదకి వనములు నగములు గడచి తుద కామెకౌగలిని కన్నీటితో గాంచెను. లంకావిజయము తరువాత నాంజనేయుఁడు వానప్రస్థుఁడుగ చిత్రింపఁబడినాడు. అతనినిగూర్చిన నాటకములందు నిది వ్యక్తమగుచున్నది. బౌద్ధనాటకమగు నాగానందమున సత్పురుషుఁడగు రాజేంద్రుఁడు తానే గరుడున కాహారముగఁ బోవ సమకట్టెను.

ఈనాటకములను ప్రదర్శించుటకు మనదేశమున కొందఱు యువకులైన ప్రయత్నింపవలసియున్నది. నవీన నాటకములను వానిమాతృకలగు పాశ్చాత్యనాటకములను మనవారు ప్రదర్శింప యత్నించుచున్నారు. కాని షేక్స్పియరు జనుల నాకర్షింపఁజాలఁడు. భాషాంతరీకరణములు సాధారణముగ రూపాంతరీకరణము లగుచుండును. మఱియు షేక్స్పియరు పరదేశవేషభాషలను భావములను జిత్రించినాడు. అతడు, నితరులును తాముచూచిన స్థితిగతులను బాగుగ జిత్రించియుంటనె ఘనులైరి. భారతీయహృదయముల నాకర్షింపవలెనన్న నాటకమును భారతీయజీవితమును భావములను నాగరికమును చిత్రింపవలెను. గ్రీసు జాతీయత ననుకరించి రోముదేశపు నాటకములు రోమువారి హృదయము నాకర్షింపలేకపోయెను. మనకు జనసామాన్యముకొఱకు నాటకము లావశ్యకములు. భారతీయ ప్రాచీన నాగరికమును వాఙ్మయమును ప్రదర్శించు జాతీయనాటకములు మనకు గావలెను. భారతీయజనులకు నూతనాదర్శములను నవీనాశయములను ఉత్సాహమును కలిగించుటకును, జాతీయ కళాప్రదర్శనముకొఱకును, రంగస్థలములు కావలెను. మనకు నూతనయాత్రలు భారతకథలు ప్రేమతత్త్వజ్ఞానమును స్త్రీపురుషులయందు కలిగించుటకు కావలెను.

ఆంగ్లేయకవియగు షెల్లీ తన కవితావిమర్శనమున నిట్లు చెప్పినాడు. "కవితకును జీవితాదర్శమునకును గల సంబంధ మితరవిధవాఙ్మయములందుకన్న నాటకవాఙ్మయమున బాగుగ కనబడుచున్నది. ఒక సంఘ మత్యంత నాగరికమయినట్లు లా నాటకవాఙ్మయప్రాశస్త్యమువలన నెఱుఁగవచ్చును. కొండొకకాలమున మంచి యుచ్చదశలోనుండిన నాట్యకళ దుర్గతికి దిగెనగాని నశించినగాని యాజాతియొక్క జీవమె దుర్గతిలోనున్నదని భావము. ఏలన సంఘదుస్థితి కళాముఖమును పోగొట్టును."

భారతీయ నాటకకళ భారతీయుల నుద్ధరించును. లోకమునకు శ్రేయమును కలిగించును.

నవీనాంగ్ల నాటకములు మతమునకు లోఁబడియుండు ఘనాశయములఁ గోల్పోయినవి. నీతియు మతము నాదర్శములుగ నుండు సుందరజీవితాగ్రముయొక్క చాతురిని జర్మనీనాటకములు గోల్పోయినవి. ఒక జర్మనీ విమర్శకుఁడే యిట్లనినాఁడు. "మనదు సినికి ఐహిక సుఖాభిలాషులగు సైనికులుకూడ సేవగించుకొనునట్లు తుచ్ఛసుఖమును సంతోషము ప్రధానముగాగల యధమనాటకములు రచింపబడుచున్నవి. జర్మనుదేశీయులీ దుస్థితి నంగీకరింపఁగూడదు. ఈ వ్యాధిమార్గమును సుందర జర్మనీ నుండి తొలగింపవలెను." ఫ్రాన్సులోని సంగతులును బాగుగ లేవు. వివాహములు, విసర్జనములు, కుండగోళకులదాయభాగములు మున్నగు విషయములీ కాలపు నాటకరంగస్థలములఁ జర్చింపఁబడుచున్నవి. "స్ట్రిండ్బర్గు" అను స్వీడనుకవి "స్వీడనువిధి"యను పొత్తమున ,వసంత' మను కథలో నొక వనితచే నేమిపాడించుచున్నాడో చూడుడు! "నా నోములఫలంబే దేశమునకున్నది?" పాపము! ఐరోపాదేశ మీప్రశ్నమును చాలకాలమడిగెను కాని ఐరోపాకంఠస్వరము కర్ణకఠోరముగనున్నది. నాటకలోకమున మధురకంఠనాదము కావలెను. భరతఖండ వీణానాదమును వాయింపగలదు. జాతీయతాసారమును తేజము నించుక ప్రోత్సహింపవలెను. ఐహికాశయములందు స్థావరమైన ఐరోపానాటకమున మానవునకు దైవాంశము చూపుటకు, మానవజీవితమున కర్మసిద్ధాంతమును ప్రదర్శించుటకు, ప్రకృతిసౌందర్య సందేశమును చెప్పుటకు, దుఃఖానుభవ పరమార్థమును బోధించుటకు, చిత్రజీవనమునఁగాక ఆత్మైక్యముననె ఆనందమునుపొందు ప్రేమతత్త్వమును తెలుపుటకు, నూతనోద్బోధనమునకు, భారతీయాశయమె ఐరోపానాటకము నుద్ధరింపవలసియున్నది. ఆనోములఫలమున్న దేశమేది? నోములపంట భారతీయహృదయమునందె కలదు. సీతాదేవి పుట్టి పెరిగి దుఃఖము ననుభవించి తరించినచోటు, శ్రీరాముఁడు త్యాగముచేసి ప్రేమించినచోటు, శకుంతల ప్రేమతో గానముచేసినచోటు నగు నీభరతవర్షమునఁగల ఋషిపుత్రులం హృదయమును జ్ఞానదృష్టిచేత పరిశీలించి చూతురుగాక! దేశీయవాఙ్మయమును కళల నుత్తేజితములుగఁజేసిన యీ సౌందర్యము నించుక చూతురుగాక! ఇది యొక నూతన యుగారంభము. ప్రపంచమున — భరతవర్షమున నూతనశకమున నేమి జరుగునో చూడవలసియున్నది.

—దిగవల్లి వేంకటశివరావు,
బి. ఏ., బి. ఎల్.

# స్వప్న కావ్యము.

చం. జలదము లాకసంబునఁ బ్రశాంతనినాదముతోడఁ జేయు గ
ర్జలు విని, యింద్రగోపములు సంకులపంకములందు మండలీ
లల జనువింతఁ గాంచుచు విలాసముగాఁ జరియింప, జ్యోత్స్నపుం
గోలుకరిసంజ, నెమ్మదిఁ గుతూహలముల్ ఘటియించె నెంతయున్॥

చం. తడిసిన నేలపైని హిమధాముని యంశుచయంబు బ్రాకెఁ, గా
ల్వడల జలంబు జిందుచుఁ గొలంకులలోఁ గలయంపిఁజల్లఁ, గా
రడవులనుండి కాంద్రుమనియార్చుచు బెబ్బులిరాకఁ దెల్ప, న
గ్గడియ ప్రమోదమున భయము గప్పనజేసెను బాటసారికిన్॥

తే. గీ. జలదయవనికచాటున చందమామ । యొంటరిగఁ గాలబద్ధుఁడై యుంటఁ జేసి
కాంతి నిస్తంద్రమగుచుఁ బ్రాకఁగఁగనోడెంగె । తడిసిన వెన్నెల భూనభోంతరమునొలసి।

కం. ఫలభారంబున వంగక । చలనంబును విడచి సహజ కాంతివిలాసా
కలితంబుగ ధరణీరుహ । ములు నిద్రాసౌఖ్యమందు మునుఁగఁగ సాగెన్।

మ. తలక్రిందన్ నిజబాహువుల్ జొనిపి, చెంతన్ వెల్గుదీపంపు లే
వెలుఁగున్ జూచు కుమారుఁగన్గొనుచు సాక్షీజీవితాదర్శమున్
వెలుఁగుంబొత్తములోని భాగముల యుద్దేశంబుఁ జర్చించుచో
జలదాంతర్గత చంద్రబింబరుచులాశల్ నిండెఁ బాండుస్మృతిన్॥

కం. మెలకువయో నిద్దురయో । తెలుపఁగ శక్తుఁడ గాను దృశ్యాంతర్యంబున్
కలిగెను క్రమముగ నిజము౦ । కలయున్ సరియయ్యె మదిని కలఁతలొలఁగెన్॥

తే. గీ. అభినవావసథనున్న యావసరమున । నాంతరవ్యథలన్నియు నడుగుఁబట్టె
భావదృష్టికిఁ బ్రేమప్రపంచ మొకటి । కనఁబడఁగసాగె సోదరుఁ గాంచినపుడు॥

సీ. కమలాక్షి కచ్చాయ కానఁజేయఁగ నేర్చు మిసమిసలాడెడి మేనితోడ
ఫాలస్థలంబునఁ గాలిమస్తరించి తెలుచుగానున్న ముంగురులతోడ
సౌజన్యభావంబు శాంతరసంబు సంప్లుతమైన ముద్దు నెమ్మొముతోడ
చిరకాలదర్శన స్నేహభారంబుచే ననలెత్తు చిన్నారినవ్వుతోడ

తే. గీ. సహజకవితావిలాస సంఛన్న వాగ్ఝ । రీసుధామాధురీసాగరీతితోడ
నంజకేతెంచి నాకుసాష్టాంగమెఱఁగి । యనుజుఁ డంతికదేశంబు నందునిల్చె॥

మ. చిరసందర్శనజాతదైన్యమున మచ్చిత్తంబు సంశీర్ణమై
పరమానందరసాలవాలమయి సౌభ్రాతృత్వతత్త్వాశ్రమై
పరఁగెన్ గన్నుల బాష్పబిందువులు కాల్వల్ గట్టె హా సోదరా!
పరిరంభంబునొసంగరా! యనుచు నా బాహుద్వయిన్ జేర్చితిన్॥

తే. గీ. బాహుయుగ్మంబునందున్న ప్రణయమూర్తిఁ । గనులకలువాలఁ దృప్తిగాఁ గాంచుచుంటి
అనుజుఁడెంతకుఁగాని మాటాడఁడయ్యె । ప్రేమరసమాస్యమునఁ బ్రదర్శింపఁబడియె

చం. ఇరువుర మొక్కతల్లిదఱి, నేనును నీవను భేదమున్ బర
స్పరముఁ గొలంకఁ ద్రోచి చనుబాలను ద్రాఁగితి, మాటపాటలన్
జరిపితి మొక్కచోట సరసప్రథమాన కవిత్వచాతురీ
పరిణతి నేర్చినార మొకపజ్జ యెఱుంగవె యిన్ని సోదరా!

చం. పలుకవు కోపమా? ప్రణయభావముజూపవు పాపమా! రసా
కలిత భవత్కవిత్వమును గాంచఁగనుంటిని జూప్రమా. ననున్
కల్ఁతలఁబెట్టఁబోకుమని గడ్డముపట్టి వచించుచుండ నా
పలుకులు విన్నరీతి గనుపట్టెను సోదరు మోముపోడిముల్॥

తే. గీ. అమృతములుకుపట్టు లన్నయ్య యనియన్న । పిలచె సోదరుండు; చిన్నినవ్వు
కావి పెదవిపైని గఁడలించుచునుండ । అపుడు — పరవశుండనైతి నేను॥

ఉ. తిన్ననియొల్లుతోడ ననుఁ ద్రిప్పిచూడక్కఁ బల్కరించి చి
న్నన్న! భవత్సమక్షమున హా! యనయుగ్మము దాఁటె నిచ్చి నే
నెన్నఁడు నీదుస్వప్నమున నేనిఁ గనంబడనైతి నాఁగ నా
కన్నుగవన్ నితాంతమయి కాల్వలఁగట్టెను బాష్పబిందువుల్॥

ఆ. వె. "సహజనీయుఁ డగ్రజాతుఁ డింతటిశోక । మందఁగారకుండ నైతినేను
భ్రాతృభక్తిఁ ద్రెంచి ప్రణయంబువర్జించి । పరమపదవి కేఁక నరుగువాఁడ॥"

మ. అనుచున్ జూచుచునుండ సోదరుఁడు, సౌహార్ద్రాబ్ధిందుఖున్ ద్రెంచి, ముం
దునకున్ వెన్కకు సారెగున్ జరుచు, నాందోళించు డెందంబుతో
ననుజుం డేగెన్, మఱినిల్పలేక వెనువెంటన్ బోవఁగా— "నాఁగమా!"
యని రోదోంతరమందు నేగుచు నదృశ్యంబయ్యెఁ జిత్రంబుగన్।

ఉ. కౌఁగిలిశూన్యమయ్యె నెటఁగన్పడఁడాయెను సోదరుండు సం
యోగవియోగ విస్మయమహోదయ మా ననుజాతునాస్యమున్;
సోఁగకనుంగవన్; మది కనుంగొనుచుండఁగఁ ముంపుదిక్కునన్
రాగముమాఱిపోయెఁ దనరారెను గుక్కుటకాహళధ్వనుల్।

తే. గీ. నిదుర మేల్కొని తిలకింప నీరసముగ । దీపముండె, సుతుండు నిద్రించుచుండె
హస్తగత కావ్యమణి శయ్యయందుఁ జాఱె । వాస్తవము స్వప్నమును నొక్కపగిదిఁ దోఁచె

ఉ. సారెకు సారెకెవ్వని ప్రసన్న యశోమృదుగీతిఁ బాడ హృ
ద్ధారణ దారుణార్తి జనితవ్యథ కొంత్తల నెత్తుచుండు నా
చారుచరిత్రురూపమును స్వప్నమునందునఁ గాంచుకల్మి చే
కూరెఁ గృతార్థతాఫలముగూడ లభించె నటంచు నెంచితిన్।

సీ। తఱిపివెన్నెల దళాంతర దంతురితమైన మిసిమిచాయలతోడ మేళవించె
శ్రుతిరాఁగ మందమారుతము నోనర్చి విహంగపుత్రిక రాగమాలపించె
చిఱుమబ్బుతునుకల మెఱుఁగువన్నియపైని కావిరంగొకవింత గానుపించె
ప్రాఙ్మహీధరదరీ ప్రాంతంబు నందుండి వివిధవర్ణము లుద్భవిల్లసాఁగ

తే. గీ. భువనగర్భంబునుండి ప్రబోధగీతి । ప్రకృతిసుందరి యల్లనఁ బాడసాగ
స్వప్నవృత్తి ప్రదగ్ధన స్తబ్ధమైన । భావమొకబాము గాటఁగాఁ బగిలఁబడియె।

—శేషాద్రిరమణకవులు.

# పంచాంగములు.

శ్లో॥ శేషేవిశేషో నాస్త్యేవ యచ్ఛ్రిత్రానువర్తనే।
చతురాస్యే చతురతా కావాతం గురుమాశ్రయే

ఆంధ్రదేశమునందున్న పంచాంగములు దేశభేదము లేకున్నను పరస్పరవిరుద్ధములుగా నున్న సంగతి ఎల్లరకును విశదమే. ఇందునుంచి మనపంచాగములు కర్మతులకర్మలకును, లోకమందు వర్షవాతాతపాదుల ఫలనిర్ణయములకును, ఆకాశపరిశీలనము చేయువారి మనోల్లాసమునకును నెంతవరకు నుపయోగించుచున్నవో తెలియకున్నది. ఈసందియముకలిగి సుమారు ౧౦ సంవత్సరములనుండి నేను పంచాంగము జేయుటమాని కీవియందు నిజ మెంతవఱకని యోచించుచుంటిని. బహుమందిపెద్దలతో వారివారివాదములకు ప్రతికూలముగ సంవాదము చేయుచుంటిని. ఇందులో నామనశ్శాంతియె మిగిలినది గాని సంవాదమం దవస్థ కానిపించుటలేదు. ఇంతవరకు నాపరిమితబుద్ధికి తోచినవిషయమును బట్టి చూడగ, గత ప్లవ సంవత్సరము మొదలు పంచాంగభేదముల హెచ్చరికతోపాటు సిద్ధాంతులకు శాస్త్రవిచారణము తగ్గుచున్నది. ఇకముందు కొంతకాల మిటులుండిన భిన్నమార్గములకుగూడ వృద్ధాచారము ప్రమాణము కాగలదు. కనుక నీతరుణమందే మనసిద్ధాంతుల సన్నివిధముల ప్రోత్సాహపఱచి యొకదారిని దృఢీకరించి మన [illegible] మేలు కలుగఁజేయ మనవిచేయుచున్నాను.

అట్టిపనికి గ్రహవేధస్థానము, జ్యోతిషగ్రంథాలయము, జ్యోతిశ్శాస్త్రపాఠశాలయు మనకావశ్యకములు.

ఇంతవరకు మనసిద్ధాంతులందరును తమ తమ పంచాంగరచనారీతులు సరియైనవనే నమ్ముచుండిరి. భిన్న భిన్న మార్గములుగా నున్నవన్నియు ప్రమాణములు కావుకదా. వారివారిపంచాంగములయందు వ్రాసినవిషయములు సరియగునవి కావని ప్రత్యక్షముగ జూపుటకు "వేధశాలయును" శాస్త్రమునుంచి చూపుటకు పుస్తకభాండాగారమును యావశ్యకములు.

## పంచాంగముల పద్ధతులు.

మన తెలుగుదేశమందు సనాతనముగ నోరివారు, కొట్టికలపూడివారు, తేజోమూర్తులవారు, పిడపర్తివారు, ముత్యంవారు, కుప్పావారు, శిష్టావారు, నిమ్మగెడ్డవారు, పిల్లలమఱ్ఱివారు, మరికొందరును పంచాంగకర్తలైయుండిరి.

వీరిలో పిడపర్తివారుదప్ప మిగిలినవారందరును నేకమార్గముననే పంచాంగములు చేయుచుండిరనుట తెలియుచున్నది. వీరందరు గ్రహణాదులయందును, కుజాదిస్ఫుటములయందును దృక్కునంగీకరించినవారు. సుమారు ౭౫ సం॥ రములకు పూర్వమందు వీరిపంచాంగములయందు యల్లయాచార్యులవారిబీజమే దృష్టమైయున్నది. గత ప్లవ సంవత్సరమువరకు కర్మోపయోగితిథులయందు పిడపర్తివారి దశకలోనముతప్ప వేరుభేద మేమియు నాంధ్రదేశమందు లేదని సాధారణముగ జెప్పవచ్చును. దశకలోనమును పిడపర్తివారు బీజముగనె వాడిరి. అప్పటికాలమందు కర్మోపయోగిపంచాంగములు రెండు విధములుగనే యున్నవి. 1 సూర్యసిద్ధాంతపంచాంగము 2 దశకలోన సూర్యసిద్ధాంత పంచాంగము. ఆకాలమునందు సిద్ధాంతులనుసంధినొందించుటలో దశకలోన మొకటియె సమాధానము చెప్పవలసియున్నది. ప్లవసంవత్సరమందు కర్మోపయోగిపంచాంగమందు మందకర్ణానుపాత మొకటి వచ్చినది. అప్పటినుండియు మనకు మూడు విధములు పంచాంగము లేర్పడినవి. 1 సూర్యసిద్ధాంతపంచాంగము 2 దశకలోన సూర్యసిద్ధాంతపంచాంగము 3 మందకర్ణానుపాత సూర్యసిద్ధాంత పంచాంగము. పిమ్మట క్రమక్రమముగ నయనాంశలయందు దేశాంతరమందు మార్పులు చేయుటచేత నిపుడు మన ఆంధ్రదేశమందు నేడువిధములగుపంచాంగము లేర్పడినవి.

1 సూర్యసిద్ధాంతపంచాంగము.
2 దశకలోన సూర్యసిద్ధాంతపంచాంగము.
3 మందకర్ణానుపాత సూర్యసిద్ధాంతపంచాంగము.
4 దేశాంతరముమార్చిన సూర్యసిద్ధాంతపంచాంగము.
5 అయనాంశలుమార్చిన సూర్యసిద్ధాంతపంచాంగము.
6 దేశాంతరాయనాంశలుమార్చిన సూర్యసిద్ధాంతపంచాంగము.
7 కేవల దృక్సిద్ధ పంచాంగము.

వీనిలో మొదటిమూటినుంచియె తిథులయందు భేదము వచ్చుచున్నది. ఇంతవరకు కర్మలకు సంబంధించినంతవరకే మాటలాడితిమి. ఇక కుజాదిస్ఫుటములయందు, గ్రహణాదులయందు ననేకభేదము లున్నవి. దృక్సిద్ధపంచాంగము పైపంచాంగములతో కలియదు.

## పంచాంగభేదముచేత లోకులకు బాధ.

ఈప్రకారము పంచాంగములు భిన్నభిన్నములుగనుండుటచేత కర్మల నాచరించువారికి భంగమున్నది. ఏమన, వీనిలో నేదయినయొకటియె సత్యముగాని అన్నియు కానేరవు. లోకమునందు సుఖము, దుఃఖాభావమనెడి రెండు పురుషార్థములు యథాకాలమందు యథోక్తకర్మల నాచరించుటచేతనున్ను, నిషిద్ధకర్మల త్యజించుటచేతనున్నుకదా సిద్ధించుచున్నవి. యథాకాలమందు యథావిధి కర్మలనాచరించుటచేత సుఖప్రాప్తియు, నిషిద్ధకర్మలను త్యజించుటచేత పాపానుత్పత్తిద్వారకముగ దుఃఖము లేకపోవుటయు సుప్రసిద్ధములు. యథాయోగ్యకాలమందు నాటినబీజము ఫలమునిచ్చుచున్నది. విపరీతకాలమందు నాటినబీజము నశించుచున్నది. నాటినబీజము దానిని చెరుచు దుష్కర్మ చేయకపోవుటచేత వృద్ధినొందుచున్నది.

ఈసందర్భమునందు ప్రాప్తదేశంబునగాని, ఇతరకారణములనుండిగాని యేదియో యొకపంచాంగము నాధారపరచుకొని కర్మలు చేయువారికి పైకష్టములు సంభవిల్లునుకదా. ఇదియునుంగాక ఇద్దరుసోదరులు వేరువేరు గ్రామములయందున్నపుడు దేశభేదము లేకపోయినను పంచాంగభేదములచేత తమతలిదండ్రులయాబ్దికములు వేరువేరు సమయములందు జరుపు దురవస్థ వచ్చినది. మరియు బెజవాడయందన్నగారును, గుడివాడయందు తమ్ముడును కాపురములు చేయుచుండిరి. వీరితండ్రిగారి

ప్రత్యాబ్దికదినమునకు తమ్మునివద్ద కన్నగారు వెళ్ళగ పంచాంగభేదముచేత నాపూర్వదినమందే తమ్ముడు ప్రత్యాబ్దికమును జరిగించుకొనెను. ఇదియొక లక్ష్యముగాని సర్వకర్మలు నీప్రకారముగ నెకలుషంబు నొందుచున్నవి.

## పరిత్యక్తవిరోధము.

పంచాంగభేదములచేత భిన్నమగు గ్రహచారము ననుసరించి జాతకముహూర్తాదులను చెప్పుచున్న సిద్ధాంతమురాని జ్యోతిష్కులనుండి జ్యోతిశ్శాస్త్రమందు ప్రమాణము తగ్గుచున్నది. పంచాంగభేదములచేత కలిగెడి గ్రహోదయ గ్రహాస్తమయ గ్రహణాదులయందు జేయుకర్మలు కలుషంబు లగుచున్నవి. ఈ ఆశ్వయుజశు ౧౫ గ్రహణము గ్రస్తాస్తమయమని కొందరు కాదని కొందరు వ్రాసిరి. ఇట్టిస్థితిలో నుపవాసములు మాడుటచేత కొందరున్ను, వ్యత్యాసాచరణతచేత కొందరున్ను మనసిద్ధాంతులవల్ల శ్రమనొందవలసివచ్చెనుకదా. గ్రహముల ఉదయాస్తమయాదుల వ్యత్యాసమునుండి నిషిద్ధకాలమందు కర్మల నాచరించుటచేతను, విహితకాలమందు పరిత్యజించుటచేతను వ్యత్యాసఫలము లోకులు పొందుచున్నారు.

పంచాంగములనుండి తెలిసికొనతగిన వర్షవాతాతప సస్యారిష్టార్ఘములయొక్క ఫలనిర్ణయము యథార్థముగ లేనందున పంచాంగములనుండి శాస్త్రప్రవృత్తికి భంగమున్నది.

ఇదిగాక యిప్పటిపంచాంగములనుండి జ్యోతిశ్శాస్త్రవృద్ధి కింకొకవిధమగు భంగము వాటిల్లినది. పూర్వకాలమునందు పంచాంగములయందు గ్రహయుద్ధ, గ్రహసమాగమ, గ్రహభేదములు, ఋక్షగ్రహసమాగమాదులును జక్కగ వ్రాసెడివారు. దానింజూచి కొందరలసులై సిద్ధాంతభాగమునందు పరిశ్రమను విడచి జాతకాదులయందు ప్రవృత్తులైరి. రానురాను మన సిద్ధాంతులు పంచాంగములయం దట్టిపరిశ్రమను తగ్గించుకొనిరి. ఇతరులుమాత్రము సిద్ధాంతగంధశూన్యులై వారియాచారమును మానకవచ్చిరి. ఇపుడు గ్రహయుద్ధసమాగమాదుల ననుసరించి జాతకాదులఫలములు జెప్పవలెనంటిమేని, కట్టుతీసికొని బుఱ్ఱబద్దలుకొడుదురు. ఇదంతయు మనపంచాంగములనుండియె వాటిల్లినదని నిశ్చయముగ జెప్పవచ్చును.

కనుక మనము మనదేశీయులయొక్క యభివృద్ధినోరతిమేని మనదేశమందుండు పంచాంగరచనాధికుల నానాత్వము తొలంగించవలసియున్నది.

## పంచాంగముల యావశ్యకత.

లోకములో మానవజాతి వారిప్రవృత్తికంతకును పంచాంగ మావశ్యకమని నమ్మవలెను. ప్రతిమానవుడును ఆయుర్దాయము, ధనము, పరలోకము మూడు ముఖ్యముగ కోరవలసియున్నది. తన కాయుర్దాయ మెంతయున్నదో ముందు గమనించవలెను. మనుష్య ఆయుర్దాయము పంచాంగమందుండు గ్రహగతినుండి తెలియకలదు. అట్టి ఆయుర్దాయమును వృద్ధిపరచుకొనుటకున్ను, క్షీణింపజేసికొనుటకున్ను మార్గము లున్నవి. గ్రహగత్యనుసారముగ నాహారవిహారములు సలుపువానికి తప్పక నాయుర్దాయము వృద్ధిపొందును. లేతవెన్నెలయందు కొట్టిన చట్లు, కందులు వగైరా నాహారపదార్థములు పుచ్చిపోవుటయు, వానిని సేవించుటచేత శరీరమందు వికృతిచేయుటయు సర్వజనులకును తెలియును. ఇచ్చట చంద్రగతియె సహకారముకదా.

ఇటులనే మనమనుభవించు పదార్థములయందు గ్రహగతుల ననుసరించి రసపోషణము, శోషణము కలిగియున్నది. అట్టిపదార్థములను సేవించుటచేతనే మన ఆయుర్దాయమునకు వృద్ధిహ్రాస్వము లుకలుగుచున్నవి.

కనుక మనకు స్వస్థశరీరధారణకు గ్రహములగతి కారణము. అట్టి గ్రహగతులు పంచాంగమందు నుండగలవు.

ఆయుర్దాయమున్నవానికి ద్రవ్యము ముఖ్యముగనుండవలెను. ద్రవ్యములేనివానిజీవితము వ్యర్థమని కూడ జెప్పవచ్చును. కనుక ప్రతిమానవుడు ద్రవ్యమును ముఖ్యముగ సంపాదించవలెను. ద్రవ్యమును సంపాదించుటకు మూడువృత్తులు కలవు. I వ్యవసాయము. 2 వర్తకము. 3 నౌకరి. మొదటిదగు వ్యవసాయమునకు వర్షవాతాతపములు (వాన, గాలి, ఎండ) ఉపజీవ్యకములు. వీనినుండి సస్య, అరిష్ట, అర్ఘములు (పంట, నష్టము, ధర) నిలచినవి. వర్షవాతాతపములయొక్క వైపరీత్యస్థితియందు సస్యారిష్టార్ఘములు నశించును. అనుకూలస్థితియందు ఫలించును. కనుక వైపరీత్యనిర్ణయము మనకావశ్యము. అవియన్నియు గ్రహగతులనుండియే కలుగుచున్నవి. అట్టిగ్రహగతి పంచాంగమందు తేటగనుండును. కనుక పంచాంగములు వ్యవసాయమున కతియుపయుక్తములు.

దేశమందుండు వస్తుసామగ్రియొక్క ధరలు గ్రహగతుల ననుసరించియే యున్నవి. ఇదియునుంగాక యెవరెవ రేయేకాలమందు ఏ యే వర్తకములు చేసిన లాభము నొందెదరో పంచాంగగ్రహగతి ననుసరించియె నిశ్చయముగ జెప్పవచ్చును. సరిగ నీవిషయము తప్పక పరీక్షింపవచ్చును — కనుక వర్తకులకుగూడ పంచాంగములు కావలసియున్నవి.

మనమందరము శిష్టాచారముగ శిరసావహించుచున్న నాఖరీవృత్తియందుగూడ పంచాంగము లావశ్యకములై యున్నవి. పంచాంగములనుంచి తెలియు కాలవిభాగమంతయు నాఖరీయం దావశ్యకమైయున్నది.

కనుక మనకందరకును ప్రవృత్తియందు పంచాంగములు ముఖ్యములైయున్నవి. అట్టిపంచాంగములకు నానాత్వముపట్టుటచేతనే నానాటికి మనవృత్తులు నాశమునొందుచున్నవి. మనుష్యమాత్రునకెల్ల నుపయోగకరములగు పంచాంగములు మహాదుర్దశ నొందుచుండ మనము ముఖముఖాలు జూచుకొనుట మంచిదికాదు.

## పంచాంగ సంస్కరణపద్ధతి

7-11-20 తేదీల జరిగిన ప్రథమాంధ్ర జ్యోతిశ్శాస్త్రజ్ఞ సమ్మేళనమందు బెజవాడలో నేను చేరితిని. మనసిద్ధాంతులందరును తమతమవాదములను నిలువబెట్టుకొనుటకు సిద్ధులగనుండిరి. వారిని సమావేశపరచుభాగము లోకముపూని యున్నది. సభలలో జర్చలయిం దన్నివాదములు సిద్ధాంతములు కానేరవుకదా? సభాస్థలమందు తమవాదమునకు సమాధానము చెప్పలేని సిద్ధాంతులు తమవాదమును వదలుకొనుటలో వెనుదీయరు. వెనుదీసినవారి వాదము మనకు ఎంతమాత్రము ప్రమాణముకాదు. కనుక వెంట వెంటనే పంచాంగపరిశోధనీపరిషత్తులు జరుపించుట ప్రథమకర్తవ్యము. కాలవ్యవధియందు వాదమున కంతముండదు. నాలుగుమాసముల కొకసభచొప్పున ౪-౫ సభలు జరిగినయెడల తప్పక యనేక భేదములు నివారితములై చాలాభాగము శాంతస్థితికి వచ్చును. జాతీయవాదులందరు నీకార్యము బూనుకొని లోకోపకారము జేయ ప్రార్థితులు.

ప్రస్తుతమందు మన యాంధ్రదేశమందు సుమారు ౪౦ సిద్ధాంతులు పంచాంగములు ప్రకటించుచుండిరి. వీరిలో ముఖ్యముగ 1 తోపెల్ల వెంకటరామసిద్ధాంతిగారు, 2 పిడపర్తి పెదపూర్ణయ్యసిద్ధాంతిగారు, 3 ఈ చినపూర్ణయ్యసిద్ధాంతిగారు. వీరిముగ్గురియొక్క మతముల నేకభవింపజేసిన మిగిలిన యావన్మందియొక్క మతములు బహు స్వల్పకాలమందు భిన్నమార్గములనుండ తొలగించి యొక మార్గమునకు తేవచ్చును. అందులకు నేనునమ్మకము జెప్పగలను.

వీరుముగ్గురు నొక దారికి వచ్చుమార్గ మూహించితిరేని మిగిలిన యావన్మందభారము నేను వహించగలను. దేశనాయకులారా!

మీవంటివారు తలచిన నీకార్యము సుసాధ్యము. ముగ్గురుపండితుల నొకదారికి రప్పించుట మీకు దుష్కరముకాదు. వీరుముగ్గురు నేకీభవించిరేని మిగిలిన యావన్మంది ఆంధ్రదేశసిద్ధాంతుల నొకదారికి తీసికొనివచ్చి మొత్తమాంధ్రదేశమంతకు నొకపంచాంగము ముద్రింపించవచ్చునని చెప్పెదను.

## ఒక్క పంచాంగమందుండు లాభములు.

మనయాంధ్రదేశము నంతటికిని దేశాంతరభేదము తప్ప వేరుభేదములు లేకుండ నొకపంచాంగ ముండినయెడల పైనవ్రాసిన దోషాపత్తియంతయు నశించి లోకులు పరమసుఖము నొందుదురు. ఇదియిట్లుండగ ప్రస్తుతమందు పంచాంగము లచ్చొత్తించుకొనుచున్న మనసిద్ధాంతులలో కొందరు కడుబీదలైయుండియు నిందునుండి ద్రవ్యమార్జించి కుటుంబపోషణము చేసికొను సంకల్పముతో వ్యయప్రయాసలకోర్చి పంచాంగముల నచ్చొత్తించుకొనుచుండిరి. ఆంధ్రదేశమందే నలుగురైదుగురియొక్కయో పంచాంగములు సర్వజనాదరణీయములుగ నుండుటచేత మిగిలినవారికి వ్యయప్రయాసలె మిగిలినవి. ఇప్పుడు మనము ఆంధ్రదేశమునంతటికిని నొకటియె పంచాంగమేర్పరచి దానికి తగుమూల్యము (ఖరీదు) నిశ్చయించిన గ్రామమున కొకపంచాంగమయినను కొనియెదరు. ఇందునుండి చాలాద్రవ్యము వచ్చును. దానిని మనసిద్ధాంతులకు యథోచితముగ నిచ్చితిమేని, వారికి వ్యర్థముగ గలుగు వ్యయప్రయాసలు తొలగి కొంతవరకైనను కుటుంబపోషణము కాగలదు. ఇట్టి ప్రవృత్తి జీవనమునకు సహాయపడుటచేత మనసిద్ధాంతులు సంఘీభావమునొంది సంవత్సరమున కొకసారి సమావేశమై లోకమందు వర్షవాతాతపాదుల పరిస్థితులను బాగుగయోచించి స్పష్టముగ జెప్పిన మనపంచాంగములు మిక్కిలివిలువకలవై మనసిద్ధాంతులకుటుంబముల నవలీలగ పోషించుచు లోకమందు మిక్కిలి ఆనందదాయకములు కాగలవు.

— పిడపర్తి సుబ్రహ్మణ్యసిద్ధాంతి.

# ఆంధ్రదేశాభిమాని.

సీ. తనభాగ్యమును గనుంగొని యుల్లమునుబ్బి తబ్బిబ్బుపడు జమీందారుఁడొకఁడు
తనసౌఖ్యమును జూచుకొని సారెసారెకు మదిఁబొంగిపడెడు సామంతుఁడొకఁడు
తనవైభవము మెచ్చుకొని క్రిందుమీఁదుఁగా నక సంచరించు మాండలికుఁడొకఁడు
తనశ్రేయముఁదలంచుకొని పొంగివీగుచు నొడలెఱుంగకయుండు నొడయఁడొకఁడు
గీ. తనదు స్వాతంత్ర్య సామ్రాజ్యధనము లెంచి మిడిసి రాలిపడెడు నెకిమీఁడొకఁడు
దేశహితమును గోరు పార్థివుఁడు లేఁడె యనుచు వివరించు నాంధ్రదేశాభిమాని.

సీ. ప్రతిగ్రామమందుఁ దప్పక సంఘములనేర్ప రచి స్థితిగతులు జర్చింపరయ్య
పంచాయతీన్యాయ పద్ధతి నెలకొల్పి ప్రజలనెల్లర సౌఖ్యపరచరయ్య
శాసననిర్మాణ సభ్యతార్హతగాంచ నెల్లవారలు బ్రయత్నింపరయ్య
పరిపాలనాభార పరిమితిఁదగ్గించి భూపాలురకుఁ దోడు చూపరయ్య
గీ. ఒహిని రాజ్యాంగతంత్ర నిర్వహణశక్తి ప్రభువులకు జూపి మెప్పించి వారవలన
గడిది స్వాతంత్ర్యలాభంబుఁ బడయరయ్య! యనుచు నర్థించు నాంధ్రదేశాభిమాని.

సీ. దైనికపత్రికల్ స్థాపింపవలెనన్న యుత్సాహసంపద యుద్భవించె
కళలెల్ల వెలయింపఁగా విశ్వవిద్యాల యములు స్థాపించు నూహలు జనించె
తెలుగుదేశంబు ప్రత్యేకరాష్ట్రంబుగా వెలయునన్నట్టి యాసలుదయించె
సకలాంధ్రజనమహాసభ గూర్చవలెనన్న సంకల్ప మగ్గల్ల నంకురించె
గీ. కర్మశాలలు నెలకొల్ప కడకదోఁచె నెల్లయెడలను నవశక్తి పల్లవించె
ప్రబలి జాత్యభిమానభావము రహించె ననుచుఁ బులకించు నాంధ్రదేశాభిమాని.

సీ. దేశభాషలలోనఁ దెలుగులస్సయనంగ సాటిమించినది మా మేటిభాష
జనులనౌదార్యాతి శౌర్యగాంభీర్యభా జనులఁగాంచినది మా జన్మభూమి
శరణాగతత్రాణ సార్వభౌములచేత ఖ్యాతికెక్కినది మా యాంధ్రజాతి
సతులచే నభిమానవతులచే నతుల సత్కీర్తినొందినది మా దేశమాత
గీ. తనరు శ్రీశైల కాళేశ దక్షవాటి కాది సుక్షేత్రములచేత ననఘమై సు
పూతమై భాసిలినది మా పుణ్యభూమి యనుచు శ్లాఘించు నాంధ్రదేశాభిమాని.

సీ. లలిమీరు నిత్యకళ్యాణంబుఁ బచ్చతో రణముగల్గి కరంబు గ్రాలునట్లు
పాడిపంటలుగల్గి పాడిమైఁ బ్రజలెల్ల నుల్లాసమొదవ రంజిల్లునట్లు
విద్యాధనంబులు వృద్ధియై బహుభాగ్య భోగాలతోఁ దులఁదూగునట్లు
స్త్రీలుఁ బూరుషులు సుస్థిరమైత్రి చేమించి యమితసౌఖ్యముల నోలాడునట్లు
గీ. వడిదురాచార భూతముల్ విడుచునట్లు రోగదుర్భిక్ష భయములు వీగునట్లు
కృపను గావింపవయ్య! లోకైకనాథ! యనుచుఁ బ్రార్థించు నాంధ్రదేశాభిమాని.

—మంగిపూడి వేంకటశర్మ.

# దేశీయమహాజనసభ — గ్రంథాలయోద్యమము.

(దర్భంగసంస్థాన గ్రంథాలయాధిపతియగు యస్. సి. గుహఠాకూరుగారిచే వ్రాయబడినది.)

ఈసంవత్సరము అఖిలభారత జాతీయోపసంఘము వారు శాసనసభల బహిష్కారమునుగూర్చి ఎక్కువ యోచన జేయుచున్నారు. అట్టిసందర్భమున నిర్మాణ కార్యవిధానమునుగూర్చి సూచనచేయుట అప్రస్తుత ప్రశంసగా కానవచ్చును. శాసనసభాబహిష్కారమునకు విముఖులుగానున్నవారి యభిప్రాయమును లోతుకుదిగి పరిశీలించినచో — బెజవాడ, ఢిల్లీ, బార్డోలీ కార్యవిధానముల ననుసరించి దేశములో తగుకట్టుబాట్లు జరుగక పోవుటయే, యిట్టిఆలోచనలు పుట్టుటకు కారణమని మనకు తోపకపోదు.

దైవానుగ్రహమువలనను వర్తమానకాలమున తదంశాసంభూతులై భూభాగమున భగవల్లీలను ప్రదర్శించుచున్న మహాత్మా గాంధియొక్క ఉపదేశప్రాబల్యముచేతను ఆసేతుహిమాచలపర్యంతము ఆత్మనివేదనతత్త్వము తీవ్రముగ వ్యాపించినది. దేశీయమహాజనసభ కాలానుగుణ్యముగ తమశక్తిని వినియోగించి దేశముకొరకై ఆత్మసమర్పణచేసి కష్టములపాలైన యెందరో మహాపురుషులయొక్కయు, యికముందుగూడ నట్టి సదుద్యమమునకు సంసిద్ధులుగానున్న పావనచారిత్రులయొక్కయు శక్తియుక్తులనన్నిటిని దేశాభ్యుదయమునకై వినియోగపరచుటకు వారివారి స్వభావానుసారముగ తగిన మార్గముల నన్వేషించి నిరూపణచేయవలసియున్నది. అందులో జాతీయవిద్య ముఖ్యమైనది. ఇందునుగూర్చి అక్కడక్కడ త్యాగశీలురగు గురువర్యులు వీలగునంత వరకు కృషిసల్పుచున్నారు. ఖద్దరువ్యాపకమునకైగూడ నిట్టికృషి కొంతవరకు జరుగుచున్నది. కాని సర్వజనసామాన్యమగునటుల నీ రెండువిషయములందు కూడ కృషిజరుగుచున్నదని చెప్పుట సాహసము. ప్రస్తుతము నిర్మాణవిధానమునజరుగుచున్న కృషి యీరెండు విషయములలోనే నని సామాన్యముగా చెప్పవచ్చును. జనసామాన్యమందు విజ్ఞానము వ్యాపింపచేయుటకు మనము ముఖ్యముగ కృషిచేయవలసియున్నది. ఇందుకొరకై పల్లెలయందు గ్రంథాలయములను స్థాపించవలెను. అందు సామాన్యులు చదువుకొనుటకును పండితులుకూడ చదువదగినట్టియు గ్రంథములను సేకరించవలెను. అక్షరజ్ఞానములేనివారి కుపయోగించునట్లు సాయంత్రమున కేవల సంభాషణమూలముననె జ్ఞానోదయము కలిగించుటకు ప్రయత్నించవలెను.

ఎక్కువ ప్రాధాన్యమువహించిన విషయములను గూర్చి కృషిచేయుటమాని, యితరవిషయములపై మన దృష్టిని యెంత కొంచెమైనను ప్రసరింపచేయుటకు తగు నావకాశ మున్నదాయని ప్రశ్న చేయవచ్చును. ప్రతి కాంగ్రెసుసభకును అనుబంధముగ ఒక గ్రంథాలయమును స్థాపించినచో నిర్మాణకార్యక్రమము, అందు ముఖ్యముగా ఖద్దరువ్యాపకముగూడ దేశమందెక్కువ చేయవచ్చునని పైప్రశ్నకు జవాబియ్యవచ్చును. అనుభవమువలన యీవిషయము తప్పక రూఢిపడును.

ఇపుడు ముఖ్యముగ చెప్పవలసిన విషయ మేమనగా కాంగ్రెసునకు తగిన గ్రంథాలయ మొకటి స్థాపించవలెను. ౧౦, ౧౨ కంటె యెక్కువసంఖ్యగల గ్రంథములులేని జిల్లాకాంగ్రెసు సంఘములెన్నియో గలవు. రాష్ట్రీయకాంగ్రెసుసంఘములస్థితిగూడ నిట్లే యున్నది. ఇక అఖిలభారతజాతీయోపసంఘము దేశమంతయు తిరుగునదిగావున అసంఘమునకు అనుబంధముగ గ్రంథాలయము వేరుగ లేదని చెప్పుట అనవసరము. అఖిలభారత జాతీయగ్రంథాలయమును స్థాపించి నిర్వహించుట ఒక కష్టమైన పనిగాదు. దీనికి ధనసంపత్తికూడ అంతగా నవసరములేదు. పాశ్చాత్యదేశములందు స్థాపింపబడియున్న మహోత్కృష్టములగు జాతీయపౌరగ్రంథాలయములందలి గ్రంథములన్నియు మూల్యమునకు కొన్నవిగావు. ఆయాదేశములలో అమలులోనున్న కాపీరైటు చట్టమునుబట్టి ప్రతిగ్రంథముయొక్క ప్రకాశకులును కొన్నిగ్రంథములను జాతీయగ్రంథాలయములకు యిచ్చి తీరవలెను. ఈవిధముగా అసంఖ్యాకములగు గ్రంథములు ఆయాగ్రంథాలయములకు సేకరింపబడినవి. అమెరికా సంయుక్తరాష్ట్రముల కాంగ్రెసులైబ్రరీయును, కలకత్తా ఇంపీరియలు లైబ్రరీయును, బరోడాకేంద్రగ్రంథాలయమును యిట్లేర్పడినవే. మనదేశమందుకూడ అట్టిమార్గమునే అనుకరించవచ్చును. మనదేశమున ప్రచురింపబడు అన్నిగ్రంథములకు ఒక్కొకపుస్తకమునకు మూడుగ్రంథములు ఆయాపుస్తకములను ప్రకాశింపచేయువారు ఏజిల్లాయందుందురో అట్టి జిల్లాకాంగ్రెసుసంఘమునకు పంపునట్లుగా దేశీయమహాజనసభయందొక తీర్మానమును చేయవలెను. ఆమూడుగ్రంథములలో ఒకటి జిల్లాసంఘమువారు తమ గ్రంథాలయమందుంచుకొని, రెండవదానిని రాష్ట్రీయకాంగ్రెసుసంఘమునకును, మరియొక

దానిని అఖిలభారతజాతీయోపసంఘమనదగు పంప వచ్చును.

ఈమార్గము నవలంబించినచో కేవల జిల్లా, రాష్ట్రీయ, అఖిల భారత గ్రంథాలయములే గాక ప్రతిపట్టణమందును, పల్లెయందును గ్రంథాలయములు స్థాపితమై తన్మూలమున జాతీయాభ్యుదయము పొందగలము.

గ్రంథాలయోద్యమమున కృషిచేయు సోదరుల కొక మనవి. కట్టుబాటులుండినగాని యేపనియును నిష్కర్షగ జరుగనేరదు. ఇందుకొరకై భారతదేశమందంతటను గ్రంథాలయోద్యమమున కృషిసలుపు ప్రముఖులందరు చేరి యొకసంఘముగ నేర్పడుట అవసరము. పంజాబు విశ్వవిద్యాలయము వారి యాజమాన్యముక్రింద దొరతనము వారొకసంఘము నొకదాని నేర్పరచుటకు ప్రయత్నించిరి. ఆసంఘము నొకటిరెండు సమావేశములు జరిపినపిదప దేశమున కేట్టిఉపకారమును చేయకయే నశించినది. గ్రంథాలయోద్యమాభిమానులగు భారతీయులందరు చేరి జాతీయ సూత్రముల ననుసరించి జాతీయాధికారముక్రింద భారత గ్రంథాగారసంఘము పేరుతో దొరతనమువారితోడ్పాటు లేకుండా సంఘ మొకదానిని స్థాపించుట అవశ్య కర్తవ్యము.

## ముద్దుల నాయెంకి.

నండూరి సుబ్బారావు, బి. ఏ.

యేమంటివే యెంకి యేమంటివే
పూతోట పండిట్లో
సీతాలు యెలుగుల్లో
నీతళుకు రేపకాన్ని
నాతల తిరిగిందోలె! యే!
మామిడి తోట్లోకెల్లి
మంచీ పండోటి గోసి
యేటోగాని నోట్లోపెస్తె
యిసమై పోయిందోలె యే!
పొత్తేళ్ళ జొన్నసేలా
నీ తాగమయి పోతాది
గమ్మైన వాస నొస్తె
గంగౌర పోయెనోలె! యే!

## బెలగుండె నాయెంకి.

నండూరి సుబ్బారావు, బి. ఏ.

యీ తి రొక్కటేవు యే మెచ్చినావె?
ఆడు నే నిక్కడే యాడినావమ్మ.
యేటి సురగలిరేసి యేటి చూస్తావె?
మావోడి మనసట్టె మరుగుతాదమ్మ.
శంద్రవంకలాం నేను శిత్రమున్నాదె?
వొంక పోగానె మావోడొస్తడమ్మా.
ఆడు నే నిక్కడే యాడినావమ్మ
మావోడి మనసట్టె మరుగుతాదమ్మా.
అవక పోగానె ఆడొస్తడమ్మా.

## ఓదార్పు.

ఓయమ్మ చింతిల్ల ♦ కూరటగనుము
గతముకై చింతింప ♦ గార్యమేమమ్మ
పాపపు దైవమ్ము ♦ పసంతియించనక
చెట్టిబాములనిన్ను ♦ హింసించెదల్లి
మాయమర్మము లేని ♦ మా దేశజనని
కాలకర్మము దాట ♦ గంజాక్షునశమె
కలకంఠికంటి నీ ♦ కొలుకరాదమ్మ
చెప్పరానిది తప్పు ♦ జేసినామమ్మ
మాతృద్రోహము సల్పి ♦ మసలినామమ్మ
రత్నగర్భము గల్గి ♦ రాజిల్లుచుంట
బంగారుబొజ్జనై ♦ వర్ధిల్లుచుంట
మాకేమియని మేము ♦ మైమర్చినాము
కన్నబిడ్డలమమ్మ ♦ గాచిరక్షింప
కడుపులోదాచిన ♦ కనకమ్ము నెల

మంచిరత్నాలను ♦ మాణిక్యములను
దొంగలు దొరలెల్ల ♦ దోచిరేయమ్మ
పగవారునివ్వచ్చి ♦ బంధించిరమ్మ
నీమాటవినకుండి ♦ నిందఁజెందితిమి
ఇడితిమి నీపల్కుఁ ♦ బెడచెవిఁ దల్లి
మాతరో! నీనీతి ♦ బూతంటిమమ్మ
నీవేషభాషలే ♦ నిరసించినాము
పరులవేషమ్ములే ♦ పాటించినాము
కోపించి మాపైని ♦ శాపమీకమ్మ
అపరాధులముమమ్ము ♦ గృపఁగాచుమమ్మ
నీకుగిన్క జనింప ♦ మాకుదిక్కెవరె
"తల్లిఁజూడనివారు ♦ తలతురేవన్ను"
అనుచు మాపినతల్లి ♦ యాగ్రహంబందె
కన్నమ్మ! మాకర్మ ♦ కట్టికుడ్పినది.
కూటికి గుడ్డకై ♦ కొఱఁతఁ జెందితిమి
నోరెత్తి మాటాడ ♦ నోచలేదమ్మ
తల్లి నీపైభక్తి ♦ తప్పయ్యెనమ్మ
నిన్ను కీర్తించుట ♦ నింద్యమ్మె జనని
ధర్మమ్ము పలుకుటే ♦ తప్పాయెఁ దల్లి
ఇట్టి బాధలఁజూచి ♦ హృదయమ్ము కరగి
మాకష్టములఁదీర్ప ♦ మదియందు నెంచి
మాయయ్య చక్రంబు ♦ మాచేతికొసగె
కష్టాలు దానిచేఁ ♦ గడవంగఁగలవు
చింతలెల్లనుఁ బాయు ♦ సిరులబ్బు జనని
కడగండ్లు దీఱడి ♦ కాలమ్ము వచ్చె
చింతిల్లకేతల్లి ♦ చింతిల్లకమ్మ.

—మంచం బుచ్చిలింగప్ప.

# తగిన శాస్తి

రాత్రి ౧౧ గంటలయినది. గాఢనిద్రయందుంటిమి. వీథితలుపుమీద దబదబమని దెబ్బలు వినవచ్చెను. తలుపుతెరచి చూచుసరికి రామస్వామిగారు ప్రత్యక్షమై "దొరగారు మిమ్ములను తక్షణమే పిలుచుకొని రమ్మనమన్నా"రని చెప్పిరి. దొరగారి ఆజ్ఞ మీరరానిది. అందుచేత కళ్ళు నులుపుకొనుచునే బయలుదేరిపోయి రైలుబండి ఎక్కితిమి. బండియందు జనసమ్మర్దము లేనందుచేత వెంటనే నిద్రపట్టినది.

మాలోనొకరికి—మెళకువ వచ్చి చూచుసరికి "నర్సారావుపేట" స్టేషనువలె నుండెను. వెంటనే బండి దిగితిమి. నాలుగుఅడుగులు నడచి చూచువరకది, సంతమాగులూరు స్టేషనయ్యెను. అనగా మేము దిగవలసిన స్టేషనుకు ౧౨ మైళ్ళ దూరము నందుంటిమన్నమాట. అప్పటికి తెల్లవారగట్ల 4 గంటలైనది. తిరిగి సాయంకాలము ౫ గంటలవరకును నర్సారావుపేట పోవునట్టి రైలుబండి లేదు. ఆనాటి మధ్యాహ్నమునకే రావలసినదని దొరవారి ఉత్తరవు. మామూలుబండి కట్టుకొని పోవుదమన్న సరియైన బాటలేదు. మీదుమిక్కిలి రాత్రి మేము రైలుబండిలో నిద్రించుచుండ జోరున వర్షము కురిసినదట. ఇక చేయునదేమి?

కాళ్ళకు బుద్ధిచెప్పి, తిన్నగా రైలుబాటను పట్టితిమి. చీకటియందు పడుచు లేచుచు (రామస్వామిగారు మాత్రము నాచేతి పెట్టెయొక్క బలమును పరీక్షింపదలచిరో. లేక దానిని పసులగొట్టదలచిరో, కాలుజారినదని వంకబెట్టి రైలుకట్టపైనుండి క్రిందికి దొర్లిరి. ఒక పొద అడ్డమువచ్చి వారిగమనమును ఆపినది. నాచిన్నిపెట్టెనుజూచి ఇటువంటి ఓర్వలేనివా రుందురనియే, తోలుపెట్టెకొనక ఉక్కుపెట్టెనే కొంటిని) ఉదయము 8 గంటలగుసరికి నర్సారావుపేట చేరితిమి.

అక్కడనుండి మేము చేరవలసిన గ్రామము పోవుసరికి, కడచినరాత్రి కురిసినవర్షమువలన ఆనాడు గ్రంథాలయవార్షికోత్సవము ఆగినదని దొరవారు సెలవిచ్చిరి. పడినశ్రమ వృథయైనదిగదా యని మనస్సు చివుక్కుమన్నది. మరునాడైన పెట్టకతీరదని మాలోనొకరనిరి. దానికి దొరవారు తమయామోదమును దెలిపిరి. అంతట మనస్సు కుదుట బడినది.

మరునాడు వార్షికోత్సవము జరిగినది. అగ్రసనాధిపతిగ గూడ ఏర్పరచిరి, పడినశ్రమకు, నడచిననడకకు తగిన శాస్తియైనదిగదా యని సంతోషించితిమి.

# ఆంధ్ర గ్రంథాలయోద్యమము: సింహావలోకనము

భారతదేశాభ్యుదయమునకై అనేక ఎన్నియో యుద్యమము లుద్భవించుచున్నవి. ఎన్నియో అంతరించుచున్నవి. కొన్నిమాత్రమే దినదినాభివృద్ధిని గాంచుచున్నవి. మన ఆంధ్రగ్రంథాలయోద్యమము ఇప్పటికి రాను రాను ముప్పది సంవత్సరములక్రిందట ప్రారంభమైనదని చెప్పవచ్చును. గడచిన పదునైదుసంవత్సరములనుండి తీవ్రముగా పనిచేయుచున్నది. ఈకాలమందు ఈయుద్యమపక్షమున జరిగినకృషిని సింహావలోకనముగ పరీక్షించి ఈయుద్యమ మిదివరలో దేశోద్ధరణ కెట్టిలాభనష్టములం కల్గచేసినదియు, ప్రస్తుత దేశకాలపాత్రములనుబట్టి భావికాలమున దేశసేవ చేయగల్గిన శక్తులిం దేమైనను నిగూఢమైయున్నదియు మన మిట్టితరి నిర్ణయించుకొనుట ముఖ్యావశ్యకము. మనదేశ మెన్నియోవిధముల దుస్థితియందున్నది. ప్రజల ఆయువు క్షీణించినది. దరిద్రదేవత దేశమంతటను దాండవమాడుచున్నది. ప్రజలు భిన్నభిన్న జాతులుగా చీలిపోయి అంతఃకలహములతో ఒకరితో నొకరికి ఐకమత్యములేక చీకాకుగా నుండియున్నారు. ఆత్మవిశ్వాసము, స్వయంసహాయతత్వము ప్రజలయందు సంపూర్ణముగా నశించినవి. స్వధర్మమును పూర్ణముగా త్యజించి పరధర్మవ్యామోహమున ప్రజలు చిక్కుపోయిరి. ప్రజలకళాకౌశల్యము, విద్యాసంపన్నత ప్రజలశక్తుల వికాసమున కుపకరించకయున్నవి. ఈలోపముల నన్నిటిని నివారణచేయుటకు స్వరాజ్యము ఒక్కటియే పరమసాధనమని అందరును అంగీకరించియున్నారు. ఈస్వరాజ్యమును స్థాపించుటెట్లు. కొందరు బ్రిటిషుప్రభుత్వమువారు మనలను స్వరాజ్యముకొరకై తయారుచేయుచున్నారనియు, నెట్లవరుసను మనకు ఈపదవిని లభింపచేసెదరనియు, ఈతెంచీకుచేయుటకును, ఈస్వరాజ్యసిద్ధికిని, సాధనము నూతనముగా ఏర్పడిన శాసనసభలే ననియును చెప్పుచున్నారు. వీరిమతమున తగిన ప్రతినిధులను ఎన్నుకొని శాసనసభలకు పంపి వారు తమవిధులను సక్రమముగా నిర్వహించునట్లు చేయించగలశక్తి ప్రజలయందు విజృంభించుటయే స్వరాజ్యస్థాపనము. ఇందుకొరకై ప్రజలు విద్యావంతులు కావలెను. ప్రజలయందు ఐకమత్యముండవలెను. వారు తమవిధులను, బాధ్యతలను బాగుగా గుర్తెరుగవలెను. పరిపాలనాశక్తి ప్రజలకలవడవలెను. మరియొకమతమువారు "ప్రజలు తమ స్వశక్తివలన స్వరాజ్యము సంపాదించవలసినదేగాని బ్రిటిషుప్రభుత్వమువారు భారతీయులకు నిజముగ స్వరాజ్యము దానపూర్వకముగా నిచ్చుట కల్ల. అట్లు ఇచ్చినను అది భారతీయులు నిల్పుకొనజాలరు. కావున ప్రజలు తమఆత్మశక్తిని విజృంభింపచేసి స్వరాజ్యమును సంపాదించుకొనవలయు" నని చెప్పుచున్నారు. ఈరెండుమతములవారికిని ప్రాప్య మొకటే అయినను దృక్పథము భిన్నము. ఏది ఎట్లున్నను ఈ స్వరాజ్యసౌధనిర్మాణముకొరకు ప్రజలు ప్రప్రథమమున చేయవలసిన కృషినిగూర్చిమాత్రము స్వదేశీయులేమి, విదేశీయులేమి, అసహాయవాదులేమి, మితవాదులేమి అందరును ఏకగ్రీవముగనే చెప్పుచున్నారు. ఆ యభిప్రాయములను కొన్నిటి నిచ్చట వివరించెదము.

సర్ జాన్ లారెన్సు అను ఆంగ్లేయాధికారి 1864 సంలో యిట్లువ్రాసియున్నాడు "ప్రతిగ్రామసంఘమును ఒక్క ప్రజాస్వామిక సంస్థాపనము. ఇది చిరకాలమునుండి వచ్చుచున్నది. బ్రిటిషుగవర్నమెంటువారు తమ బాధ్యతను నిర్వహించుకొనుటకు దేశపరిపాలన ఎంతవరకు ఎక్కువవరకు వదలుటకు వీలుండునో అంతవరకును ప్రజలపరము చేయవలెను."

ప్రభుత్వమువారిచే నియమింపబడినఅధికారవిభజన సంఘమువారు తమ నివేదికయందు ఇట్లుచెప్పియున్నారు:—"స్థానిక స్వపరిపాలన గ్రామపంచాయతీలు ప్రతిగ్రామ మందును స్థాపించుటమూలముగా పల్లెటూండ్లలో ప్రారంభించవలెను." గయాదేశీయమహాసభకు ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీయుత బ్రిజకిశోరుప్రసాదుగారు తమ ఉపన్యాసమున ఇట్లు చెప్పియున్నారు:—"దేశమును కట్టుబాట్లలోకి తెమ్ము. పల్లెటూండ్లకుపొండు. అక్కడి ప్రజలతో పని చేయుడు. ప్రజాసేవ ఎట్లుచేయవలయునో వారికి బోధింపుడు. గ్రామసంఘములను పునాదిగా స్థాపింపుడు. వానిపైన అఖిలభారత జాతీయ ఉపసంఘము వరకును స్వరాజ్యసౌధమును సోపాన పరంపరగా నిర్మాణముచేయుడు. వీనినన్నిటిని సజీవముగా నుండునట్లును, నిరంతర కృషిచేయుచుండునట్లును, శక్తివంతములుగా నుండునట్లును చేయుడు." మొన్నటి దేశీయమహాజనసభాధ్యక్షులగు శ్రీయుత చిత్తరంజనదాసుగారు ఇట్లు తమ అధ్యక్షోపన్యాసమున సెలవిచ్చియున్నారు:—"రాష్ట్రీయ స్వపరిపాలనకంటెను, సామ్రాజ్య బాధ్యతాయుత ప్రభుత్వము కంటెనుకూడ పల్లెటూండ్లను కట్టుదిట్టములకు లోనగునట్లుచేసి వానిని స్వపరిపాలకములుగా చేయుటయే ఎక్కువ అవసరమగుపని. ఈ

కొంటిలో దేనిని ఎక్కువ వాంఛించెదవని ఎవరైన నన్నడిగినచో నేను పల్లెటూండ్ల స్వపరిపాలనయందే నా కభిమతము కలదని నిస్సంశయముగా చెప్పెదను." ఈ స్థానిక పరిపాలనగల పల్లెటూండ్లలో అన్యోన్యసంబంధ మేర్పడవలెనను సంగతిని గూర్చి శ్రీయుత దాసుగారిట్లు చెప్పియుండిరి:— "ఈ పల్లెటూండ్ల సంఘము లన్నియు సహకారసూత్రములమూలముగా అన్యోన్యసంబంధము కల్గియుండవలెను. * * * * స్థానిక సంఘములు నిజమైన అధికారములు కల్గియుండి భారతీయప్రభుత్వము తగిన కట్టుదిట్టములకు లోబడిన హైతరశ్మి కనుకొన్నను నప్పుడే నిజముగ స్వరాజ్యము స్థాపితమైనదగును."

వీరందరు చెప్పినయంశములన్నిటిని కల్పిచూచినచో ఈ క్రిందియంశములు తేలుచున్నవి. స్వరాజ్యసౌధ నిర్మాణమునకు పల్లెటూరులు పునాది. కావున పల్లెటూళ్లను, ప్రజాస్వామికములుగా చేసి వీలైనంతవరకు స్వతంత్రములుగాను, స్వయంసహాయకముగా నుండునట్లును చేయవలెను. ప్రజలకు విద్యాభివృద్ధి చేయవలెను. ఈ ఫలము సిద్ధించుటకు ఆంధ్ర గ్రంథాలయోద్యమము ఇదివరకెట్టి కృషి చేసియున్నది? ఇంక ముందేమి చేయగల్గియున్నది?

ఈయుద్యమమునందలి ముఖ్యసూత్రము బ్రిటిషు ప్రభుత్వముతో మనదేశమున వ్యాపించిన పట్టణమునందలి వ్యామోహమును తగ్గించి పల్లెటూండ్లపై ప్రజలదృష్టిని మరలించుటయే. అందువలననే మన గ్రంథాలయములు ఎక్కువ పల్లెటూండ్లయందు స్థాపింపబడినవి. రెండవ విషయము: ప్రజలను విద్యావంతులుగా చేయుట. ఈయుద్యమము యొక్క ముఖ్యోద్దేశమే విద్యావ్యాప్తి. బ్రిటిషు ప్రభుత్వమువారు మన దేశమునందలి లోనికి తెచ్చిన విద్యాపద్ధతుల వలన నిర్మూలమైన సిద్ధాంతములను కొన్నిటిని పునరుద్ధరణ చేయుటకు మన విద్యాలయములయందు కృషి చేసినది. విద్య యనగా కేవలము పుస్తకములమూలముననే లభించునది కాదనియు, అన్ని యింద్రియములమూలముననూ మనస్సును, బుద్ధిని వికసింపజేయునదే విద్యయనియు, ఈవిధముగ మనదేశమునకు చాటి ఈ విధానమును వీలగునంతకు అమలులోనికి కూడ తెచ్చినది. గ్రంథాలయములయందు గ్రంథములను భద్రపరచి చదువరుల కందచేయుటయే యీ గ్రంథాలయముల పరమోద్దేశముగ నెంచక గ్రంథాలయములనేకములు మహోత్సవములను జరుపుచున్నారు. నాటకముల నాడుచున్నారు. సేవాసమితులను స్థాపించుచున్నారు. వినోదకరములగునట్టియు, జ్ఞానదాయకమైనట్టియు ఆటలను పిల్లలచే నాడించుచున్నారు. వ్యాయామములను గ్రంథాలయములవారు అభివృద్ధికి తెచ్చుచున్నారు. తాత్కాలిక పాఠశాలలనేర్పరచి ముఖ్యమగు విషయములలో యువకులకు విద్య నొసగుచున్నారు. జంగముకథలను జెప్పించుచున్నారు. పురాణపఠనము చేయించుచున్నారు. ఇట్లు జ్ఞానదాయకమగు పురాతన, అధునాతన మార్గముల నన్నిటిని నన్వేషించి ఆయా సాధనముల మూలమున ప్రజలయందు జ్ఞానము వ్యాప్తి నొందించుటకు ఆంధ్ర గ్రంథాలయములు పనికట్టియున్నవి. ఇట్టి కృషియే మనము ముందునకూడ తీవ్రముగ చేసినచో విద్యావ్యాపకము చేయుటయందు గ్రంథాలయములు ఉచితస్థానము నాక్రమించుననుట నిస్సంశయము.

ఇక పల్లెటూళ్లను కట్టుదిట్టములలోనికి తేచ్చుటకు మనయుద్యమ మెట్టి కృషి చేసినదియు, చేయగల్గినదియు విచారింతము. మన గ్రంథాలయము లన్నియు ప్రజాస్వామికపద్ధతుల ననుసరించియే పరిపాలింపబడుచున్నవి. అచ్చట పేదలకును, భాగ్యవంతులకును భేదములేదు. కుల, మత, జాతి వివక్షతలేదు. కార్యనిర్వాహకులు ప్రతిసంవత్సరము ఎన్నుకొనబడవలయును. ఇట్టి ప్రజాస్వామికత్వము ఈ గ్రంథాలయముల మూలమున దేశమున వ్యాప్తి చెందుచున్నది. మరియొక విషయము. వివిధవర్గ ఆర్థిక సంపత్తి కల్గినట్టియు, జాతి, మత, కుల విభేదములు గల ప్రజలను ఏకముఖమునకు ఆకర్షించుటకు గ్రంథాలయములకుగల సామర్థ్యము మరియేయితర సంస్థలకును లేదు. అందువలన ప్రజాస్వామిక సంస్థాపనలు పల్లెటూండ్లలో వ్యాప్తినొందవలెనన్న ముఖ్యముగ వెంటనే అనుసరించవలసినవి గ్రంథాలయముల స్థాపనయే. కావున ఈ యుద్యమము దేశమందు వ్యాప్తినొందినకొలదియు ప్రజాస్వామికతత్త్వము ప్రబలమై మేల్కొల్పబడి స్వరాజ్యసౌధనిర్మాణమునకు సన్నిహితసాధన మేర్పడును. సంఘములయందు అన్యోన్యసంబంధ మేర్పడి మండలసంఘములను, రాష్ట్రీయసంఘములను, అఖిలభారతీయసంస్థయు నిర్మాణమగుటకు మన ఆంధ్రగ్రంథాలయోద్యమము కొంతవరకు సఫలమగు కృషిని జరిపెను. పల్లెటూండ్ల గ్రంథాలయములు కొన్నిచేరి తాలూకా గ్రంథాలయసంఘము లేర్పడినవి. ఏర్పడుచున్నవి. ఈ తాలూకా గ్రంథాలయసంఘములపై మండలగ్రంథాలయసంఘము లేర్పడినవి. ఇవియన్నియు చేరి మన ఆంధ్రరాష్ట్రీయ గ్రంథాలయసంఘ మేర్పడినది. అఖిలభారతదేశమందున్న

యన్నిరాష్ట్రములయందును రాష్ట్రీయసంఘములు నిర్మాణమై ఆ యారాష్ట్రములయందు గ్రంథాలయోద్యమ వ్యాప్తి నొందించుటకును నన యుద్యమపక్షమున సంవత్సరములో అనవరత గ్రంథాలయప్రతినిధిసభతో పాటు అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధులసభయొకదాని సమావేశము చేసితిమి. అందుకు ఫలితముగ "అఖిలభారత పౌరగ్రంథాలయసంఘము" నిర్మాణమాయెను. ఈ అన్నిసంఘములకును గల అన్యోన్యసంబంధము సహకారసూత్రముమూలమున నేర్పడియున్నదిగాని కేంద్రీకరణమువలన కాదు. ఈసిద్ధాంతమునే శ్రీయుత దాసుగారు తమ అధ్యక్షోపన్యాసమున విపులముగా వివరించి స్థాపించియున్నారు.

కావున భారతస్వరాజ్యసౌధనిర్మాణమునకు గ్రంథాలయోద్యమము సాక్షాత్సాధనము. దేశముల్లెల్లను ఈయుద్యమమును చేపట్టి దేశమంతటను వ్యాప్తినొందించవలెను. ప్రతిపట్టణమందును, పల్లెటూళ్లయందును గ్రంథాలయసంఘములు స్థాపింపవలెను. శక్తివంతులకు కలుగు యుపయోగము అన్ని ప్రజలకందరికి లభించునట్టి దగిన సాధనముల నన్వేషించి అనుష్ఠానము చేసవలెను. ఏకప్రాంతమందలి గ్రంథాలయములన్నియు సంయుక్తవిధానానుసారముగ సంఘములుగా నేర్పడును. ఇట్లు తాలూకా, మండల, రాష్ట్రీయ, అఖిలభారత గ్రంథాలయసంఘము లేర్పడి దేశమంతట నుద్యమమును వ్యాప్తినొందించవలెను. ప్రజలు అట్లుచేసినచో విద్యావంతులును, ధనవంతులును, స్వయంసహాయ ఆత్మగౌరవములతో నిండియున్నవారలును అగుదురు. భారతీయులు తమ జాతీయవ్యక్తిత్వమును కాపాడుకొని తమవిశిష్టధర్మమును వెదజల్లుచు తిరిగి ప్రపంచమంతటను ఉపదేష్టలగుట నిస్సంశయము.

# కథ-కలాపము.

## వేదపరిషత్తు.

భారతజాతీయనిర్మాణమందు జాతీయవిద్య అగ్రస్థానము నలంకరించుచున్నది. ఈవిషయమునకు జాతీయ మహాసభయందు తగినప్రాముఖ్యత నివ్వబడలేదు. అయినను దేశమున ఇందునుగూర్చి తగినకృషి జరుగుచుండుట మిక్కిలి సంతోషావహము. తక్షశిల, ధాన్యకటక, నలంద, మధుర, కాంచీపురము మొదలగు విశ్వవిద్యాలయములు పూర్వకాలమందు వర్ధిల్లియుండి ఆధునికకాలపు విశ్వవిద్యాలయములకు మించినవైభవము కల్గియున్నమాట నిజమే. కాని ముఖ్యముగా పూర్వకాలమున విద్యాభ్యాసము జరిగినది గురువులయాశ్రమములయందు. ఇట్టిపద్ధతి ఇప్పటికిని మనదేశమున సంపూర్ణముగా నశించలేదు. కీర్తిశేషులగు చల్ల బ్రహ్మన్నశాస్త్రిగారు, భాగవతుల హరిశాస్త్రులుగార్లవంటి గొప్పవిద్వాంసులు తమయిండ్లనే విద్యాలయములుగా మార్చి విద్యార్థులకు అన్నదానముచేసి విద్యగరపుచుండిరి. ఇప్పటికిని వేదమును, శాస్త్రములును సజీవములుగా నున్నవన్న, ఈవిద్యలు గురుకులాశ్రమములయందు విద్యార్థు లభ్యసించుచుండుటచేతనే. కావున సనాతనధర్మమును పునరుజ్జీవనముచేసి దేశాభ్యుదయము పొందవలెనన్న ఈశాస్త్రపండితులను, వేదపాఠకులను, ఏపాఠశాలలలోనిడ్చి అచ్చట విద్యార్థులకు విద్యాభ్యాసము చేయువలయునని కోరుటకన్న వారిండ్లదగ్గరనే వారుండి విద్యార్థులకు విద్యాదానము చేయుటకు తగిన వీలును కల్పించుట యెక్కువవిద్యాభివృద్ధికి హేతువగును. మనయాంధ్రదేశమున ఈమార్గము ననుసరించి విద్యాభివృద్ధిచేయుటకు తగినసావకాశము కలదు.

మొన్నటి వైకుంఠఏకాదశికి గోదావరీతీరమగు కొవ్వూరు పట్టణమున ఆంధ్రగీర్వాణ విద్యాలయసంఘమువారి యాజమాన్యముక్రింద పెద్దవేదశాస్త్రపరిషత్తు జరిగినది. ఆసభకు రమారమి మూడువందలమందిపైగా పండితులును, ఒకయేబదిమంది విద్యార్థులును వచ్చియుండిరి. వచ్చినవారి నందరిని కఠినముగ పరీక్షచేసి ఉత్తీర్ణులకు వారివారి పారితోషికముల నిచ్చిరి. అచ్చటకు విచ్చేసిన విద్వాంసులందరును వయస్సునందు ముసలివారైనను, శైశవమందు అభ్యాసముచేసిన విద్యలో ఏభాగమును మరపు చెందక నేటికిని సజాగ్రముగ నుంచుకొనుట చూచినప్పుడు ఆధునిక విద్యాశాఖామూలమున శిక్ష నభ్యసించిన ప్రతిభావంతులును పూర్వపువిద్యావంతుల యాధిక్యము నంగీకరించకతప్పదు. వేదమందును, ఆంధ్రవ్యాకరణశాస్త్రములందును పరీక్షలు జరిగినవి. గానవిద్యకు పరీక్ష లేర్పాటుకాబడినదిగాని అనివార్యకార

ణములచే జరుగలేదు కొందరుపండితులు తమవిద్యార్థులనుకూడ పరీక్షకు హాజరుపెట్టిరి. అట్టిపండితులకు ఎక్కువ ప్రోత్సాహ మీయబడినది. జ్యోతిషశాస్త్రమున గణిత భాగమందు వైదుష్యము సంపాదించినవారు మనదేశమున యారుదు. కావున అట్టివారెవరు ఆహూతులయ్యెను రాలేదు. ప్రస్తుత మీపనియంతయు ఆంధ్రగీర్వాణ విద్యాలయసంఘముపేరుతోనే జరుగుచున్నది. ఇందుకొరకై ప్రత్యేకము విరాళములను వసూలుపరచి శాశ్వతమగు ఏర్పాట్లు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. "ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ" మను పేర ఒకసంఘము నిర్మాణమై ఆపీఠముయొక్క అంగముగానే ప్రస్తుతము కొవ్వూరుయందు నెలకొల్పబడియున్న "ఆంధ్రగీర్వాణ విద్యాలయము" విద్యాదానము చేయుటకును, వేదశాస్త్రములయందును, ఆంధ్రభాషావాఙ్మయమునకు సంబంధించిన అన్నిశాఖలయందును, బిరుదుపరీక్షలను స్థాపించి ఉత్తీర్ణులగువారలకు తగుపారితోషికము లిచ్చుటకును, తగినసన్మానముల నిచ్చి విద్వాంసులచే గ్రంథముల రచింపజేసి ప్రచురించుటకును, తగుప్రయత్నములు చేయబడుచున్నవి. ఈప్రయత్నములను సఫలీకృతము చేయుటకు పరమేశ్వరుని వేడుచున్నాము.

ఇట్టి పరిషత్తులు ఆంధ్రదేశమున రాను రాను వృద్ధియగుచుండుట చూచుచున్నాము. పూర్వము ఉర్లాము జమీందారు లిట్టిపరిషత్తును నిర్వహించి వేదశాస్త్ర విద్యలను పోషించిరి. ఇప్పు డాపరిషత్తుకు విఘ్నము కలిగినదని వినుచున్నాము. కృష్ణాతీరమున విజయవాటికయందుకూడ ఇట్టిపరిషత్తు లేర్పడి విద్వాంసులు సన్మానింపబడుచున్నారు. కొవ్వూరుసభయైనపిదప పాలకొల్లులో వర్తకశిఖామణులుకూడ వేదశాస్త్రపరిషత్తును సమావేశపరచి విద్వాంసులకు తగుసన్మానముల చేసిరని వినుచున్నాము. ఇట్లే ఇతరప్రదేశములకూడ పరిషత్తులు నిర్మాణమై విద్యాభివృద్ధికి సాధనములైనయెడల ఆంధ్రదేశమున వేదశాస్త్రములును, ఆంధ్రవాఙ్మయమును మిక్కిలి యభివృద్ధినొందుననుట నిశ్చయము.

## స్త్రీవిద్య బహుమాన పరీక్షలు.

స్త్రీవిద్యాభివృద్ధికొరకై ఆంధ్రదేశమునకొన్నిసంఘము లేర్పడి విద్యార్థినులను వివిధప్రదేశములయందు పత్రికాముఖమున పరీక్షించి బహుమతులనిచ్చుట కొంతకాలము నుండియు జరుగుచున్నది. ఈసంఘములలో మద్రాసునందున్న "విజ్ఞానచంద్రికాపరిషత్తును" నర్సాపురమందున్న పరిషత్తును, అగ్రేసరములు. ఇప్పుడునూతనముగా, ఆంధ్రకవయిత్రియు, విఖ్యాతకీర్తియు నగు గంగాభాగీరథి గుండు అచ్చమాంబగారు "అబలాజన పఠనమందిరము" అనుఒకసంస్థను గుంటూరుపట్టణమున స్థాపించి దాని యాజమాన్యముక్రింద స్త్రీవిద్యాభివృద్ధి సాధకముగనుండుటకు బహుమానపరీక్షలను కొన్నిటిని ఏర్పాటుచేసియున్నారు. ఆంధ్రవిద్యావంతులలో గుండు అచ్చమాంబగారిని ఎరుగనివారుండరు. వారుద్యమించిన ఈప్రాముఖ్యవిషయమున వారికి తగుసహాయముచేసి ఆంధ్ర స్త్రీవిద్యాభివృద్ధిపోషణకు విద్యాభిమానులందరు తోడ్పడుట అవశ్యకర్తవ్యము.

* * * *

# గౌతమీ గ్రంథాలయము

## రాజమహేంద్రవరము.

ఈ గ్రంథాలయముయొక్క 1921–1922 సంవత్సరము కార్యనివేదిక ముందుగా మా కందచేసినందుకు కార్యనిర్వాహకుల కెంతయు కృతజ్ఞులము. ఈనివేదికనుబట్టి గడచినసంవత్సరమున సభ్యులు 300 అయ్యుండ, ఈసంవత్సరమున 229 సభ్యులున్నట్లును, చదువరులసంఖ్య క్రిందటిసంవత్సరమునను, ఈసంవత్సరమునను సగటున ప్రతిదినము 75 అయినట్లును, సంస్కృతాంధ్రగ్రంథములు గడచినవత్సరమున 7789 యుండ, ఈసంవత్సరము 8000 యున్నట్లును, ఆంగ్లేయగ్రంథములు పూర్వసంవత్సరమున 3381 యుండ, ఈసంవత్సరమున 4979 యున్నట్లును, దాశపత్రగ్రంథములు గతసంవత్సరమందువలెనే 301 యున్నట్లును తెలియుచున్నది. ఆదాయవ్యయపట్టికయందు నియమింపబడినప్రకారము రు 50/లకు పుస్తకములు మొదట ధనములేకపోవుటచేత గొనలేకపోయినను, రెండవ ప్రతిగల ప్రాతపుస్తకముల నమ్మి నూతనగ్రంథములు భాండాగారమునకు చేర్చబడినవి. సరియైన గ్రంథనామావళి ప్రస్తావనసంవత్సరమున తయారుచేయబడినది. స్థానికపుర పాలకసంఘమువారు రు 500/లు గ్రంథాలయమున

కిచ్చుట కుద్యమించినను దొరతనమువారు అంగీకరించరైరి. కావున మామూలు రు 100 లు మాత్రమే ఇచ్చిరి. ఈ గ్రంథాలయపాలకులు తమ యత్నముచే ఆంధ్రదేశమునుండియు, తదితర భారతరాష్ట్రములనుండియు, ఖండాంతరములనుండియు కూడ ఎక్కువసంఖ్యగల అమూల్య గ్రంథములను సేకరించిరి. ఇది యంతయు కార్యనిర్వాహకుల కార్యదీక్షను వేనోళ్ళ చాటుచున్నది. ఈగ్రంథాలయము తొలుత శ్రీ వీరేశలింగ గ్రంథాలయమను పేరుతో ప్రారంభమై పిమ్మట సర్వజనగ్రంథాలయమను పేరు దాల్చి, తుదకు వసురాయగ్రంథాలయముతో సమ్మేళనము పొంది, ప్రస్తుతము గౌతమీగ్రంథాలయమను నామము ధరించి, ఆంధ్రమండలమున కంతకు వన్నె తెచ్చుచున్నది. ఈగ్రంథాలయపక్షమున పూర్వము బహుమతిపరీక్షలు కరపత్రముల ప్రచురణ మొదలగు విద్యాభివృద్ధికరమగు పనులుగూడ జరుగుచుండెను. ఇప్పుడు ఆశాఖలు అంతరించినట్లు కనపడును. పురపాలక సంఘమువారును, అమెరికా మిషనుసంఘమువారును ధర్మపఠనమందిరముల స్థాపించిన హేతువుచేత, పత్రికాపఠనమునకు ఈగ్రంథాలయ మంత ప్రాముఖ్యత నిచ్చుట లేదు. ఇచ్చట నొకవిషయము చెప్పవలసియున్నది. పౌరగ్రంథాలయములయొద్దకు వెదకుకొనివచ్చువారలకే గ్రంథములను అందచేయుటమాత్రమే వాని విధి కాదు. జనులను ఉచితసాధనములమూలమున నాకర్షించి వారలకు గ్రంథపఠనయం దభిరుచి కలుగచేయుట పౌరగ్రంథాలయముల ముఖ్యకర్తవ్యము. ఇందుకొరకే అమెరికాఖండమున గ్రంథాలయములను, వానియందలి పుస్తకముల పేర్లను, ఉపయోగమును సర్వజనులకు తెలుపుటకొరకై అనేకసాధనముల నవలంబించెదరు. పేరుపొందిన "క్లబ్బు" లకు గ్రంథాలయమువారు తమమందిరములో కొన్నిగదులను అరువున కిచ్చెదరు. విద్యార్థులు సెలవుదినములలో విహారముకొరకై ఇతరపట్టణములకు వెళ్ళినపుడు వారితో గ్రంథాలయమునుండి ప్రతినిధులు పంపబడుదురు. వీరు ఆవిద్యార్థులకు విశ్రాంతిసమయములయందు తమ గ్రంథాలయములనుగూర్చి ప్రశంసించి అందు వారికి అభిమానముకలిగి అందలిగ్రంథములను చదువునట్లుగా చేసెదరు. మనదేశమందు పత్రికాపఠనముకూడ పౌరగ్రంథాలయములలో చేర్చియుంచుటకు ముఖ్యకారణము స్వతంత్రముగా గ్రంథపఠనయందభిరుచి లేనివారినికూడ పౌరగ్రంథాలయముల కాకర్షించి వారికి గ్రంథపఠనమం దభిరుచి కలుగచేయుటకేయని చెప్పవచ్చును. కావున పత్రికాపఠనమును గౌతమీగ్రంథాలయమున యంతరింపచేయుటవలన గ్రంథాలయముయొక్క యుపయోగము కొంతవరకు తగ్గినదని మానమ్మకము.

కేవల గ్రంథాలయముగా యోచించినచో ఆంధ్రదేశమున పుస్తకములసంఖ్యనుబట్టి ఈగ్రంథాలయ మద్వితీయమని చెప్పితీరవలెను. దీని స్థాపన ప్రారంభమై ఇప్పటికి 20 సం॥ రములు మించినను, దినదినాభివృద్ధిగా నుండుటయు మిక్కిలి కొనియాడతగిన విషయము, మరియొక విషయము. పురపాలకసంఘమువారు తాము పత్రికాపఠనమందిరమునకై వెచ్చించుచున్నసొమ్ము గౌతమీగ్రంథాలయమున కిచ్చి ఆకార్యము వీరి యాజమాన్యమున నడుపుట వారి విధ్యుక్తధర్మము. గ్రంథాలయపాలకులు పురపాలకపఠనమందిరమును తమయాజమాన్యముక్రిందకు తెచ్చుకొనుటకు తగుకృషి జరుపవలసియున్నది. ఏలయన మనదేశప్రభుత్వము ప్రజాయత్తమైనపుడు ఇప్పటిపౌరగ్రంథాలయములు పురపాలకసంఘముల పరిపాలనకు వదలవలసియుండును. అప్పుడు ప్రభుత్వమును, ప్రజలును, ఐక్యమును పొందెదరు. కావున ప్రభుత్వమును మించినకార్యములు ప్రజలు చేయవలసినవి యుండవు. ఈయన్ని సందర్భములనుబట్టియు స్థానికపురపాలకసంఘమువారు ప్రస్తుతము చూపుచున్న ప్రోత్సాహముకంటె ఎక్కువసహాయమును గౌతమీగ్రంథాలయమున కిచ్చెదరని నమ్ముచున్నాము. మరియు గౌతమీగ్రంథాలయ కార్యనిర్వాహకులకు వినయపూర్వకముగ మేమొక మనవి చేయుచున్నాము. ఈ గ్రంథాలయముయొక్క ఉపయోగము కేవల స్థానికముగనే యుండుటకంటె ఆంధ్రదేశమున కంతకును దీనివలన ప్రయోజనము కలుగునట్లు చేయుట గ్రంథాలయాధికారుల విధ్యుక్తధర్మము. ఆంధ్రదేశమున గ్రంథములసంఖ్యనుబట్టి ఈ గ్రంథాలయము అగ్రస్థానము నలంకరించియున్న హేతువునుబట్టి ఆంధ్రగ్రంథవిభజనను (Bibliography) వీరు సమగ్రముగా ఆధునికపద్ధతుల నవలంబించి చేయించి ప్రచురించుట ముఖ్యముగ వెంటనే చేయవలసినపని ఇదివరకే ఈగ్రంథాలయమువారు తమవద్దనున్న ఆంధ్రగ్రంథనామావళి (Catalogue)ని తయారుచేయించి ప్రచురించియున్నారు. అందువలన ఏవిషయమునుగూర్చి ఎన్నెన్ని గ్రంథములు ప్రచురింపబడియున్నదియు, అవి యెక్కడెక్కడ దొరకునదియు, వానిని రచించిన గ్రంథకర్త యెవరైనదియు, స్పష్టముగా తెలియదు. పాశ్చాత్యదేశభాషలలో ఈ గ్రంథవిభజన ప్రత్యేకశాస్త్రముగా అభివృద్ధిపొందినది. కావున ఈ గ్రంథాలయమువారు ఈ

కొఱతను ఆంధ్రభాషను తొలగించుటకు మిక్కిలి ప్రయత్నించుచున్నాము. అట్లు ఆంధ్రగ్రంథవిజ్ఞానమును ప్రచురించినచో ఆంధ్రవాఙ్మయాభివృద్ధి కెంతయో సహాయకముగ గోచరమై గ్రంథకర్తలకును, పరిశోధకులకును మిక్కిలి ఉపకరించును.

* * * *

# స్వరాజ్యాశ్రమములు.

మహాత్ములు చెరసాలకేగినపిదప "యంగ్ ఇండియా" పత్రికకు సి. రాజగోపాలాచార్యులుగారు సంపాదకులైరి. మహాత్ములమతము వీరికి అనుభవమైనట్లు భారతీయులలో నెవరికిని కాలేదని ప్రతీతి. గయా కాంగ్రెసు అయినపిదప వీరు చెన్నపట్టణము సముద్రపుటొడ్డున ఉపన్యాసమునిచ్చుచు ఈ క్రిందివిధముగా తెలిపిరి:— "రెండువేల గ్రామములలో పనిచేయుటకు 2000 మంది జనులు కావలెను. ఈ గ్రామములను కాంగ్రెసుప్రచారమునకు కేంద్రస్థానములుగా చేయవలెను. ఆత్మసమర్పణము చేసినందుకు నిదర్శనముగా ఎక్కువప్రేమాతిశయమునకు విషయము దేనినైనను, ప్రతిజ్ఞించినవారుగా ఇట్టివారుండవలెను. మహాత్ములు బార్డోలీతీర్మానములో నిర్మాణము జేసినవిధము ఆచరణమునకు తెచ్చుటకుగాను ఇట్టివారు ఏదో యొకశాంతప్రదేశమును స్థావరము చేసికొనవలెను. చేతితో వడికిననూలుతో నేసినబట్టలను స్వయముగా ధరించుచు ఇతరులనుగూడ నట్లేచేయునట్లు చేయవలెను. సమీపమునకునున్నవారికి సావకాశము ఎప్పుడో కనుగొని మహాత్ములయుపదేశము వారికి నచ్చచెప్పి అనుష్ఠించునట్లు చేయవలెను. పిన్నలకు, పెద్దలకు నిట్లే యుపదేశించుచుండవలెను. ఇట్లు ఆత్మసమర్పణచేసిన 2 వేల జనులు బయలుదేరినచో నట్టివారికి ఆతిథ్యమిచ్చుటకు గ్రామములు లేకపోలేదు. హిందూమతము ఇంకను నశించలేదు. సనాతనధర్మము ఇంకను ఆచరణలోనుండియే యున్నది. అందువలన ఎవరిని క్షుద్బాధచే ప్రజలు మృతినొందనివ్వరు. కావలసినది ప్రజలయందు నమ్మకము కలుగచేయగలిగిన మనుష్యులు."

అసహాయోద్యమము భారతదేశమునందు వ్యాప్తినొందుటకు ప్రారంభించినది మొదలు ఎందరో మహానుభావులు తమసర్వస్వమును దేశమునకర్పించి ప్రజాసేవచేయుటకు సంసిద్ధులుగా నున్నారు. ఇట్టివారలకు ధనకాంక్ష లేదు. ప్రజల ధనమును గౌరవము చేయరేమోనను సందేహము లేదు. వారుకోరునది ప్రజాసేవ, దేశాభివృద్ధి. ఇట్టివారు పైన రాజగోపాలాచార్యులుగారు చెప్పినవిధముగా పల్లెటూళ్ళలో స్థావరము కల్పించుకొని ఆయా ప్రాంతములయందు తమశక్తిని వినియోగపరచినచో అచిరకాలములో దేశాభ్యుదయము చేకూరును. వీరలు మొదటచేయవలసినపని వీలైనచోట్లనెల్ల పౌరగ్రంథాలయములను నెలకొల్పుట. ఇట్లు ఈ సంస్థాపనల యోజనమూల్యమున ఎంతయో కృషిజరుపవచ్చును. ఇవియే స్వరాజ్యాశ్రమములు కాగలవు. కావున ఆత్మసమర్పణచేసి వన్నెకెక్కిన భారతీయులందరు రాజగోపాలాచార్యులుగారి యుపదేశమును ఆచరణలోనికితెచ్చి దేశాభ్యుదయమును చేకూర్చెదరుగాక!

* * * *

# ఆంధ్రదేశసేవకుల తరిబీతు.

ఆంధ్రగ్రంథాలయసంఘపక్షమున 1920 సంవత్సరం ఏప్రియల్, మే నెలలో ఆంధ్రవిద్వాంసులు పెక్కండ్రసహాయముతో ఆంధ్రయువకులు కొందరికి విద్యాదానము చేయబడినసంగతి ఆంధ్రలోకమునకు స్మృతిలో నుండవచ్చును. అప్పుడు ఆంధ్రసారస్వతము, రాజ్యాంగశాస్త్రము, హైందవరాజ్యతంత్రము, ప్రజాసేవ, సహకారసంఘములు, గ్రంథాలయోద్యమము, ఆంధ్రులచరిత్ర, వ్యక్తికిని, రాజ్యాంగమునకు నుండుసంబంధము, ఆర్థికశాస్త్రము, అ[illegible]శాస్త్రము మున్నగు విషయములను గూర్చి ఒకనెలదినములు ఉపన్యాసములు జరిగినవి. ప్రయత్నము మొదటిదగుటచే ఇందలి అవసరావశ్యకములు దేశమున బాగుగా వ్యాప్తిచెందకయుండుటచే నెయ్యండనూపు. పదునైదుగురుకన్న ఇతరగ్రామములనుండి యువకులు అభ్యసించుటకు వచ్చినట్లు కనుపడదు. అయితే ఈప్రయత్నము సఫలము కాకపోలేదు. శ్రీయుత మామిడిపూడి వెంకటరంగయ్యపంతులుగారు ఆసమయమున "అంకశాస్త్రమును" గూర్చి బోధించి విషయములను పుస్తకరూపమున ప్రచురించిరి. రాజ్యాంగవిషయములను

గూర్చి సూరి వేంకటనరసింహశాస్త్రిగారు బోధించిన విషయములను ప్రశ్నోత్తరమాలికగా "స్వరాజ్యతత్త్వము" అను పేరుతో రెండుకరపత్రములు ప్రకటించిరి. ఈతరగతులనుపొందిన యువకులందరును దేశసేవను చేసి మిక్కిలి ఖ్యాతిచెందిరి. ఇందుకైన ఖర్చునంతను ఆంధ్ర నాయకులగు శ్రీయుత టంగటూరు ప్రకాశంపంతులు గారు భరించిరి.

ఈసంవత్సరమునుండి ఆంధ్రయువకుల జ్ఞానాభివృద్ధి కొరకు అట్టి తాత్కాలికవిద్యాశాలను స్థాపించుటకు ఆంధ్రదేశగ్రంథాలయసంఘపక్షమున ప్రయత్నములు జరుగుచున్నవి. మార్చి నెల మొదటివారమునుండి ప్రారంభము కావచ్చును. గ్రామసంఘములచరిత్ర, వానినిర్మాణము, రాజ్యాంగశాస్త్రము, అర్థశాస్త్రము, సంఘసేవ ఆంధ్రసారస్వతము, ఆంధ్రదేశచరిత్ర మున్నగువిషయములనుగూర్చి సమర్థులగు ఆంధ్రులు బోధించెదరు. పండ్రెండుమంది ఉపాధ్యాయులుపొందినటుల తనయోగ్యతను తెల్పునటువంటి విధములును ఏ తేదీని శిక్ష ప్రారంభమగునో ప్రచురింపబడును. అట్టివారు బెజవాడపట్టణములో నెలదినములకు తక్కువగాకుండ ఉండుటకు సిద్ధపడియుండవలెను. బెజవాడయందున్నప్పుడు ఖర్చులను పెట్టుకొనలేనివారికి తగినసహాయమును చేయుటకు గూడ ప్రయత్నించుచున్నాము. ఈశిక్షావిద్యాలయములో అనుష్ఠించవలసిన విషయములనుగూర్చి సలహాల నెవరైన ఇచ్చినచో సంతసముతో నందుకొందుము. ఇందునుగూర్చిన జాబులను ఆంధ్రగ్రంథాలయసంఘము, బెజవాడ, వారికి వ్రాయవలెను.

# గ్రంథాలయోద్యమము.

"ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము"నుగూర్చి "త్రివేణి" పత్రికయందు ప్రకటింపబడిన వ్యాసమునుండి ఈక్రింది భాగములు "ఆంధ్రపత్రిక" యందు ౧౯౨౭ సం॥ జూను నెలయందు ప్రకటింపబడినవి.

"ఇరువది సంవత్సరములనుండి గ్రంథాలయమహాసభలే జరుగుటలేదు. ఈయుద్యమమును ప్రారంభించి విశేష కృషిసల్పినది శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య గారు. వీరు గ్రంథాలయ స్థాయిసంఘమునకు కార్యదర్శిగా నుండి దేశమంతటను పర్యటనసల్పి ఉద్యమాభివృద్ధికి దోహదమై యుండిరి. మూడుసంవత్సరములనాడు చెన్నపురిలో గ్రంథాలయసభలు అత్యుత్సాహముతో జరిగియుండెను. ఆనాటినుండియు ఉద్యమము అభివృద్ధిమార్గమునందుండెను. ఆమహాసభాసమయమునందు కార్యదర్శిగారగు వేంకటరమణయ్యగారు ఉద్యమాభివృద్ధికై ఒకముద్రణాలయము నుండుట అత్యావశ్యకమని సభ్యులకు విన్నవించి తమ్ము గౌరవించి స్వర్ణపతకమియ్యవలయునని యుండినవారందఱితోను ముద్రణాలయ మొసంగుమని ప్రార్థించెను. సభాసదులలో కొందఱి యభిప్రాయముతో తామేకీభవించి విశ్వప్రయత్నములు చేసి ఒక ముద్రణాలయమును బెజవాడలో స్థాపించిరి. ఈస్థాపనయే తలవనితలంపుగా గ్రంథాలయోద్యమమునకు అనిష్టదాయకమైనది. కేంద్ర సంఘ కార్యదర్శిగారు ముద్రణాలయములో మానేజరుగా స్వయముగా నుండవలసినవారైరి. గ్రంథాలయోద్యమమునకై ఈముద్రణాలయము సహాయము గాని యొనర్చినట్లు గానరాదు. ఇతర ముద్రాలయముల వలెనే యీముద్రాలయముకూడా వ్యాపారము చేసి ధనార్జనమునకై పాటుపడుచున్నట్లు తెలియవచ్చుచున్నది. రెండుసంవత్సరములనుండి గ్రంథాలయమహాసభలు జరుగుటలేదు. ఈసభలను జరుగునట్లు చేయవలసినభారము కేంద్రగ్రంథాలయ సంఘకార్యదర్శిగారిపైనే యుండును. శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారు తమ సొంతమునకు రాబడి నామమాత్రముగానైన లేనట్టి యీయుద్యమము నెట్లు యాజమాన్యము చేయుచున్నారో? గ్రంథాలయ మహాసభలు ప్రారంభించిన మొదలు అవి రాజకీయసభలతో నేలాటి సాంకర్యము కలుగచేసికొనకుండ ప్రత్యేకముగ వేరు కాలమందు వేఱుపట్టణములందు జరుగుచుండినవి. కాకినాడపురములో నాంధ్రమహాసభ జరిగినప్పుడు, నెల్లూరులో గ్రంథాలయమహాసభ జరిగెను. కడపలో నాంధ్రమహాసభలు జరిగినప్పుడు, విశాఖపట్టణములో గ్రంథాలయమహాసభ జరిగెను. కడపసభలలో గ్రంథాలయసభకూడ జరిపితే బాగుండునని యొకతీర్మానము అధిక సంఖ్యాకుల యామోదము బడసెను. కాని, దాని తర్వాత జరిగిన విశాఖపట్టణ గ్రంథాలయసభయందుమాత్రము రెండుసభల నొక్కటిగా జరుపుటను గ్రంథాలయ ప్రతినిధులు ఒప్పుకొనరైరి.

ఈసభాధ్యక్షులై యుండిన శ్రీపోలవరం జమీందారు గారయిన లేటు కే. ఆర్. వి. కృష్ణారావు బహదూర్ వారు ఈసభను రాజకీయసభలతో జేర్చుట కిష్టపడరైరి.

కావుననే మరుసటి రాజకీయసభలు అనంతపురములో జరిగినను, గ్రంథాలయసభలు చెన్నపురములో అతివైభవముతో జరిగెను. మరుసటిసంవత్సరపు సభలన్నియు మహానందిలో జరిగిన బాగుండునని సూచించినవారు శ్రీ వేంకటరమణయ్య పంతులుగారే. వారప్పుడు స్కౌటు ఉద్యమములో చాల కృషిసల్పుచుండుటచే ఆసంవత్సరము అఖిలభారత స్కౌటుమహాసభ మహానందిలో జరుగుటచేతను, మహానంది పుణ్యక్షేత్రమగుటచేతను, ఆసంవత్సరము మాత్రము గ్రంథాలయమహాసభను మహానందిలో జరుపుటకు గ్రంథాలయప్రతినిధులామోదించిరి. కాని, మహానందిలోనే రెండుసభలను కలిపినందున గ్రంథాలయసభకును ఉద్యమమునకు వచ్చిననష్టము విశదమాయెను. మొదటిరోజు ఉదయము ప్రతినిధులెవ్వరు విశేషముగా రాకుండిరను, ఎవరో పదిమంది కూర్చుండి సాధారణముగా రెండురోజులు జరుపవలసిన మహాసభను రెండుగంటలలో ముగించివేసిరి. ఇదియే ఆఖరు మహాసభ. మరుసటిసంవత్సరము సభ నెచ్చటనైన సల్పుటకు కార్యదర్శిగారు కృషి సల్పిరా? అప్పటినుండి ఇప్పటివరకు కొక క్రొత్తగ్రంథాలయమైనను ఎచ్చటగాని స్థాపించినట్లు కానరాదు. కాని, తత్పూర్వము స్థాపింపబడిన గ్రంథాలయము లనేకములు నశించినట్లుమాత్రము తెలియవచ్చుచున్నది. ప్రస్తుత రాజకీయోద్యమమునకు గాని జనసామాన్యము పాల్గొనవలసిన యేయుద్యమమునకు గాని జయప్రదము కావలయునన్న గ్రంథాలయోద్యమము మనఆంధ్రదేశమునందు పునరుద్ధరించుట అత్యావశ్యకము. ఇట్టి మహోద్యమము నిష్ఫలము పడుచుట ఆంధ్రుల కార్యశూరత్వమునకు భంగము కల్గింపక మానదు. కార్యనిర్వాహక కేంద్రసంఘములోనుండు సభ్యులైనను మేల్కాంచి ఉద్యమాభివృద్ధికై కావలసిన ప్రయత్నములు చేసి ఆంధ్రాభ్యుదయమునకు తోడ్పడెదరు గాక!"

## జవాబు.

దానికి అయ్యంకి వేంకటరమణయ్యగారిట్లు జవాబిచ్చిరి:—

తమపత్రికనుండి తీసి ముద్రింపబడినభాగమును ఆంధ్రపత్రికయందు జూచితిని. అందులో నాకు సంబంధించిన విషయములు కొన్నిగలవు. వానికి జవాబు వ్రాయుచున్నాను. దయచేసి తమపత్రికయందు ప్రకటింపగోరెదను. 4 మాసములకాలము బెజవాడయందు, లేక వేరొకస్థలమున విశ్రాంతితీసికొనుచుండుటచే, మీవ్యాసమును తెం టనే జూచుట తటస్థించినదిగాదు.

నేను "ముద్రణాలయములో మానేజరుగా సర్వదా" ఉండుటలేదు. మా నేజరు వేరుగా ఉండియున్నారు. నేను పైపెత్తనదారుడను. అందుచేత "సర్వదా" అనుట ఉండవలసినదిలేదు. "సభాసదులలో కొందరు......విశ్వప్రయత్నములను జేసి ఒకముద్రణాలయమును బెజవాడలో స్థాపించిరి" అని వ్రాసినారు. సభాసదులలో "కొందరు" ప్రయత్నము "ముద్రణాలయము స్థాపించుట" వరకు పూర్తికాలేదు. కొంతవరకు జరిగినపిమ్మట, దైవికముగ జరిగిన (మానవులననుకొని లాభములేదు) కారణములచేత "ఇతర ముద్రాలయములవలెనే ఈముద్రాలయముకూడ వ్యాపారముచేసి ధనార్జనమునకై" పాటుపడవలసి వచ్చెను. ఆకారణములు ఈయుద్యమమందు పనిచేయుచుండిన అభిమానులందఱికిని తెలిసినవేను. అందుచేత ఇచట వానిని వ్రాయనగత్యములేదు.

చెన్నపట్టణమునందు గ్రంథాలయసభలు జరిగినపిమ్మట మరుసటిసభను మహానందిలో చేసిన బాగుండునని సూచించినది నేనేయని వ్రాసినారు. గ్రంథాలయసభను ఆంధ్రమహాజనసభతో బాటుగ, ప్రారంభించినప్పుడే (1914) కష్టములకు లోనైయుండుటచేత, రెండుసభలును ఒక్కచోట జరుపకూడదని స్వానుభవమువలన దెలిసికొంటిని. ఈవిషయమునే అన్నిసభలయందును వ్యక్తీకరించియుంటిని. కాని కొందరుపెద్దలు గ్రంథాలయసభను ఆంధ్రమహాజనసభతోబాటు చేయుటవలన దేశమునకెక్కుడు ఉపయోగముగ నుండునేమోయని దృఢాభిప్రాయులైయున్నారు. నాయభిప్రాయమునే అనేకసమయములందు వ్యక్తీకరించియుండిరి. అట్లైనాచే ఆంధ్రమహాజనసభతోబాటు ఈసభను ఒకసంవత్సరమైన జరిపిచూతమనిరి. అందుమీద శ్రీగాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు మరుసటిసభను మహానందియందు జరుపవలెనని, ఉపపాదింపగా, శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఆమోదించిరి. వెనుకటికిని (1914) అప్పటికిని స్థితిగతులేమైన మారినవేమోయని తలంచి, నాయామోదమునుగూడ దెలిపితిని. అప్పటికి "స్కౌటు" సభను "మహానంది" లో చేయవలెనని నిర్ణయింపలేదు. 1920 సంవత్సరము జనవరి—ఫిబ్రవరిమాసములలో నేను మహానందికిబోయి, "స్కౌటు" సభను చేయుటకు దగిన పరిస్థితులను పరిశీలించి, పిమ్మట నిర్ణయించితిని. గ్రంథాలయసభను వేరొకస్థలమున జరిపినను, "స్కౌటు" సభను మహానందిలో జరుపుట కేయభ్యంతరమును లేదు.

"మఱుసటిసంవత్సరమున సభ నెచటనైనసల్పుటకు కార్యదర్శిగారు కృషిసల్పిరా?" అని తాము ప్రశ్నించినారు. కృషిసల్పితిని, సల్పినారు. కాని సఫలము కాలేదు. ఆవివరములీక్రింద వ్రాయుచున్నాను.

1919 సంవత్సరమున మద్రాసునందు గ్రంథాలయసభ జరిగినపిమ్మట 1920 సంవత్సరమున నీసభ "మహానంది" యందు జరిగినది. మహానందియందు జరిగినసభయందు ఈసభను "గుంటూరు"మండలమువారు ఆహ్వానించియుండిరి. ఆసంగతిని తాము మఱచినట్లు తోచుచున్నది. ఆహ్వానము జరిగియుండుటచేత, 1921 సంవత్సరమున ఈసభ గుంటూరుమండలమందు జరుగవలసియుండెను. ఆమండలమందున్న "వేటపాలెము" నందు ఈ సభను జరుపవలెనని కొంతవఱకు ఆమండలమువారు ప్రయత్నించిరి. కాని వారిప్రయత్నములు నెఱవేరలేదు. పిమ్మట రాజకీయాందోళనమువలన ఈసభాప్రయత్నములు వెనుకబడినవి. అందుచేత 1921 సం. సెప్టెంబరు నెల ఆఖరువారమున ఆంధ్రగ్రంథాలయసంఘ సమావేశము నొకదానిని "బరంపురము" నందు సమావేశపఱచి స్థితిగతులన్నిటిని, వారికి నివేదించితిని. అందుమీద సభను ఈసంవత్సరమునకు నిలిపివేయవలయునని కొందరును, జరుపవలయునని కొందరును చర్చలను జేసిరి. ఒకరు తమగ్రామమునకు ఆహ్వానము చేసిరి. (వారు రెండవదినముననే శ్రీకృష్ణ జన్మస్థానమునకు బోయిరి.) తుదకు గుంటూరుమండలమువారు నవంబరు (1921) నెలాఖరులోపున ఈసభను తామే చేసెదమని చెప్పిరి. అందుమీద సభను జేసెదమని నందులకై వారిని అభినందించుచు తీర్మానముగూడ జరిగినది. పిమ్మట సభను జేయుటకై ప్రయత్నములనుగూడ జేసిరి. తుదకు పంచమమహాజనసభతోకూడనైన జేయవలెనని తలంచిరి. ఆంధ్రమహాజనసభతో బాటుగ చేయకపోవుటకుగల కారణములే దీనితో బాటు చేయకపోవుటకును కారణములయ్యెను. ఆనేక కారణములవలన వేరుగచేయుట సంభవము కాలేదు.

ఇక ఈవత్సరము మామూలుగ జరుగు కాలము మీఱిపోయినను, మద్రాసునందు జరిగినట్టుల నవంబరు నెలాఖరులోపునైన ఈసభను గుంటూరుమండలమువారు చేసెదరని తలంపవచ్చును. ఈసదర్భముననే ఇటీవల జరిగినసందర్భము నొకదానిని మనవిచేయవలసియున్నది. ఈసభజరుపుటకు గావలసిన ఏర్పాటులను గూర్చియు, ఆహ్వానసంఘమును గూర్చియు, కొందరను కలసి మాట్లాడుకొంటిమి. ఆహ్వానసంఘాధ్యక్షుని, ఉపాధ్యక్షుని కార్యదర్శులను మాలోమేము నిర్ణయించుకొంటిమి. మఱుసటిదినము ఉదయముననే, ఆహ్వానసంఘాధ్యక్షుడు, కార్యదర్శులు—అందరును శ్రీకృష్ణజన్మస్థానమునకు బోయిరి. అప్పుడు గత్యంతరము తోచలేదు. మూడవదినమునకు అందరును తిరిగివచ్చిరి. భావిప్రయత్నము తిరిగి జరుగుట ప్రారంభమాయెను.

ఇక స్వంతవిషయము కొంత వ్రాయవలసియున్నది. నన్ను "కార్యదర్శిపదవికి రాజీఇచ్చెదరా" యని వీరు ప్రశ్నించిరి. నేను రాజీఇయ్యలేదు. "లేకున్న ఈయుద్యమముపట్ల ఏమిపనిచేయుచున్నారు?" అని ప్రశ్నించినారు. గుంటూరునందు జరుపవలసిన సభవిషయమైన ప్రయత్నములను పైన వివరించియేయుంటిని. మిగిలిన పనులు నాశక్తికొలది ఇదివఱలోవలెనే చేసినాను. డైరీ వ్రాసియుంచలేదు.

1921 సం. నవంబరుమాసమునుండియు దేహమునందు స్వస్థత లేనందుచే, ప్రకృతివైద్యమునే సేవించుచున్నాను. అందుచేత అప్పటినుండియు, స్వంతపనులనుగూడ చూచుకొనజాలనైతిని. ఈసందర్భమున ఇంకొక విషయమునుగూడ విన్నవించెదను.

1907 సంవత్సరమున పాఠశాలవిద్యాభ్యాసమును మానివైచితిని. దేశమునకై పాటుబడ సంకల్పించుకొని 1909 సంవత్సరమునుండియు భగవంతుడు తోపించిన మార్గముల చేతనైనంతవఱకు పాటుపడుచుంటిని. చేసిన పనులయందు ఆశాభంగమనుమాట నెఱుగను. 1919 సంవత్సరమువఱకు ఆప్రకారము నిరాటంకముగనే జరిగినది. ఆసంవత్సరము అక్టోబరుమాసమున నాభార్య మృతినొందినది. నవంబరుమాసమున మద్రాసునందు గ్రంథాలయసభ జరిగినది. నేను చేయుపనిని మెచ్చి, దానికి సహకారిగనుండుటకై, ఇంకను ఎక్కువపనిని చేయుటకు వీలగుటకును, ముద్రాక్షరశాల నొకదానిని ఇచ్చుటకు తీర్మానించిరి. ఉదారభావముతో విరాళములను వేసిరి. కాని ఫలితము వేరయ్యెను. ఉద్యమమునకు సహకారిగనుండవలెనని తలంచినపని నాకు ప్రతిబంధకమయ్యెను. నాభార్య మృతినొందినదినమున గుంటూరునందు బాలభటశిక్షాశిబిరమును ప్రారంభించుచుంటిని. ఆనాడైన నాకింతటి మనోదైన్య మేర్పడలేదు. ముద్రాక్షరశాలవలన గలిగిన ఆశాభంగమువలననే నాయారోగ్యము క్రమముగా చెడి, ఇప్పటివఱకును విశ్రాంతితీసికొనవలసివచ్చెను.

ఇప్పుడు దేహమునందు ఆరోగ్యమేర్పడినది. ముందు యథావిధిగ గ్రంథాలయోద్యమకార్యములను నిర్వర్తింపగలనని తోచుచున్నది.

నేను విద్యార్థకుడనుగాను. తోచినవిధముల చేత నైనంతవరకును సేవజేసితిని. చేయుదును. ఉపయోగమున్నచో గ్రహింపుడు. లేదా క్షమింపుడు.

## ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ.

౧౯౨౭ వ సంవత్సరమునగూడ గ్రంథాలయ ప్రతినిధుల మహాజనసభ జరుగకుండుట మిక్కిలి విచారకరమైన సంగతి. ఈసభవిషయమై శ్రీయుత బెల్లంకొండ రాఘవరావుగారు విశేషప్రయత్నములను జేసినను, సభ జరుగుభాగ్యము గలుగలేదు. సభ జరపినయెడల, తాము ఏబదిరూపాయల విరాళమునగూడ ఇచ్చెదమని, కప్పా శ్రీరామశర్మగారు శ్రీకృష్ణ జన్మస్థానమునుండి ఉత్తరమును వ్రాయుటయేగాక, పలుమారు హెచ్చరించియున్నారు. ఇతర పెద్దలు ప్రయత్నములనుగూడ జేసిరి. ఏమైననేమి! తుదకు సభజరుగలేదు.

శ్రీ కప్పా శ్రీరామశర్మగారు శ్రీకృష్ణ జన్మస్థానమునుండి విచ్చేసినారు. వారికి మాహృదయపూర్వకమైన స్వాగతమిచ్చుచున్నాము. వారు వ్రాసిన ఒక ఉత్తరమునందు, గ్రంథాలయోద్యమ ప్రతినిధిగకూడ శిక్ష ననుభవించుచున్నానని వ్రాసిరి. దీనినిబట్టియే గ్రంథాలయోద్యమమందు వారికి గల గాఢమైన అభిమానము వ్యక్తము కాగలదు.

గ్రంథాలయ ప్రతినిధుల మహాసభను ఈ సంవత్సరము మార్చి, ఏప్రిలు నెలలలోనైన తప్పక జరిపి, కృతకృత్యులయ్యెదరని గుంటూరు మండలమువారిని ప్రార్థించుచున్నాము.

## బాలభటోద్యమము-రామదండు-శాంతిసైన్యము.

బీసెంటమ్మగారి దయవలన మద్రాసు రాజధానియందు "భారతసర్వ బాలభటసంఘము"ను అంతరింపజేయుటతోడనే, ఆంధ్రదేశమందుగూడ బాలభటోద్యమ వ్యాప్తికి భంగము గలిగెను. అప్పుడు ఆంధ్రులు ప్రత్యేకమొక బాలభటసంఘమును స్థాపించి ఉద్యమమును సాగించి యుండిన బాగుండెడిది. కాని ఈ యుద్యమమును వ్యాప్తములోనికి దెచ్చిన ప్రధానులు తమకు సావకాశము లేకపోవుటచే, ప్రత్యేక సంఘస్థాపనకు బూనుకొనజాలరైరి. అయినను అంతవరకు తయారైన బాలభటులు దేశాభివృద్ధికై యుక్తసమయమున పాటుబడియుండుట మిక్కిలి ప్రశంసనీయము.

శ్రీ దగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి "రామదండు" సంస్థతో ఈలోటు కొంతవరకు తీరినది. పిమ్మట దేశీయ మహాసభవారిచే స్థాపితమైన "శాంతిసేన"గూడ కొంతవరకు పనిచేసినది.

అయినను ఈరెండు సంస్థలును చేయవలసినంత పని చేయలేకపోయెనని మాయభిప్రాయము. దానికి కారణము తగిన తరబీతునియ్యకపోవుటయే. శ్రీగోపాలకృష్ణయ్యగారు అంత త్వరగా శ్రీకృష్ణ జన్మస్థానమునకు పోయియుండని యెడల వారాలోటును పూర్తిజేసియే యుండియుందురు. మాకు తెలిసినంతవరకు "శాంతి"సేనలో జేరినవారికి ఒక్క పశ్చిమ గోదావరి మండలమందుదక్క మరియెచ్చటను తగిన తరబీతునిచ్చినటుల గానము. ఆజిల్లాయందైన ఒకసారి తరబీతునిచ్చి విడిచినటుల గాన్పించును. స్వచ్ఛందసేవకులకు తరబీతు ఒకసారి ఇచ్చి విడిచినయెడల చాలదు. దండునాయకులను అప్పుడప్పుడు ఒకచోటజేర్చి వారికి క్రొత్త తరబీతునొసంగుచుండవలెను. వారు ఆతరబీతును తమదండువారందరికిని క్రమముగా ఇచ్చుచుండవలయును. ఈవిధముగా తయారైన సేన అవసరమైనప్పుడు మొక్కవోవని ధైర్యసాహసముతో సేవచేయుటకు తయారుండును. ముందైన ఇట్టి తరబీతునొసంగుటకై తగుప్రయత్నములను చేయుదురని నమ్మెదము.

## గ్రంథాలయ సర్వస్వము.

అనివార్యములైన కారణములచే గ్రంథాలయ సర్వస్వమును ఇంతకాలము ఆపవలసివచ్చినది. చందాదారులును, పోషకులును, విలేఖకులును మన్నించి, ఎప్పటివలె ప్రోత్సహింతురని ప్రార్థన. ఇప్పటినుండి దీనిని మాసపత్రికగ ప్రకటించుటకు ఏర్పాటు చేసితిమి. సకాలమునకు వెలువడునటుల సర్వవిధముల ప్రయత్నములను జేసెదము. అందరియొక్క తోడ్పాటు వలనగాని ఈకార్యము నెరవేరునదిగాదు.

ఇంతవరకు ఐదవసంపుటమునందు రెండుసంచికలను ప్రకటించియుంటిమి. మాసపత్రికగ ప్రారంభించుటచే ఈసంచికనుండి ఆరవ సంపుటమును ప్రారంభించితిమి. ఐదవసంపుటమునకు చందాఇచ్చినవారికి కొదువబడిన సంచికలను ఆరవ సంపుటమునందిచ్చెదము.

# వివేకానంద పఠనమందిరము-దెందులూరు

సరస్వతీదేవి ఆలయమగు ఈగ్రంథాలయ భవనమున గతసంవత్సర మీ దినముననే మనమందర మానందమున సమావేశమై కార్యప్రణాళిని నిర్మించి నిర్వాహక సంఘము నేర్పరచితిమి. మన కార్య ప్రణాళి ననుసరించియే మరల కార్యనిర్వాహక వర్గము నేర్పాటుచేయుట కీదినమున కూడితిమి. అపనప్రారంభించుటకు ముందు గతసంవత్సర కా.ని. సంఘ మేవిధముగ పనిచేసెనో మనగ్రంథాలయ బాలికా స్వరూప మెట్టి పరిణామ మందెనో సంపర్శించుటకు మీరు కుతూహల పడుటలేదా! చూడుడు

| | పూర్వసంవత్సరము. | ప్రస్తుతసంవత్సరము. |
|---|---|---|
| పుస్తకములు | 955 | 1150 |
| సొమ్ము | 1452-12-6 | 1673-6-0 |
| చందాదారులు | 69 | 69 |
| పాఠకులు రోజునకు | 10 | 14 |

సొమ్ము మూలధనమందలి వడ్డీపెరుగుటలెప్ప వేరుగా సంపాదించినదిలేదు. వివాహకట్నములందు 40-8-0 మాత్రము వచ్చినది. ఇందుకని వారికి కృతజ్ఞత చూపవలసియున్నది. వడ్డీమించి ఖర్చుచేయకూడదను నిబంధనను దృష్టియందుంచుకొని వ్యవహరించితిమి. వడ్డీపైవచ్చిన ఆదాయము 130-12-0 వివాహకట్నములు 40-8-0 మొత్తం 171-4-0. మేముచేసిన సాంవత్సరిక ఖర్చు 98-11-6 మాత్రమే. మూలధనమునుండి ఖర్చుచేయుటకనుమతించబడిన దరఖాస్తు స్థలమందలిపాకకు 45-0-6లు ఈమొత్తమునకు వ్యయపరుపబడిన 143-12-0 కలుపుకొన్నను సాంవత్సరిక ఆదాయమున 27-8-0 మిగిలినది. మంచో, చెడ్డో, యీవిధముగ మితవ్యయము చేసితిమి. చేయవలసినఖర్చులేకగాదు మేమీవిధముగ మితవ్యయము చేసినది. సాంవత్సరికవిరాళములు లేవు. మూలధనమో స్వల్పము. కనుక జాగ్రతగా వ్యయముచేయ నుద్దేశ్యమే హేతువు.

బీరువా కొనవలసియున్నది. చదువరుల రాపిడిచే చిరిగిపోయిన పుస్తకములనేకములు బైండులు కట్టించవలసియున్నది. అనేక యుద్గ్రంథములు, వార్తాపత్రికలు తెప్పించవలసియున్నది. సమర్థులగు నుపన్యాసకుల రప్పించి ప్రజలందు విజ్ఞానవ్యాప్తిని గలిగించవలసియున్నది. పురాణపఠనము కవకాశము గలిగించవలసియున్నది. బాల, బాలికా, పుస్తకపఠనమునకింకను ప్రోత్సాహము కల్పించవలసియున్నది. ఇట్లే అనేకావశ్యక కార్యములు కలవు. అయ్యు శక్తికిమించి సాహసము చేయరాదు గదా! క్రమముగా నెరవేర్చ యత్నింతము. సత్సంకల్పముల సర్వేశ్వరుడు పోషించకపోడు. పుస్తకములు 195 మాత్రమే సమకూర్చబడినవి. ఇందు 115 పుస్తకములు సొంతఖర్చుతో కొనబడినవి. బొత్తువ్యయముతో నిమిత్తములేక చాల సదుపాయములగు వెలలకు కార్యదర్శిచే కొనబడినవి. తక్కిన యెనుబది పుస్తకములును సహృదయులగు దేశాభిమానులచే ఉచితముగ నొసంగబడియెను. వారికి మనయభివందనములర్పించి ఇట్టి ఉదారులసాయముకొరకింకను సర్వేశ్వరుని ప్రార్థింతము.

ఒకేసారి విరాళములిచ్చి గ్రంథములనేకులు సానుభూతి క్రియాపూర్వకముగ చూపియుండుటచేతను కొంచెమించుమించు ఆగూడాయముతో గ్రంథాలయము నిర్వహింపబడుట కవకాశము కలిగియున్నందునను, మరల వారినే వార్షికచందాదారులుగ నేర్పరచుట సమంజసముగ నుండదనితోచి ప్రయత్నించనందుననే చందాదారుల సభ్యుల సంఖ్య పెరుగలేదు. అవకాశమున్నంతలో యీసంవత్సరము యత్నము చేయదల్చితిమి. లోగడ విరాళములు వాగ్దానముచేసియు యింకనివ్వని వారి వద్దనుంచి వసూలుచేయ యత్నించితిమి. నిర్బంధనేమియులేక వారి యిచ్ఛాధీనమగుట, ఇదుగో, అదిగో అని జరుపుచుండిరి.

గట్టిగా అడిగి క్రియాపూర్వకము పొందుటకన్న క్రమముగా, యీమొహమాటము, సానుభూతి, నిలిపి క్రియను సాధించుటయే మాయుద్దేశ్యమగుటచే, పర్యవసానము చెప్పజాలనందుకు క్షమాపణ కోరుచున్నాము. సుగ్గశెట్టి పెదవెంకయ్యగారుమాత్రము గ్రంథాలయ భవనమునకు కొంత యిటుక వస్తా ఇచ్చితిరనియు ఆ ఖరీదు వారిచందాకు సరిపోగలదనియు చెప్పుచున్నారు. అది తేల్చవలసియున్నది. తక్కిన విరాళము లీసంవత్సరము వసూలు చేయుదము.

అంత తృప్తికరముగాకున్నను పాఠకులసంఖ్య కొంచెము హెచ్చుట మనము గమనింపదగినదే. ఇది గ్రంథాలయ సార్థకోద్దేశమగుట, యీయుద్దేశమును సాధించుటకే మనమందరము గట్టికృషి సలుపవలసియున్నది. పుస్తకము సన్మిత్రము. మనజీవితాభివృద్ధికి శ్రేయమును సాయపడును. మనకన్నివిధముల మేలొనగూర్చును. మనగృహకృత్యములు యితరఅవసర వ్యవహారములు నిర్వర్తించుకొనుచు తీరికసమయములందీపుస్తక పఠనావకాశమందరు ఉపయోగపరచుకొనదగును.

అట్లయిన- సోమరితనము, దుర్వ్యసనములు, అనవసర కలహములు నశించి- చిత్తశాంతి, సౌఖ్యము, కలుగగలదు. కర్తవ్యము బోధపడి సత్కార్య శూరుల మగుదుము.

ఈవత్సరము మనగ్రంథాలయ బాలికా జన్మదినోత్సవము సంతృప్తిగా జరిపినారము. ఇందువలన కార్యక్రమ మందరికిని తెలియపడుట, ఉద్దేశ్యములు విపులముగ వ్యాప్తిగాంచుట, తద్వారాప్రోత్సాహ మినుమడించి ప్రజా ప్రబోధము గలుగుట సమర్థులగు మహనీయుల సదుపదేశముల నాలకించు నదవకాశ మొదవుట, ఇట్టి సత్ప్రతిష్ఠాపనా నిర్మాణమునకు ప్రోత్సాహ మేర్పడుట, ఇట్టి యితరప్రతిష్టా పనలతో సంబంధమేర్పడుట కవకాశము గలుగుట, గ్రంథాలయ మనేకవిధముల ప్రజా సానుభూతిని సంపాదింప గలుగుట; మొదలగు మేళ్లొనగూడును. కనుక యిట్టి యుత్సవము లేటేట జరుపుటయావశ్యకము. మన గ్రామ యూనియను యొక్కయు, మన తాలూకా బోర్డుయొక్కయు సాయము పొంద కృషిసల్పితిమి. కాని తాలూకాబోర్డువారు సాయముచేయ నుద్దేశ్యముండియు ధనలోపమున చేయజాలరైరి. యూనియను వారును చాల సానుభూతి చూపి ధనలోపమున తగిన సాయమును చేయజాలనందులకు విచారించుచు జిల్లాగెజిటుమాత్రము తెప్పించి యొసంగు చున్నారు. ఇందుకు వారికి కృతజ్ఞత చూపుచు ఈవత్సర మయిన తగిన సాయమొసంగ వేడవలసి యున్నది.

ఇప్పటికి మూడుమార్లు కార్యనిర్వాహక సంఘము సమావేశమైయున్నది. ఆస్తిని కాపాడు విషయము ననుపుస్తకములు పాఠకుల కందజేయు విషయమునను అవసరమగు యితరవిషయముల గురించియు జాగ్రత తీసుకొనుచువచ్చిరి. దరఖాస్తు స్థలమందు పాక వేయించిరి. చివరసమావేశములో, నియమితరోజులకన్న పుస్తకములు హెచ్చుకాలముంచుకొన్నవారి వద్దనుండి వసూలు చేయవలసినసొమ్ము సకాలమున వసూలు చేయలేదనియు పుస్తకములు పారవేసినవారి వద్దనుంచి సొమ్ము వసూలు చేయుటలో ఉపేక్షచూపినందులకును అధ్యక్షకార్యదర్శుల నిరువుర మందలించుచు హెచ్చరించిరి.

ఇతరుల దృష్టిలో ఈవిధముగ కనుపడునట్లు మేము ఉపేక్ష చూపిన మాటనిజమే కాని మాయుద్దేశము పల్లెగ్రామములందు మనస్సు నొవ్వనిపద్ధతిని సాధ్యమయినంతవరకవలంభించి ప్రజలను పఠనాభిలాషుల చేయవలయుననుట మాముఖ్యవిధియని మీరంగీకరించక తప్పదు. అందువల్లనే సౌమ్యపద్ధతి నవలబించిన కారణమున ఆలశ్యము కనుపించినది. కార్యక్రమమున పుస్తకములు పారవేశిన వారందరి వద్దనుండియు సొమ్ము వసూలయ్యెను. కాని యెక్కువకాలముంచుకొన్న వారివద్దనుంచి వసూలు చేయు రుసుము చదువరులకు నిరుత్సాహము కలుగకుండుటకుగాను యీమారు వదలివేయుదమని వారికి సిఫారసు చేయునుద్దేశ్యమున నున్నాము.

గ్రంథాలయాభివృద్ధికవసరమనుకారణముచే మనగ్రంథాలయము రిజష్టరీచేయించవలెననియు, దే. సుబ్బయ్యగారిచ్చిన స్థలము విక్రయించవలెననియు 22—9—22 తేదిన సమావేశమునం దభిప్రాయపడి తమకు సిఫారసు చేయుచు తీర్మానించిరి. గాన యీవిషయము బాగుగా నాలోచించి నిర్ణయించ కోరుచున్నాను.

ముందుకార్య క్రమమున కావశ్యకమగు నిబంధనల నేర్పరచి యిందుతో జత పరచితిమి. ఇందలి మంచి చెడ్డల నిదానముగ నర్చించి నిర్ధారణచేయ కోరుచున్నాను.

ఇదిస్థితి. ఇందుపై అవసరమగు చర్యతీసుకొని ముందు కార్యము నుపక్రమించవలెను. గతవత్సరము కార్యదర్శిగారిచే వప్పగింత చేయబడిన జాబితాదాఖలా రబ్బరు స్టాంపు చిత్రపటములు గడియారము వగయిరా యీవదాస్తి జాగ్రతగా కాపాడబడియున్నవి.

21—10—22 }
దెందులూరు }

ఇట్లు
మొటపర్తి వెంకటనారాయ

కార్యదర్శి

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A191 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | No |
| వెనుక అట్ట | No |
| మొత్తం పేజీలు | 47 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 9 |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |